www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 230 | శనివారం 10-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

తెలుగు ప్రజలపై

మొసలి కన్నీరు

బడ్జెట్‌లో తీరని అన్యాయం

- ధరల నియంత్రణ, నిరుద్యోగం ప్రస్తావనే లేదు
- రాష్ట్ర విభజనపై మోడీ వ్యాఖ్యలు సరికాదు
- చరిత్ర వక్రీకరణకు హిందూత్వ శక్తుల కుట్ర
- తిట్ల పురాణం ఆపాలని టీఆర్ఎస్, కాంగ్రెస్‌కు హితవు
- సురవరం నిశిత విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న సురవరం. పక్కన నారాయణ, చాడ వెంకటరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్ :
ధరల నియంత్రణ, నిరుద్యోగ నివారణకు బడ్జెట్‌లో కనీస ప్రతిపాదనలు చేయలేదని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి విమర్శించారు. 2018–19 వార్షిక బడ్జెట్‌పై చర్చ ముగిసిన అనంతరం ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఇచ్చిన సమాధానంలో కొత్తదనమేమీలేదని స్పష్టం చేశారు. బడ్జెట్‌లో మార్పులు, ప్రతిపాదనలు ఉంటాయని భావించామని, అయినా అందులో కొత్తదనమేమీ లేదన్నారు. ఇటు అరుణ్ జైట్లీ, అటు ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగాల్లో పసలేదని విమర్శించారు. ఏపీ, తెలంగాణపై మోడీ మొసలి కన్నీరు కార్చారని అన్నారు. శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ జాతీయ కార్యదర్శి

- మిగతా 2 లో

దిగొచ్చిన కేంద్రం..?

- లోటు భర్తీకి సుముఖత
- ఏ నిమిషంలోనైనా రైల్వేజోన్ ప్రకటన
- ఆదేశాలు జారీ చేసిన జైట్లీ
- దుగరాజపట్నం బదులు వేరేచోట పోర్టు..!



పార్లమెంట్‌లో నిరసన తెలుపుతున్న శివప్రసాద్, మురళీమోహన్, మాగంటి బాబు, గల్లా జయదేవ్, తోట నరసింహం తదితరులు

న్యూఢిల్లీ :
రాష్ట్రంలో వామపక్షాల పిలుపు మేరకు జరిగిన బంద్‌లో పెల్లుబుకిన జానాగ్రహం తలకెక్కినట్టుంది. పార్లమెంట్‌లో మిత్రపక్షమైన తెలుగు దేశం పార్టీ సమావేశాలను స్తంభింపజేయడం సిగ్గుగా అనిపించినట్టుంది. ఎట్టకేలకు కేంద్రం దిగొచ్చింది. ఈ విషయాన్ని పార్లమెంటు సాక్షిగా ఒప్పుకోవడానికి అహం అడొచ్చినట్టుంది. ఆనక జరిగిన సమావేశంలో ఏపీ డిమాండ్లను నెరవేర్చడానికి కేంద్రం సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. విభజన హామీల అమలు, బడ్జెట్‌లో జరిగిన అన్యాయం సరిదిద్దడానికి కేంద్రం సమాయత్తమవుతున్నట్లు సమాచారం. ఈ విషయంలో ఓటమిని అంగీకరించకుండానే డిమాండ్ల పరిష్కారానికి చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలిసింది. ఏపీ ఎంపీల ఆందోళన ఎట్టకేలకు ఫలించింది. రాష్ట్ర రెవెన్యూ లోటు భర్తీకి కేంద్రం సానుకూల సంకేతాలు ఇచ్చింది. 2014–15 సంవత్సరానికి గాను 14వ ఆర్థికసంఘం నిబంధనల ప్రకారం 10 నెలల కాలానికి రాష్ట్రానికి రావాల్సిన

- మిగతా 2 లో

హోదా కోసం ఐక్య పోరు : రాహుల్ 2లో



రాజస్థాన్ సీఎంకు
అసమ్మతి సెగ
- పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి
- తక్షణం పార్టీ నాయకత్వాన్ని మార్చాలని అమిత్‌షాకు లేఖ

9లో

బీజేపీ
అధికార దాహం
- గిరిజనులకు భూ పంపిణీలో లెఫ్ట్ సర్కారే టాప్
- త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ముఖచిత్రం

9లో

సరోగసీతో పిల్లల్ని కంటే
ప్రసూతి సెలవులు
- కేంద్ర ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు

9లో

గుండ్లకమ్మ వాగులో
విద్యార్థుల గల్లంతు
- ముగ్గురు మృతి, ఒకరు సురక్షితం

11లో



ఎన్జీఓల జాడేది?

- అధికార పక్షం చెబితేనే ఉద్యమాలా?
- ప్రజలతో కలిసి రారా?



విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి
సమైక్యంగానే ఆంధ్రప్రదేశ్ ఉండాలని, రాష్ట్రం విడిపోకూడదని చేసిన ఉద్యమస్ఫూర్తి ఇపుడు ఏమైందో అర్థంకావడం లేదు. సమైక్యాంధ్ర కోసం మూడున్నరేళ్ల క్రితం సాగిన ఉద్యమంలో అన్నివర్గాల ప్రజలూ స్వచ్ఛందంగా పాల్గొని ఉద్యమానికి ఊపిరి అందించారు. అప్పుడు చిన్నా,పెద్ద అన్న తేడా లేకుండా అన్ని సంఘాలు ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యాయి. అయితే, ఏపీ ఎన్జీఓలు మాత్రం అత్యధికంగా మైలేజీ పొందారు. ఉద్యోగ సంఘాల్లో ఎక్కువగా పరపతినీ, పలుకుబడినీ పొందగలిగింది ఏపీ ఎన్జీఓలే. పోరాటాలు ఎన్నిచేసినా, రాష్ట్ర విభజన ఆగలేదు. కొత్త రాష్ట్రం, కొత్త సమస్యల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రితో పాటు అన్ని శాఖలూ దశలవారీగా అమరావతికి తరలి వచ్చాయి. గడచిన మూడున్నరేళ్లుగా రాష్ట్రానికి కేంద్రం ఏ స్థాయిలోనూ సహాయ, సహకారాలు అందించ లేదు. విభజనచట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ పట్టించుకోవడం లేదు. 2014 ఎన్నికల ముందు ప్రత్యేక హోదా ఐదు, పది, పదిహేనేళ్లు అని చెప్పి...మాట తప్పిన బీజేపీ ప్రభుత్వంపై పోరాటం చేస్తారని ఎన్జీఓ సంఘం వైపు అందరూ ఎదురుచూశారు. ప్రత్యేక ప్యాకేజీకి ముఖ్యమంత్రి సుముఖత చూపడంతో ఎన్జీఓలు అదే దారిలో నడిచారు. ఆ తర్వాత పోలవరం, విశాఖరైల్వేజోన్, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు వంటి అంశాలను కేంద్రం పక్కన బెట్టినా సరే... ఎన్జీఓలు మారు మాట్లాడకుండా ఉండిపోయారు. అధికార పార్టీ ఏది చెబితే అదే అన్నట్లుగా వ్యవహరిస్తుందనే విమర్శలను ఏపీ ఎన్జీఓలు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై వామపక్షాలు ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు ఎన్జీఓలు దూరంగానే ఉన్నారు. అధికారపార్టీతో జతకట్టడం తప్పు...రాష్ట్రానికి జరిగిన

- మిగతా 2 లో

మే 6న నీట్

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- 15% జాతీయకోటాకు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకూ అర్హత
- ఆధార్ తప్పనిసరి



న్యూఢిల్లీ:
మెడికల్/డెంటల్ కాలేజీల్లో ప్రవేశాల కోసం జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్–2018)ను మే నెల 6వ తేదీన నిర్వహించనున్నామని సీబీఎస్ఈ ప్రకటించింది. దేశవ్యాప్తంగా వివిధ వైద్య/దంత కళాశాలల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల్లో చేరగోరే విద్యార్థులు నీట్ కోసం దరఖాస్తు చేసుకొనేందుకు నోటిఫికేషన్ జారీచేసింది. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నది. మార్చి 7వ తేదీ వరకు

- మిగతా 2 లో

మాతృవందనంకు గ్రహణం


- వైద్య, ఆరోగ్య శాఖ నిలువెత్తు నిర్లక్ష్యం
- 4 లక్షల మంది గర్భిణులు, బాలింతలకు అందని సాయం
- ప్రచారం, అవగాహన కల్పన శూన్యం



విశాలాంధ్ర–విశాఖపట్నం :
వైద్య, ఆరోగ్య శాఖ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో ప్రధాన మంత్రి మాతృవందన యోజన (పీఎంఎంవీవై) పథకం నీరుకారిపోయింది. దీంతో రాష్ట్రంలోని లక్షలాది మంది గర్భిణులు,పాలిచ్చే తల్లులకు పోషకాహారం అందకుండా పోతున్నది. పోషకాహారం లోపంతో గర్భిణులు, బాలింతల్లో తలెత్తే సమస్యలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం 2017 జనవరి 1న ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా రూ. 6000లను మహిళలకు అందచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకంపై అవగాహన, సహకారం, ప్రచారం కల్పించకపోవడంతో రాష్ట్రంలోని దాదాపు 4 లక్షల మంది గర్భిణులు ఈ సాయం అందుకోలేక పోయారు. అంగన్‌వాడీల ద్వారా ఈ

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఇప్పుడు మీరు మాకు మొండిచెయ్యి.. వచ్చే ఎన్నికల్లో మేము మీకు 'మొండిచెయ్యి'

సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శిగా గిడ్డయ్య

సహాయ కార్యదర్శులుగా రసూల్, మునెప్ప



విశాలాంధ్ర– కర్నూలు సిటీ :
సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శిగా బి.గిడ్డయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ జిల్లా 22వ మహాసభల్లో జిల్లా సహాయ కార్యదర్శు లుగా ఎస్ఎన్ రసూల్, ఎస్.మునెప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏడుగురితో జిల్లా కార్యదర్శివర్గాన్ని, ఒకరు ఆహ్వానితులుగా, 21 మందితో కార్యవర్గాన్ని ఇద్దరు ఆహ్వా నితులుగా 75 మందితో సమితిని మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్య దర్శిగా ఎన్నికైన గిడ్డయ్యకు పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

హైకోర్టు తరలింపులో కదలిక

గన్నవరం వెటర్నరీ యూనివర్సిటీని పరిశీలించిన బృందం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి :
హైకోర్టు తరలింపు అంశంలో ఎట్టకేలకు కదలిక ప్రారంభమైంది. హైదరాబాద్‌లో వున్న తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు విభజనకు కేంద్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో స్వంత భవనాలు నిర్మించేవరకు వేచి చూడకుండా తాత్కాలిక భవనాల్లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈనేపథ్యంలో

- మిగతా 2 లో



మళ్లీ స్తంభించిన అమెరికా ప్రభుత్వం

వాషింగ్టన్ : కొత్త బడ్జెట్‌ను గడువులోపల ఆమోదించడంలో అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) విఫలం కావడంతో ప్రభుత్వం ఈ ఏడాది రెండవసారి స్తంభించిపోయింది. సెనేట్‌లో చర్చలు జరిగిన తరువాత చివరిలో రిపబ్లికన్ అభ్యర్థి రాండ్‌పాల్ అభ్యంతరాలు తెలియజేశారు. ఎట్టకేలకు బిల్లును సెనేట్ ఆమోదించి ప్రతినిధుల సభ ఆమోదానికి బిల్లును పంపారు. ఫెడరల్ రిజర్వు నిధులు అందించడానికి ఉన్న గడువు గురువారం అర్థరాత్రితోనే ముగిసింది. మరో 300 బిలియన్ డాలర్లను ప్రభుత్వ ఖర్చు నిమిత్తం మంజూరు చేసేందుకు 600 పేజీలుగల ప్రణాళికను ప్రతిపాదించారు. ఈనిధులు రక్షణ, దేశీయ సేవల విభాగాలకు ఖర్చు చేస్తారు. ప్రతినిధుల సభ ఆమోదించి అధ్యక్షుడు సంతకం చేస్తే తిరిగి ప్రభుత్వ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. అయితే ప్రతినిధుల సభ బిల్లును ఈరోజు ఆమోదించగలదా అన్న ప్రశ్న తలెత్తింది. ప్రభుత్వ కార్యకలాపాలు నిలిచిపోతే పరిస్థితి ఏమిటన్నది ఆందోళనకర అంశం. సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతారు. గత నెలలోనే గడువులోపల కాంగ్రెస్ నిధుల మంజూరును ఆమోదించకపోవడంతో 3,4 రోజులు ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. సైనిక సిబ్బంది, విమానయాన కంట్రోలర్లు ప్రభుత్వం స్తంభించినప్పటికీ పనిచేయవలసి వుంటుంది. మూడువారాల క్రితం తలెత్తిన ఇలాంటి పరిస్థితిమూలంగా అనేక రంగాలలో కార్యకలాపాలు నిలిచిపోయాయి. అయితే ఈసారి ఏఏ రంగాలు ప్రభావానికి గురవుతాయనే అంశం ఇంకా తెలియవలసివుంది. ప్రభుత్వ స్తంభనను నివారించకపోతే అనేక ప్రభుత్వ ఏజెన్సీలపైన వాటిలో పనిచేసే సిబ్బందిపైన తీవ్ర ప్రతికూల ప్రభావం ఉంటుందని సిఎన్ఎన్ తెలిపింది.

విశాలాంధ్ర ప్రపంచం

ఇజ్రాయిల్ దాడిని తిప్పి కొట్టాలి : లెబనాన్



బీరుట్ : ఇజ్రాయిల్ దాడిని తిప్పికొట్టాలని లెబనాన్ అత్యున్నత రక్షణమండలి సైన్యాన్ని ఆదేశించింది. దక్షిణ ప్రాంత సరిహద్దుల్లో గోడ నిర్మాణాన్ని కూడా నిరోధించాలని కోరింది. ఉన్నత రక్షణమండలి అసాధారణ సమావేశం ముగిసిన తరువాత బ్రిగేడియర్ జనరల్ సదల్లాహమద్ మాట్లాడుతూ సరిహద్దుల్లో గోడ నిర్మాణమే లెబనాన్ సార్వభౌమాధికారంపై దాడిగా పరిగణించాలన్నారు. ఇజ్రాయిల్‌ను ఎదుర్కోవాలని లెబనాన్‌కి అడ్డుగా నిర్మిస్తున్న గోడను నిరోధించాలని ఆయన కోరారు. రెండు దేశాల సరిహద్దులో రాస్‌నఖౌరా నగరంవద్ద ఇజ్రాయిల్ సైన్యం గోడ నిర్మాణాన్ని ప్రారంభించినట్టుగా అల్‌మనార్ టెలివిజన్ తెలియజేసింది. ఇజ్రాయిల్ మయోపాయాలను తిప్పికొట్టాలని లెబనాన్ భద్రతా విభాగాలను ఆయన ఆదేశించారు. లెబనాన్‌ను ఏ భాగాన్ని అయినా వదులుకునేందుకు తాము సిద్ధంగాలేమని ప్రధానమంత్రి సాద్‌హరిరి తెలిపారు. ఇజ్రాయిల్‌పైన అంతర్జాతీయంగా ఒత్తిడి తీసుకువచ్చి సంఘర్షణ నివారించేందుకు తాము ప్రయత్నిస్తున్నామని హరీరి తెలిపారు. వివాదాస్పదమైన 9వ బ్లాక్‌కు సంబంధించిన అంశాన్ని దౌత్యపరంగా పరిష్కరించుకోవాలని ఇజ్రాయిల్ ఇంధన శాఖ మంత్రి యువల్‌స్టెయింటిజ్ చెప్పినట్టుగా తెలుస్తోంది. అంతేకాదు అమెరికా మధ్యవర్తిత్వానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు.

పశ్చిమాసియాలో భారత్ ప్రముఖ పాత్ర వహించాలి

పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్ సూచన

రమల్లా : పశ్చిమాసియాలో శాంతికోసం జరిగే కృషిలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రముఖపాత్ర వహించాలని పాలస్తీనా అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బాస్ కోరారు. మోడీ పాలస్తీనాలో పర్యటించనున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమాసియాలో భారత పాత్రపైన తాను చర్చించనున్నట్టు తెలిపారు. ఈనెల 10వ తేదీనుంచి మోడీ పశ్చిమాసియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పాలస్తీనాకు కూడా వెళతారు. ఇజ్రాయిల్‌తో తుది ఒప్పందం కోసం జరిగే చర్చలకు బహుళపక్షాల వేదికను ఏర్పాటు చేయడంలోను మోడీ పాత్ర వహించాలని ఆయన కోరారు. పాలస్తీనాలో భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి అవుతుంది. శనివారం ఆయన రమల్లా చేరుకుంటారు. ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలెంను గుర్తిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన తరువాత ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. ట్రంప్ ఏకపక్షంగా చేసిన ఈ ప్రకటనను ఐక్యరాజ్యసమితిలో 128 దేశాలు సవాలు చేశాయి. ఈ దేశాలలో భారతదేశం కూడా ఉంది. ట్రంప్ చేసిన ప్రకటనకు చట్టబద్ధత ఉండదని ఐక్యరాజ్యసమితి తెలిపింది. పూర్వం నుంచి పాలస్తీనా భారతదేశం మధ్య బలమైన మంచి సంబంధాలు ఉన్నాయని నరేంద్ర మోడీ చారిత్రాత్మక పర్యటనను తాము స్వాగతిస్తున్నామని అబ్బాస్ పిటిఐకి ఇచ్చిన ఈమెయిల్ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇజ్రాయిల్, పాలస్తీనా మధ్య ఘర్షణలో భారతదేశం ఇటీవలకాలంలో దూరంగానే ఉంది. అయితే అబ్బాస్ మాత్రం భారతదేశం ప్రముఖపాత్ర వహించాలని కోరుకుంటున్నారు.



ఇటీవల జరిగిన పరిణామాలను తాను మోడీకి వివరిస్తానని ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు భారత్ ప్రముఖపాత్ర వహించాలని అబ్బాస్ తెలిపారు. మోడీతో ఆర్థిక తదితర సమస్యలపైన కూడా చర్చిస్తామన్నారు. అంతర్జాతీయ రంగంలో భారతదేశం అత్యంత గౌరవస్థానం కలిగివుందని ఆయన చెప్పారు. ఇజ్రాయిల్, పాలస్తీనా రెండు దేశాలుగా అవతరించాలని సుదీర్ఘకాలంగా భారతదేశం కోరుకుంటున్న విషయాన్ని కూడా అబ్బాస్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గతంలో పాలస్తీనా విముక్తి పోరాట యోధుడు యాసర్ అరాఫత్‌తో భారతదేశానికి చిరకాల సంబంధాలు ఉన్నాయి. పాలస్తీనా స్వతంత్ర దేశంగా అవతరించడానికి అమెరికా, ఇజ్రాయిల్ అడ్డంకిగా ఉన్నాయి. అలీన ఉద్యమం పాలస్తీనాకు బాసటగా నిలిచింది. అమెరికా మూలంగానే ఇంతవరకు పాలస్తీనా స్వతంత్రదేశంగా అవతరించలేదు.

బంగ్లాదేశ్‌లో ఖలీదా, హసీనా మధ్య పోరు





ఢాకా : బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ నాయకురాలు, మాజీ ప్రధానమంత్రి ఖలీదా జియాకు కోర్టు ఐదేళ్లు జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పింది. అనాథలకోసం ఏర్పాటు చేసిన ట్రస్టు నుండి 2,52,000 డాలర్లను ఖలీదా దుర్వినియోగం చేసినట్టు ఆరోపించగా కోర్టు విచారణ జరిపి శిక్ష విధించింది. అయితే ప్రస్తుత ప్రధానమంత్రి షేక్‌హసీనా ఖలీదాల మధ్య సుదీర్ఘ కాలంగా వైరుధ్యం, పోరు కొనసాగుతున్నాయి. తనపై వచ్చిన ఆరోపణలు రాజకీయ దురుద్దేశంతో చేసినవేనని ఖలీదా అన్నారు. ఆమె కుమారుడు తారిక్‌రెహమాన్ మరో నలుగురిపైన కేసులు విచారణ జరిపి పదేళ్లు జైలుశిక్ష విధించగా వారు ప్రస్తుతం జైలులోనే ఉన్నారు. ఖలీదాను ఆమె పార్టీ నాయకులను రాజకీయాలలోకి రాకుండా చేయాలని ప్రధాని షేక్ హసీనా కేసులు పెట్టించారన్న ఆరోపణలున్నాయి. దాదాపు రెండు దశాబ్దాలకుపైగా ఈ ఇరువురు నేతలు రాజకీయాలలో ప్రముఖంగా ఉన్నారు. ఈ ఏడాది డిసెంబరులో జరగనున్న ఎన్నికల్లో ఖలీదా పోటీ చేయకుండా నివారించేందుకే షేక్ హసీనా వ్యూహం పన్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఖలీదాకు 72 ఏళ్లు, హసీనాకు 70 ఏళ్లు. బేగంలు ఇరువురు తగాదాపడుతూ బంగ్లాదేశ్ రాజకీయాలను గత 30 ఏళ్లుగా కలుషితం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. 1991లో ఖలీదా ప్రధానమంత్రి అయ్యారు. అప్పటినుంచి ఖలీదా, హసీనామధ్య వైరుధ్యం ప్రారంభమయ్యింది. హసీనా బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన ముజఫర్ రహమాన్ కుమార్తె. 1971 డిసెంబర్‌లో బంగ్లాదేశ్ పాకిస్తాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశంగా అవతరించింది. అనంతరం 1975లో సైనిక తిరుగుబాటు సందర్భంగా ఆయనను హత్య చేశారు. ఎక్కువ మంది కుటుంబసభ్యులు కూడా హత్యకు గురయ్యారు. ప్రతిపక్షనేత ఖలీదా సైనిక అధికారి జియావుర్ రహమాన్ సతీమణి. జియావుర్ రహమాన్ 1977 నుంచి 81 వరకు దేశాధ్యక్షుడుగా నియంతృత్వపాలన చేశారు. ఆయన కూడా హత్యకు గురయ్యారు.

అమెరికా, కొరియా మధ్య చర్చలు అవసరం

ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రస్ సూచన

సియోల్ : అమెరికా, ఉత్తరకొరియా మధ్య చర్చలు జరగడం తక్షణావసరమని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ఉన్నారు. కొరియా ద్వీపకల్పంలో మరింత ఉద్రిక్తతలు చోటుచేసుకుని సంక్షోభం ఏర్పడకుండా నివారించేందుకు ఈ రెండు దేశాల మధ్య చర్చలు జరగాలని అన్నారు. ఉద్రిక్తతలు పెరిగి పరిస్థితి అధ్వాన్నంగా తయారవడానికి దోహదం చేసిన పొరపాటు అవగాహనపై పలుమార్లు చర్చలు జరగాలని ఆయన సియోల్ రేడియోకిచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఉత్తరకొరియా భద్రతకు ముప్పు కలగకుండా ఆదేశంతో చర్చలు జరపాలని గుటెర్రస్ అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య చర్చలకోసం తాను అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఉత్తరకొరియా సియోల్‌లో జరిగే ఒలింపిక్స్ క్రీడలకు తన క్రీడాబృందాన్ని పంపించినందున అమెరికాతోటి చర్చలు సాధ్యమవుతాయని తాను విశ్వసిస్తున్నట్టుగా గుటెర్రస్ చెప్పారు. శాంతియుతంగా ఉత్తరకొరియాను అణ్వస్త్రరహితం చేసేందుకు కృషి జరగాలని అన్నారు. ఐరాస కొరియాపైన విధించిన ఆంక్షలు ఆదేశంపై గొప్ప ప్రభావం కలిగించాయని అన్నారు. అమెరికా ప్రతిపాదించిన సైనిక చర్యను గుటెర్రస్ తిరస్కరించారు. శాంతిని పరిరక్షించటం అంతర్జాతీయ సమాజం బాధ్యతని అందుకు రాజకీయ కట్టుబాటు ఉండాలని గుటెర్రస్ అన్నారు.



శుక్రవారం నుంచి ప్రారంభమైన సియోల్ ఒలింపిక్స్‌కి గుటెర్రస్ హాజరయ్యారు. ఈ ఒలింపిక్స్ జరిగే ప్రాంతాన్ని ఇప్పటికే శాంతియుత ప్రాంతంగా ప్రకటించారు.

హోదా కోసం ఐక్య పోరు

రాజకీయ పార్టీలకు రాహుల్ మద్దతు

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎట్టకేలకు స్పందించింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, శీఘ్రగతిన పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయడం సహా ఇతర డిమాండ్లపై ఐక్యంగా పోరాడాలని అన్ని రాజకీయ పార్టీలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చేశారు. ఏపీకి న్యాయం జరిగే వరకూ అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని రాహుల్ సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు, ఆ రాష్ట్ర ఎంపీల ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. 'ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రజల డిమాండుకు కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మద్దతిస్తోంది. ఈ డిమాండ్లపై పార్టీలన్నీ ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. ఏపీ ప్రజల న్యాయమైన డిమాండ్లకు అండగా ఉంటాం' అని రాహుల్‌గాంధీ శుక్రవారం ట్వీట్ చేశారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయం, ప్రత్యేకహోదా, విశాఖలో రైల్వే జోన్, దుగరాజపట్నం నిర్మాణం, కడప ఉక్కు ఫ్యాక్టరీ, ఇతర విభజన హామీల అమలు కోసం వారం రోజులుగా టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్లమెంటులో ఆందోళన చేస్తున్నాయి. ప్రత్యేకహోదా సాధన కోసం పార్లమెంటు లోపలా, వెలుపలా వైసీపీ, కాంగ్రెస్ ముందుండి పోరాడుతున్నాయి. ఎన్‌డీఏ భాగస్వామి టీడీపీ సైతం ఆందోళనలో పాల్గొంటున్నది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం డిమాండ్లన్నీ సత్వరమే అమలు చేయాలని ఆ పార్టీలు పోరాడుతున్నాయి.

దిగొచ్చిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం వెంటనే ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో పాటు మూడేళ్లకు సంబంధించిన మొత్తాన్ని కూడా ఒకేసారి విడుదల చేసేందుకు అంగీకరించినట్లు సమాచారం. ఏపీ అంశాలపై పరిష్కారానికి కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ, రైల్వే మంత్రి పీయూష్ గోయల్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో సుజనా చౌదరి సమావేశమయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు చర్చించారు. ఏపీకి ఇవ్వాల్సిన నిధులు, రైల్వేజోన్, పలు సంస్థల ఏర్పాటు వంటి కీలక అంశాలపై ఈ భేటీలో చర్చించారు. ఏ నిమిషంలోనైనా రైల్వేజోన్ ప్రకటించాలని పీయూష్ గోయాల్‌ను అరుణ్‌జైట్లీ ఆదేశించారు. అలాగే దుగరాజపట్నటం పోర్టు విషయంలో రక్షణ పరమైన ఇబ్బందుల ఉన్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని, ఆ పోర్టును రాష్ట్ర ప్రభుత్వం చూపించిన ప్రదేశంలో నిర్మించేందుకు కేంద్రం సంసిద్ధత వ్యక్తంచేసింది. దీనికి నిధులు విడుదల చేయడంతో పాటు అన్ని అనుమతులు ఇచ్చేందుకు కేంద్రం ముందుకొచ్చింది. అయితే, పార్లమెంట్ నియమ నిబంధనలకు లోబడి ఈ ప్రకటనలేవీ సభలో ప్రస్తావించలేదని జైట్లీ చెప్పినట్లు తెలుస్తోంది.

పార్లమెంట్‌లో స్పందన కరవు

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీల ఐదు రోజుల ఆందోళన, రాష్ట్ర బంద్‌తో ప్రజలు వ్యక్తం చేసిన ఆగ్రహం గంగలో కలిసిపోయింది. కేంద్రం ఏపీ ఎంపీల ఆందోళనను లైట్‌గా తీసుకుంది. పార్లమెంటు ఉభయ సభల్లో కూడా చివరి రోజైన శుక్రవారం ఏపీ ఎంపీలు తమ ఆందోళన కొనసాగించారు. అయితే కేంద్రం మాత్రం ఏపీ పట్టనట్టు వ్యవహరించింది. ఏపీ ఎంపీల డిమాండ్ల జోలికే పోకుండా సాగిన కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రసంగం సర్వత్రా అసంతృప్తిని మిగిల్చింది. పార్లమెంటులో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కూడా వివిధ రూపాల్లో మూడు పార్టీలకు చెందిన ఎంపీలు తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఆఖరికి లోక్‌సభలోని స్పీకర్ వెల్‌లోకి వెళ్లి కూడా పడుకుని నిరసన వ్యక్తం చేసినా కేంద్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. పార్లమెంటు బడ్జెట్ తొలి దశ శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు అరుణ్ జైట్లీ ఏదో ప్రకటన చేస్తారనే ప్రచారం గట్టిగా జరిగింది. లోక్‌సభ మధ్యాహ్నమే నిరవధికంగా వాయిదా పడింది. ఐదు రోజుల పాటు చేసిన నిరసనలకు ఫలితంగా కేంద్రం స్పందిస్తుందని భావించారు. కానీ ఏ మాత్రం కనికరించకుండా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మాత్రం పాతపాటే పాడి మమ అనిపించేశారు.

మే 6న నీట్

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. పరీక్షను హిందీ, ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, గుజరాతీ, తమిళం, కన్నడ, మరాఠీ, ఒరియా, బెంగాలీ, అస్సామీ భాషల్లో నిర్వహిస్తామని పేర్కొన్నది. నీట్ 2018 అధికార వెబ్‌సైట్‌లో విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించింది. సీబీఎస్‌ఈ జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం ఓపెన్ స్కూల్ విద్యార్థులు నీట్ రాయడానికి అనర్హులు. భారత పౌరులు, ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ), విదేశాలలో ఉన్న భారతీయులు (ఓసీఐ), విదేశాల్లో ఉన్న భారత సంతతికి చెందిన వారు (పీఐవో), విదేశీయులు నీట్-2018కు అర్హులు. అభ్యర్థులు ఎంబీబీఎస్/బీడీఎస్ మొదటి సంవత్సరం కోర్సులో చేరే సమయానికి లేదా ఈ ఏడాది డిసెంబర్ 31నాటికి 17 ఏండ్లు నిండినవారై ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిని 25 ఏండ్లుగా విధించారు. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ విద్యార్థులకు ఐదేండ్ల సడలింపు నిచ్చారు. ఈ ఏడాది 12వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా నీట్ రాయవచ్చని సీబీఎస్‌ఈ తెలిపింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు 2018-19 విద్యా సంవత్సరం నుంచి తమ ఎంబీబీఎస్/బీడీఎస్ సీట్ల కేటాయింపులో 15% జాతీయ కోటాను అనుమతించాలని నిర్ణయించినందున ఆ రెండు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కూడా 15% జాతీయకోటాకు అర్హత పొందుతారని వివరించింది. పూర్తి వివరాలు నీట్-2018 వెబ్‌సైట్ http://cbseneet.nic.inలో ఉన్నట్టు సీబీఎస్‌ఈ పేర్కొంది.

ఆధార్ నంబర్ తప్పనిసరి

ఎంబీబీఎస్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్)కు ఆధార్ నంబర్ తప్పనిసరి అని సీబీఎస్‌ఈ స్పష్టం చేసింది. అసోం, మేఘాలయ, జమ్మూకశ్మీర్ మినహా మిగిలిన రాష్ట్రాల అభ్యర్థులు ఆధార్ నంబర్‌ను దరఖాస్తులో నింపాలని సూచించింది. లేని యెడల ఆ దరఖాస్తును భర్తీ చేయడం సాధ్యం కాదని సీబీఎస్‌ఈ స్పష్టం చేసింది. నీట్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఆధార్ నంబర్ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి. ఇప్పుడు ఇంటర్ చదువుతున్న చాలా మంది విద్యార్థులు.. ఆధార్ కార్డులను వారి చిన్న వయసులో దిగి ఉంటారు. విద్యార్థుల ఆధార్ కార్డులోని ఐరిస్, ఫింగర్ ప్రింట్స్ ప్రస్తుతం వారి వయసు రీత్యా వ్యత్యాసం రావొచ్చు. ఇటీవలే జేఈఈకి దరఖాస్తు చేసుకున్నప్పుడు.. ఇంటర్ విద్యార్థులు ఈ సమస్యను తీవ్రంగా ఎదుర్కొన్నారు. కావున తల్లిదండ్రులు అప్రమత్తమై తక్షణమే సమీపంలో ఉన్న ఆధార్ సెంటర్లో కొత్తగా ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవడం మంచిది.

మొసలి కన్నీరు

(మొదటిపేజీ తరువాయి)

డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డితో కలిసి సురవరం మాట్లాడారు. రైల్వే ప్రతిపాదనల పట్ల దేశవ్యాప్తంగా గందరగోళ పరిస్థితి నెలకొందని, కేటాయింపులపై స్పష్టత లేదని, ఏ రాష్ట్రానికి ఎంత కేటాయించారో స్పష్టంగా ప్రకటించలేదన్నారు. పెట్రోలు, డీజిల్‌పై రూ.2 కస్టమ్ డ్యూటీ తగ్గించామని ఆర్థికమంత్రి ప్రకటించగా, కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి మాత్రం రూ.2 తగ్గించలేదని ప్రకటించి ఆర్థిక మంత్రిని, పార్లమెంటును అవమాన పరిచారన్నారు. ప్రజలకు, పార్లమెంటుకు మధ్య తగువు ఘర్షణ సృష్టించడానికి ఆర్థిక కార్యదర్శి ప్రకటనలు చేశారన్నారు. మోడీ పార్లమెంటులో ప్రసంగిస్తూ రాజకీయ ప్రత్యర్థులపై విషం కక్కారన్నారు. ధరలు తగ్గించడం, వ్యవసాయ రంగానికి కేటాయింపులు, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత ఊసే లేదన్నారు. మోడీ చరిత్ర తెలియకుండా మాట్లాడుతున్నారని, సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు తెలియకుండా నెహ్రూ ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని, నెహ్రూ సోషలిస్టు భావాలు కలిగిన వ్యక్తి అయినందునే హిందూత్వ శక్తులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని సురవరం విమర్శించారు. అన్ని రంగాల్లో మోడీ ప్రభుత్వం విఫలమైందని, ప్రత్యేక హోదా సాధన కోసం కమ్యూనిస్టులు ఇచ్చిన పిలుపు మేరకు ఏపీ బంద్‌లో పాల్గొన్న ప్రజలకు సురవరం అభినందనలు తెలిపారు. బిజెపి మినహా అన్ని రాజకీయ పక్షాలు బంద్‌లో పాల్గొన్నాయని, ఏపీకి ప్రత్యేక హోదాను కేంద్రం తుంగలో తొక్కిందని విమర్శించారు. మోడీ తన ఆవేశపూరిత ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ఏం న్యాయం చేశారో చెప్పలేదని సురవరం అన్నారు. పార్లమెంటు తలుపులు మూసి అడ్డగోలుగా విభజన చేశారని మోడీ చెప్పడం శోచనీయమన్నారు. సీపీఎం మినహా అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణకు అంగీకరించాయని, బీజేపీ నేత సుష్మాస్వరాజ్ సైతం తెలంగాణకు లోక్‌సభలో మద్దతు పలికారని, ఇప్పుడు నరేంద్రమోడీ ఇలాంటి వ్యాఖ్య చేయడం సిగ్గుచేటన్నారు. సుదీర్ఘ పోరాటం వల్ల తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. విమర్శల స్థాయి నుంచి తిట్ల వరకు కాంగ్రెస్, టీఆర్ఎస్‌లు వెళ్లడం సమంజసం కాదని, వ్యక్తిగత దూషణలకు స్వస్తి చెప్పాలన్నారు. ఈ సంస్కృతికి తెరదీసింది కేసీఆరేనన్నారు. టీఆర్ఎస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కేంద్రంపై పోరాటం చేసి తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు విభజన చట్టం ద్వారా రావాల్సిన వాటిని సాధించుకోవాలన్నారు. రైల్వే జోన్, ఎస్సీ వర్గీకరణ వంటి అంశాలు, విభజన చట్టంలో ఇచ్చిన హామీలను సాధించుకోవడానికి టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని పక్షాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తేవాలని సురవరం కోరారు. డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ డెంగ్యూను గుర్తించలేకపోవడం వల్లే టీడీపీ నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు చనిపోయారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో పేదలకు ఇన్సూరెన్స్ చేస్తామని ప్రకటించడం ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు మేలు చేయడానికే అన్నారు. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు ఒక మెడికల్ కాలేజీ, ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అంటే ప్రైవేటు సంస్థలకు మేలు చేయడమేనని విమర్శించారు. బీజేపీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత, తిరుగుబాటు వస్తుందన్నారు. చంద్రబాబునాయుడు కేంద్రంపై గట్టిగా తిరుగుబాటు చేస్తేనే ప్రత్యేకహోదా సాధ్యమవుతుందని, గురువారం జరిగిన బంద్‌తో కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు. బంద్ విజయవంతమైందని చంద్రబాబు ప్రకటించి, కేంద్ర ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసే విధంగా వ్యవహరించడం సరికాదని, చిత్తశుద్ధితో కేంద్రంపై పోరాడాలని హితవు పలికారు.

మాతృవందనంకు గ్రహణం

(మొదటిపేజీ తరువాయి)

పథకాన్ని అమలు చేయాల్సిన వైద్య, ఆరోగ్యశాఖ నమోదు ప్రక్రియ క్లిష్టతరంగా ఉండటం వల్లే సక్రమంగా అమలు చేయలేక పోయామని చెబుతోంది. కనీసం గర్భిణుల వివరాలను కూడా ఈ శాఖ నమోదు చేయలేదు. రాతపని ఎక్కువగా ఉండటం, ఇంటర్‌నెట్ కనెక్షన్ సరిగా ఉండకపోవడం, బ్యాంకు అకౌంట్లు లేకపోవడం, డాక్టర్ల నివేదికల కంప్యూటీకరణ జరగకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిదంటున్నారు. 2017-18లో (ఫిబ్రవరి5వరకు) మహారాష్ట్రలో 50,831 మంది గర్భిణులు, బాలింతలు ప్రయోజనం పొందారు. ఉత్తరప్రదేశ్‌లో 40,252 మంది, మధ్యప్రదేశ్‌లో 37,209 మందికి సాయం అందించారు. వెనుకబడిన రాష్ట్రమైన చత్తీస్‌ఘడ్‌లో కూడా 27,702 మంది పీఎంఎంవీవై లో ప్రయోజనం పొందగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 2,352 మంది మాత్రమే దీనిని వినియోగించుకున్నారు. ఈ పథకంలో మూడు విడతలుగా రూ. 6000 అందిస్తారు. గర్భవతిగా నమోదు చేసుకున్న తర్వాత రూ. 1000, రెండో దఫా మరోరూ. 2000 ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయిన తర్వాత మరో రూ. 2000లు ఆపై మరో రూ.1000 నేరుగా ఆ మహిళా బ్యాంకు అకౌంట్లో జమ చేస్తారు. సిబ్బందికి రాతకోతల పని ఎక్కువగా ఉండటం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని, గ్రామీణ , గిరిజన ప్రాంతాల వారికి బ్యాంకు ఎకౌంట్లు లేవని వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. మార్చి చివరినాటికి ప్రస్తుతం ఉన్న వివరాలను కంప్యూటరీకరించి రాష్ట్రంలో అర్హులైన 3.5 లక్షల మందికి ప్రయోజనం చేకూర్చుతామని పేరు చెప్పటానికి ఇష్టపడని ఒక అధికారి వెల్లడించారు.

ఈ పథకం అమలు చేపట్టిన తర్వాత ఇప్పటి వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 3.5 లక్షల మంది ప్రసవాలు జరిగాయని ,అయితే వాటిని ఈ పథకంలో నమోదు చేయలేదన్నారు. ఒక్క విశాఖలోనే 21,785 మంది అర్హులు ఉండగా, ఇప్పటి వరకు మొదటి విడత నగదు రూ. 1000 కేవలం 62 మందికే లభించింది.

ఎన్జీఓల జాడేది?

(మొదటిపేజీ తరువాయి)

అన్యాయంపై మాట్లాడే విషయంలో ఏపీ ఎన్జీఓలు అడుగు ముందుకు వేయడం లేదు. సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో ఎన్జీఓలు చేసే ఉద్యమానికి ప్రజలంతా మద్దతు ఇచ్చారు. కానీ ఇపుడు జరుగుతున్నదేమిటి? కేంద్రంలోని ఎన్డీయేలో భాగస్వామ్యంగా తెలుగుదేశం పార్టీ ఉంది కాబట్టి ఒత్తిడి తేలేకపోతోంది. రెండు మంత్రి పదవుల్ని పొందింది కాబట్టి అనుకున్నస్థాయిలో వైరం పెట్టుకోలేక పోతోంది. కానీ ఎన్జీఓలకు ఏమైంది? రాష్ట్రానికి జరిగే అన్యాయంపై ప్రశ్నించవద్దా? పోరాటానికి నడుం బిగించవద్దా? ప్రజలంతా ఏకమైనపుడు ఎన్జీఓలు మౌనంగా ఉండటంలో అర్థం ఏమిటి? ఉద్యోగుల ప్రయోజనాల కోసమే అయితే రాష్ట్రంలోని ఐదున్నర కోట్లమందికి నష్టం జరుగుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదా? తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఎన్జీఓలు తీరుపై స్వపక్షంలోనే తీవ్ర విమర్శలు ఉన్నాయి. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితంగా మెలగడంతో సరిపోతుందన్న విమర్శలూ ఉన్నాయి.

ఉద్యోగుల విషయంలోనూ ఇంతే!

రాష్ట్ర ప్రయోజనాలే కాదు, ఉద్యోగుల ప్రయోజనాల విషయంలోనూ ఎన్జీఓ సంఘం నామమాత్రంగానే వ్యవహరిస్తుందనే అభియోగం ఉంది. సీపీఎస్ విధానంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించే విధానంపై అన్ని శాఖల ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోరాటానికి దిగితే అరెస్టులు చేశారు. అయినా ఎన్జీఓ నేతలు స్పందించిన విధానం నామమాత్రమే. అడపా, దడపా మీడియాతో మాట్లాడుతూ సీపీఎస్ విధానంపై ప్రకటనలు చేయడం మినహా దీనిపై రాష్ట్రవ్యాప్తంగా చేసిన ఉద్యమం లేదు. ముఖ్యమంత్రి దగ్గరకు నేరుగా వెళ్లి మాట్లాడవలసిన నాయకులు...లక్షలాదిమంది ఉద్యోగుల జీవితాలకు సంబంధించిన సీపీఎస్ విధానంపై ఎందుకు ముఖ్యమంత్రిపై వత్తిడి తేలేకపోతున్నారు? అనేది ఇపుడు ఎన్జీఓలకు ఎదురవుతోన్న ప్రశ్న. సమైక్యాంధ్ర సమయంలో అందరినీ కూడగట్టుకొని, అందరూ చేసిన ఉద్యమాన్ని సొంతం చేసుకొన్న కొంతమంది నేతలు వ్యవహరించే తీరుపై ఉద్యోగుల్లోనూ తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉద్యోగుల సమస్యలు, వారి హక్కులు, రావాల్సిన రాయితీలపైనా స్పందించే విధానం నామమాత్రమే. దీనిపైనా ఉద్యోగుల్లో ఆవేదన ఉంది. ప్రత్యేక హోదా రాదని కేంద్రం తేల్చిచెప్పినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగానే స్పందించింది. దీనిని ఎన్జీఓలు సమర్థించారు. కానీ అప్పుడే ఎన్జీఓలు పోరుబాట పట్టి ఉంటే ఈరోజు రాష్ట్రాన్ని ఇంతగా కేంద్రం అన్యాయం చేసి ఉండేది కాదు. సమైక్యాంధ్ర స్ఫూర్తి ఇంకా ఆంధ్ర ప్రజల్లో రగులుతూనే ఉంది. దీని ప్రభావం 8వ తేదీన జరిగిన రాష్ట్రబంద్‌లో కనిపించింది. గతంలోనూ అనేక సమస్యలపై ప్రజలు ముందుకు వచ్చారు. ప్రజాసంఘాలు రోడ్డుమీదకు వచ్చాయి. కానీ ప్రభుత్వం పోలీసులతో అణచివేసింది.

హైకోర్టు తరలింపులో కదలిక

(మొదటిపేజీ తరువాయి)

ఏపీ రాజధాని ప్రాంతంలో తాత్కాలిక భవనంలో హైకోర్టును ఏర్పాటు చేసేందుకు అనువైన భవనలను పరిశీలించేందుకు శుక్రవారం ఓ బృందం ఇక్కడకు వచ్చింది. స్టేట్ అఫ్ తెలంగాణ అండ్ స్టేట్ అఫ్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జ్యుడియేషర్ ఎట్ హైదరాబాద్ బృందం మూడు రోజుల పాటు నగరంలో పర్యటించేందుకు వచ్చారు. హైదరాబాదు నుండి విమానంలో గన్నవరం చేరుకున్న ఈ బృందానికి గన్నవరం విమానాశ్రయంలో జిల్లా జడ్జీలు జస్టిస్ వై.లక్ష్మణరావు, జస్టిస్ ఎ.వి రవీంద్రబాబు, విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సోము కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ కందుల శ్రీనివాసరావు, న్యాయమూర్తులు నరహరిశెట్టి శ్రీహరి, ఆర్డీవో సి.హెచ్ రంగయ్య, తాహశీల్దార్ ఎం.మాధురి, పలువురు న్యాయమూర్తులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తుల బృందం గన్నవరంలోని వెటర్నరీ యూనివర్శిటీ భవనాన్ని పరిశీలించారు. ఈ బృందంలో జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యం, సి ప్రవీణ్‌కుమార్, ఎ.వి శేషసాయి, టి.సునీల్ చౌదరి, పి.సత్యనారాయ ణమూర్తిలున్నారు. వీరికి యూనివర్శిటీ డీన్ డా.జి.శ్రీనివాసరావు, ఆర్.అండ్.బి చీఫ్ ఇంజనీర్ పి.శ్రీమన్నారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.ఎల్ మాధవస్వరూప్, డి.ఈ కిషోర్ బాబ్జిలు యూనివర్శిటీ భవానాలకు సంబంధించిన ఆకృతులను, ప్రాంగణాన్ని చూపించారు. శనివారం మరికొన్ని భవనాలను పరిశీలించనున్నారు.



ఐటీ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు - మంత్రి లోకేష్

విశాలాంధ్ర అమరావతి : ఏపీలో ఐటీ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారు. శుక్రవారం సచివాలయంలో పబ్లిక్, ప్రైవేట్ క్లౌడ్, మల్టీ టీనన్సీ, వెబ్ సర్వీసెస్, ఇంటిగ్రేషన్ సర్వీసెస్ అందిస్తున్న డెస్క్ ఎరా కంపెనీతో ఆయన భేటీ అయ్యారు. ఐటీ కంపెనీల కోసం తీసుకొచ్చిన పాలసీ, రాయితీలను మంత్రి లోకేష్ వారికి వివరించారు. డీటీపీ పాలసీ ద్వారా రెంటల్ సబ్సిడీ, ఆఫీస్ స్పేస్ ఇబ్బందిని అధిగమించేందుకు ప్లగ్ అండ్ ప్లే విధానంలో కంపెనీలకు ఆఫీస్ స్పేస్ కల్పిస్తూ, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా క్లౌడ్ హబ్ పాలసీ రూపొందించామన్నారు. ఏపీలో ఐటీ కంపెనీ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని, విశాఖపట్నంలో ఈ నెలలో జరిగే సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ - 2018లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటామన్నారు. విశాఖలో 500 మంది ఉద్యోగస్తులతో త్వరలోనే కార్యకలాపాలు ప్రారంభిస్తామని డెస్క్ ఎరా కంపెనీ సీఈఓ శషాంక్ దీక్షిత్ వెల్లడించారు.

మహర్దశ !

విజయవాడ, విశాఖ రైల్వేస్టేషన్లకు మరిన్ని హంగులు

అదనపు ప్లాట్‌ఫారాల నిర్మాణం

కార్యాలయాలు, క్వార్టర్లు తరలింపు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో అత్యంత రద్దీ స్టేషన్లుగా పేరొందిన విజయవాడ, విశాఖపట్నం రైల్వేస్టేషన్లకు మహర్దశ పట్టనుంది. దేశవ్యాప్తంగా 23 ప్రధాన రైల్వేస్టేషన్లను గత ఏడాది 'స్టేషన్ పునరాభివృద్ధి' (స్టేషన్ రీ డెవలెప్‌మెంట్) పథకంలో చేర్చిన విషయం తెలిసిందే. వీటిలో దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్, విజయవాడ, తూర్పుకోస్తా రైల్వేలో విశాఖపట్నంలకు స్థానం కల్పించారు. రైల్వేశాఖ ఆధ్వర్యంలోని 'ఇండియన్ రైల్వే స్టేషన్స్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్' (ఐఆర్ఎస్‌డీసీ) ఏర్పాటైంది. ఈ సంస్థ ఇర్కాన్ ఇంటర్నేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీఓఎన్)తోపాటు రైల్ ల్యాండ్ డెవలెప్‌మెంట్ అథారిటీ (ఆర్ఎల్‌డీఏ)తో కలసి సంయుక్తంగా రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తాయి. దీనికోసం స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ఏర్పాటు చేసింది. ప్రైవేటు సంస్థలను బిడ్ల ద్వారా ఆహ్వానించి స్టేషన్ల అభివృద్ధి, నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. పబ్లిక్,ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తోపాటు బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్(బీఓటీ), బిల్డ్-ఓన్-ఆపరేట్- ట్రాన్స్‌ఫర్ (బీఓఓటీ), బిల్డ్-లీజ్-ట్రాన్స్‌ఫర్ (బీఎల్‌టీ) విధానం ద్వారా పనులను అప్పగించనున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఇందుకు సంబంధించిన బిడ్లను ఆహ్వానించగా, పలు సంస్థలు లీజు కాలాన్ని 45 సంవత్సరాల నుంచి 90 సంవత్సరాలకు పెంచాలని కోరాయి. దీనిపై రైల్వేబోర్డు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అన్నీ సక్రమంగా జరిగి నట్లయితే ఒకట్రెండు సంవత్సరాల్లో విజయవాడ, విశాఖపట్నం స్టేషన్లు ప్రపంచస్థాయి సదుపాయాలతో ప్రయాణీకులకు సేవలను అందించనున్నాయి. పునరాభివృద్ధి పథకంలో రైల్వేస్టేషన్లలో అదనంగా ప్లాట్‌ఫారాల నిర్మాణం, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్లను నిర్మిస్తారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్లాట్‌ఫారాలను మరింత పొడవుగా విస్తరిస్తారు. స్టేషన్‌కు చేరుకునే విధంగా ఆయా ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తారు. స్టేషన్ పరిసరాల్లో వాహనాల పార్కింగ్, బస్‌బేల కోసం సర్క్యులేటింగ్ ఏరియాను మరింత విస్తరింపచేస్తారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం 10 ప్లాట్‌ఫారాలుండగా అదనంగా మరో నాలుగు నిర్మించే విధంగా భవిష్య యార్డ్, స్టేషన్ అభివృద్ధి ప్రణాళికను రూపొందించారు. స్టేషన్‌లో తూర్పువైపు 2, పడమర వైపు 2 ప్లాట్‌ఫారాలను నిర్మించడం ద్వారా 4 లైన్లు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం తూర్పు బుకింగ్ కౌంటర్లవైపు ఉన్న సర్క్యులేటింగ్ ఏరియాను రెండు భాగా లుగా అభివృద్ధి చేయనున్నారు. ఇందులో రైల్వే ఇన్‌స్టిట్యూట్, డీఆర్ఎం కార్యాలయం, రైల్వేహైస్కూలు, ఆఫీసర్స్ రెస్ట్‌హౌస్, డ్రైవర్ల రన్నింగ్‌రూమ్, సూపర్‌వైజర్ల కార్యాలయాలను పూర్తిగా తొలగించి, సత్యనారాయణ పురం రైల్వే కాలనీ ప్రాంతంలో నిర్మిస్తారు. ఇక రెండో భాగంలో కాల్‌టాక్స్ రోడ్‌లో ఆర్ఎంఎస్ కార్యాలయం, 400 వరకూ ఉన్న రైల్వే క్వార్టర్స్ తదితరా లను తొలగించి సర్క్యులేటింగ్ ఏరియాను ఏర్పాటు చేస్తారు. మీసాలరాజేశ్వరరావు వంతెనతో ఆగిపోయిన బీఆర్‌టీఎస్ రోడ్‌ను రైల్వే డీజిల్‌లోకోషెడ్ వైపు నుంచి వయాడక్ట్ ద్వారా వన్‌టౌన్‌లోని నెహ్రూరోడ్ మీదుగా తారాపేట వరకూ విస్తరించనున్నారు. అలాగే విశాఖ పట్నంలో ప్రస్తుతం 8 ప్లాట్‌ఫారాలుండగా జ్ఞానాపురం వైపు అదనంగా మరో నాలుగు నిర్మించాలని స్టేషన్ పునరా భివృద్ధి ప్రణాళికలో పేర్కొన్నారు. ఇప్పటికే ఆదర్శస్టేషన్ జాబితాలో ఉన్న ఈ స్టేషన్‌లో 2 లిఫ్టులు, 2 ఎస్కలేటర్లు న్నాయి. రానున్న రోజుల్లో అన్ని ప్లాట్‌ఫారాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. స్టేషన్ల పునరాభివృద్ధి పేరుతో స్టేషన్లను ప్రైవేటీకరిం చేందుకు యత్నాలు జరుగుతున్నాయని రైల్వే కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. అంతర్జాతీయ స్థాయిలో సదుపాయాలను మెరుగు పరుస్తున్నామే కానీ రైల్వే ప్రైవేటీకరణకు మాత్రం ఈ పథకం ఉద్దేశించింది కాదని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.





ప్రకృతి సేద్యంతో లాభాల పంట

నీతి ఆయోగ్ మెంబర్ రమేష్ చంద్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రకృతి వ్యవసాయంతో ఖర్చులు గణనీయంగా తగ్గడంతోపాటు అధిక దిగుబడుల వల్ల సాగు లాభసాటి అవుతుందని నీతి ఆయోగ్ సభ్యులు రమేష్ చంద్ చెప్పారు. శుక్రవారం స్థానిక బెంజిసర్కిల్ సమీపంలోని జ్యోతి కన్వెన్షన్ హాల్‌లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు రైతు సాధికార సంస్థ , వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తొలుత రైతులతో ప్రకృతి వ్యవసాయ సేద్యం గురించి, పంట దిగుబడి వివరాలు తదితరమైన విషయాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రానికి, దేశానికి పనికివచ్చే ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఎందుకు మొగ్గు చూపిస్తున్నారో తెలుసుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. గతంలో వ్యవసాయం ప్రాణం పోసే వృత్తిగా ఉండేదని, ఇప్పుడు అదే వృత్తి సమస్యలతో ముడిపడిన వ్యవస్థగా మారిపోయిందన్నారు. పండ్లు, కూరగాయలు, వరిధాన్యాలు తదితరమైన పంటలు ఎక్కువగా రసాయనాలతో పండించడం వల్ల వాటిని తినే ప్రజలకు ఇనుము, క్యాల్షియం లోపాలతో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వాటిని అధిగమించడానికి ఐరన్, క్యాల్షియం ట్యాబ్‌లెట్స్‌ను ప్రజలు వాడుతున్నారన్నారు. దీని వల్ల భవిష్యత్ తరాలు మరింత ఇబ్బందులకు గురైయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే ఇతర జీవరాశులకు సంబంధించి ఎకో సిస్టం దెబ్బతింటుందన్నారు. దీనికి కారణం వ్యవసాయంలో విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాల వాడటమే కారణంగా ఆయన పేర్కొన్నారు. రసాయనాలు ఒక సప్లిమెంటరీగా మొక్కలకు గతంలో వాడేవారని దానికి తోడు అవుపేడ, మూత్రం తదితరమైనవి ఎక్కువ మోతాదులో వాడేవారన్నారు. ప్రస్తుతం రసాయనాలు ఎక్కువగా వాడుతూ ప్రకృతి పరంగా లభించే ఆవుపేడ తదితరమైనవి సప్లమెంటరీగా వాడుతున్నారన్నారు. ఈ పరిణామాలు మానవ ఆరోగ్యాలపై పడి ఆహారపు అలవాట్లు మార్చుకునే విధంగా తయారయ్యాయని. ఇది భవిష్యత్ తరాలకు మంచిది కాదన్నారు. దేశంలో నీటి క్వాలిటీ, సాయిల్ క్వాలిటీ తగ్గిపోయిందన్నారు. ప్రకృతి కూడా మనిషికి విషతుల్యమైన ఆహారం తిన్నా కొంత తట్టుకునే శక్తిని ఇచ్చిందని, ఇది ఒక లిమిట్ వరకు పరవాలేదుగాని, ఆ లిమిట్ దాటి ఒక ప్రమాదకరమైన పరిస్థితికి నేడు చేరిందన్నారు. పంజాబ్ రాష్ట్రంలో వ్యవసాయంలో దిగుబడి కోసం రసాయన ఎరువులు ఎక్కువ మోతాదులో ఉపయోగించడం వల్ల మనుషులపై వాటి దుష్పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అలాంటి వాటిని నిరోధించడానికి జీరో బడ్జెట్ న్యాచురల్ ఫార్మింగ్ (జెడ్‌బీఎన్ఎఫ్) ఒక ప్రత్యామ్నాయ మార్గంగా రైతులకు ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణా కేంద్రం ఉపాధ్యక్షులు టీ.విజయ్‌కుమార్, ఎఫ్.ఎ.వో ప్రతినిధులు డా.శ్యామ్‌కుమర్, డా.అనె సోఫియా, షేక్ అన్వర్ , వ్యవసాయ శాస్త్రవేత్త బ్రునో డోరిన్, 23 జిల్లాల నుంచి రైతులు పాల్గొన్నారు.



ఆర్టీజీఎస్ అద్భుతం - రమేష్‌చంద్

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న రియల్ టైమ్ గవర్నెన్స్ ఆర్టీజీఎస్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందని కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ రమేష్‌చంద్ అన్నారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ స్టేట్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయనకు ఆర్టీజీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అహ్మద్‌బాబు ఆర్టీజీఎస్ పనితీరును వివరించారు. రియల్ టైమ్ ప్రజలకు, ప్రభుత్వానికి ఈ కేంద్రం సేవలు అందిస్తున్న తీరును తెలియజేశారు. పరిష్కార వేదిక 1100 కాల్ సెంటర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని ఎలా పరిష్కరిస్తున్నది వివరించారు. తొమ్మిది నెలల కాలంలో పరిష్కారవేదిక ద్వారా 1,48,50,297 ఫిర్యాదులు స్వీకరించామని అందులో 93 శాతం ఫిర్యాదులు పరిష్కరించామని చెప్పారు. సమస్య పరిష్కారం తరువాత ఫిర్యాదుదారుకు ఫోన్ చేసి వారి అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల సంతృప్తి స్థాయి ఎలా ఉందనేది ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్టు వివరించారు. ఈ-ఆఫీసు పనితీరు, కోర్ డ్యాష్‌బోర్డు గురించి తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన సర్వైలెన్స్ కెమెరాల ద్వారా ఎలా పర్యవేక్షిస్తు న్నది కూడా సీఈఓ బాబు వివరించారు. రమేష్ చంద్ మాట్లాడుతూ ఆర్టీజీఎస్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందని, టెక్నాలజీ వినియోగం వినూత్న ఆలోచనలతో దూసుకెళుతున్న ఏపీ ప్రభుతాన్ని అభినందించారు. ఏపీలో ఉన్న ఆర్టీజీఎస్ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయం కావాలన్నారు.

డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల్లో ఆశలు

ఎమ్మెల్సీలతో కమిటీ వేసిన ప్రభుత్వం

విద్య, ఉద్యోగరంగ సమస్యలపై అధ్యయనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాత డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల సమస్యలతోపాటు వివిధ విద్యా, ఉద్యోగ రంగ అంశాలపై ప్రభుత్వం ఓ కమిటీ వేసింది. ఈ మేరకు శుక్రవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్ దాస్ జీవో విడుదల చేశారు.ప్రభుత్వ నిర్ణయంపై పాత డీఎస్సీలలో అర్హత సాధించిన అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.1998, 2008, 2012 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయలని కోరుతూ ఉభయ రాష్ట్రాల్లో బాధితులు ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం విది తమే. పాత డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర శాసన మండలి సమావేశాల్లో ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డితోపాటు పలువురు సభ్యులు ప్రసం గిస్తూ, అర్హత సాధించిన అభ్యర్థులకు ఉద్యోగ నియామ కాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం జూనియర్ కళాశాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు, మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల వేతనాలపైనా అధ్యయనం చేయాలని భావిస్తోంది. భాషా పండిట్లు, పీఈటీల పదోన్నతులు, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న లెక్చరర్లకు ఆర్ఐఓ, డీవీఈవోలు, ప్రిన్సిపాళ్ల పదోన్నతులు, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో టీచర్లు, సిబ్బంది భర్తీ తదితర 8విభాగాల అంశాలపై కమిటీ పరిశీలి స్తుంది. ఇందులో ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులు నాయుడు, ఎఎస్ రామకృష్ణ, టీడీ జనార్ధనరావు, కత్తి నరసింహారెడ్డి, వి.బాల సుబ్రహ్మణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, పీవీఎస్ మాధవ్, ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ సభ్యులుగా వుంటారు. కన్వీనర్‌గా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వ్యవహరిస్తారు.

పాత డీఎస్సీ అభ్యర్థులకు పోస్టులెలా సృష్టిస్తారు?

పాత డీఎస్సీలలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఉపాధ్యాయ పోస్టుల్ని ఎలా కేటాయిస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది.త్వరలో 14వేల పోస్టులతో కొత్త డీఎస్సీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయనుంది.మార్చి 3వ తేదీతో ఏపీ టెట్ పరీక్షలు ముగియనున్నాయి. టెట్ పరీక్షల అనంతరం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తారు.నాలుగేళ్ల నుంచి డీఎస్సీని ప్రభుత్వం నిర్వహించ లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 13జిల్లాల్లో ఉపాధ్యా య పోస్టులు తక్కువగా వున్నాయి.పాత డీఎస్సీల్లో అర్హత సాధించిన వారికి పోస్టులెలా సృష్టిస్తారంటూ,దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

మోడీ ఇంటిముందు నిరసన తెలపాలి

- ఎంపీలకు చలసాని శ్రీనివాస్ విజ్ఞప్తి
- చంద్రబాబు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి
- 18న విజయవాడలో భవిష్య త్ కార్యాచరణ : ముప్పాళ్ల



విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : కేంద్రంలో మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు చేస్తున్న అన్యాయానికి నిరసనగా వామపక్ష పార్టీలు గురువారం నిర్వహించిన బంద్‌కు ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు దిక్కులు దద్దరిల్లే విధంగా సహకరించిన అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజాసంఘాలకు, వర్తక వాణిజ్య సంఘాలకు, వ్యాపారస్తులకు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ ఇక్కడి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక హోదాను తుంగలోతొక్కి, ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు వాటి అమలుకు కూడా నిధులు కేటాయించకుండా దుర్మార్గంగా వ్యవహ రిస్తున్నదని తాము గత నాలుగు సంవత్సరాలుగా చెపుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో కూడా మనకు తీవ్ర అన్యాయం చేయడంతో ముఖ్యమంత్రి మేల్కొని ఎంపీలను పార్లమెంట్‌లో ఆందోళన చేయాలని చెప్పడం సంతోషకరమన్నారు. బడ్జెట్ సమావేశాలు రెండో విడత మార్చి 5నుండి ప్రారంభమవుతున్నాయని, ఆ సమావేశాలలో కేంద్రంపై ఒత్తిడి పెంచాలని, పార్టీలకు అతీతంగా పార్లమెంట్ సభ్యులు అందరు పార్లమెంట్‌ను స్తంభింప చేయాలని అవసరమైతే ప్రధాని ఇంటిని ముట్టడించాలని కోరారు. అలా చేయని పార్లమెంట్ సభ్యులు ఇంటి ముందు ధర్నాలు నిర్వహించి ఆంధ్రా ద్రోహులుగా గుర్తిస్తామన్నారు. ఢిల్లీలో పార్లమెంట్ సభ్యులు నిర్వహించే ఆందోళనలకు వెళ్లి వారికి అండగా ఉంటామన్నారు. పవన్ కల్యాణ్ తమకు మద్దతు తెలపడంతో పాటు జేఏసి ఏర్పాటు చేసి విభజన హామీలను సాధించడానికి కలసి రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమితి సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ కనబరిచిందని విమర్శించారు. మనకు రావలసిన హక్కులు,నిధులు సాధించుకోవడానికి ఇదే మంచి తరుణమన్నారు. చంద్రబాబు తన స్వార్థం కోసం కాకుండా రాష్ట్రం కోసం తమతో కలసి రావాలని పిలుపునిచ్చారు. అనాడు ప్రత్యేక హోదా కావాలని అంటే కాదు ప్రత్యేక ప్యాకేజి వలన ఇంకా ఎక్కువ నిధులు వస్తాయని చెప్పిన సీఎం ఇప్పుడు ప్రత్యేక హోదా అనడం సంతోషకరమన్నారు. జాతీయహోదా కల్పించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఊసే బడ్జెట్‌లో లేకపోవడం బాధాకరమని. విశాఖ రైల్వేజోన్ ప్రస్తావన లేదని చంద్రబాబు రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఆవేదన చెందినంత మాత్రాన కేంద్రం దిగిరాదని, తమ పార్టీ ఎంపీలతో రాజీలేని పోరాటం చేయించేందుకు సన్నద్ధం కావాలని డిమాండు చేశారు. విభజన హామీల అమలుకై గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరుబాట సాగించేందుకు ఫిబ్రవరి 18వ తేదీన విజయవాడలో ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిపి భవిష్యత్ కార్యాచరణను రూపొం దిస్తామని ముప్పాళ్ల చెప్పారు. ఈ సమావేశంలో సాధన సమితి కృష్ణా జిల్లా కన్వీనర్ దోనేపూడి శంకర్, నాయకులు నిడుమోలు రాజేంద్రప్రసాద్, విద్యార్థి జేఏసీ నాయకులు రవికిరణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌డి.అఫ్సర్, లోక్‌సత్తా పార్టీ నగర అధ్యక్షులు బి.ఆశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజెన్‌కోలో నియామకాలకు రేపు రాత పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీజెన్‌కో)లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్ (జేఏఓ), జూనియర్ అసిస్టెంట్స్(జేఏ) ఉద్యోగ నియామకాలకు సంబంధించిన రాతపరీక్షను ఈనెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు సంస్థ జాయింట్ సెక్రటరీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ద్వారా జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు 26, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 25 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. విజయవాడలో జేఏఓలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, జేఏఓలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా మొబైల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లను పరీక్షహాలులోకి అనుమతించరని పేర్కొన్నారు. http://apgenco.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, హాల్‌టికెట్‌లో పొందపరచిన ఖాళీ గడిలో అభ్యర్థులు తమ నూతన పాస్‌పోర్ట్ సైజు ఫోటోను అతికించాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదో ఒకదానిని తప్పనిసరిగా గుర్తింపు పత్రంగా తీసుకురావలసి ఉందన్నారు.

శ్రీచైతన్య స్కూల్స్ క్లీన్‌స్వీప్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఎన్‌టీఎస్ఈ స్టేజ్-1 (2017) పరీక్షా ఫలితాలలో ఏపీ నుండి 142 మంది విద్యార్థులు ఎంపికవగా వారిలో 111 మంది శ్రీచైతన్య విద్యార్థులేనని శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఏపీలో స్టేట్ 1, 2, 3 ర్యాంకులతో పాటు శ్రీచైతన్య విద్యార్థులు టాప్ 10 ర్యాంకులలో అన్ని స్థానాలనూ కైవసం చేసుకున్నారన్నారు. ఏడేళ్లుగా శ్రీచైతన్య స్కూల్-టెక్నో కరిక్యులమ్ ఎన్‌టీఎస్ఈలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ నెం.1గా కొనసాగుతున్నామని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ డా.బీఎస్ రావు అభినందనలు తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సి-బ్యాచ్, సి-ఐపీఎల్, మెడికాన్, ఎంపిల్ వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్ వల్లే ఇలాంటి ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు.



మోడీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసనలు..

విజయవాడలో శిరోముండనం చేయించుకున్న కార్యకర్తలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిపై ప్రధాని మోడీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ శ్రేణులు కన్నెర్రజేశాయి. ఏపీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ, రాజ్యసభలో సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు రేణుకా చౌదరిని ఉద్దేశించి ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని ఆమెను అవమానించినందుకు దేశంలోని మహిళలందరికీ మోడీ క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. విజయవాడ పీసీసీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ కార్యకర్తలు శిరోముండనం చేయించుకుని వినూత్నంగా నిరసనకు దిగారు. పీసీసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన నిరసనలో రాష్ట్ర, జిల్లాల నేతలు హాజరయ్యారు.ఏపీకి ప్రత్యేక హోదా అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేశాయని దుయ్యబట్టారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి మీసాల రాజేశ్వరరావు మాట్లాడుతూ, విభజన హామీలను అమలు చేయడంతో మోడీ, చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి వి.గుర్నాథం, డీసీసీ అధ్యక్షులు ఏసుదాస్, పీసీసీ కార్యదర్శులు అన్వర్ హుస్సేన్, బోడపాటి బాబూరావు, కాంగ్రెస్ నాయకులు కుర్షిదా, ప్రమీలా గాంధి, కిశోర్ పాల్గొన్నారు.

ముగ్గురు ఐజీలకు అదనపు డీజీపీలుగా పదోన్నతి

సీఐడీకి అమిత్‌గార్గ్, సైబర్ క్రైమ్‌కు సునీల్‌కుమార్

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : పోలీసుశాఖలో ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ)గా పని చేస్తున్న 1993 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన ముగ్గురికి అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఏడీజీపీ)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీలో ఐజీగా పని చేస్తున్న అమిత్‌గార్గ్‌కు అదనపు డీజీపీగా పదోన్నతి కల్పించి తిరిగి సీఐడీలోనే పోస్టింగ్ ఇచ్చారు. అలాగే స్టేట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎస్‌సీఆర్‌బీ), సైబర్ క్రైం ఐజీగా ఉన్న పీవీ సునీల్‌కుమార్‌కు అదనపు డీజీపీగా పదోన్నతి కల్పించి తిరిగి అదే పోస్టులో నియమించారు. కేంద్ర సర్వీసులకు వెళ్లి బీహార్‌లోని పాట్నాలో ఎస్ఐబీ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ మహేష్ దీక్షిత్‌కు కూడా అదనపు డీజీపీగా పదోన్నతి లభించింది.

రొయ్య సాగు సమస్యలను పరిష్కరిస్తా

మంత్రి ఆదినారాయణరెడ్డి



విశాలాంధ్ర అమరావతి : రొయ్య సాగు సమస్యలను పరిశీలించి నిబంధనల మేరకు చెరువులకు అనుమతులు మంజూ రు చేస్తామని మత్స్యశాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా రొయ్యల సాగు రైతులు శుక్రవారం మంత్రిని సచివాలయంలో కలసి సమస్యలపై వినతిపత్రం అందచేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 30 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతున్నా తొమ్మిదివేల ఎకరాల సాగుకే అనుమతులున్నాయని, మిగిలిన వాటి రెగ్యులరైజేషన్‌కు నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసినా కోర్టు కేసులు, ఫిర్యాదులున్నాయంటూ జిల్లాస్థాయి కమిటీ తమ ధరఖాస్తులన్నింటినీ పెండింగ్‌లో పెట్టిందని వాపోయారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో సమస్య లేదని ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే సమస్య ఉందని మంత్రికి వివరించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తామని మంత్రి వారికి భరోసా ఇచ్చారు. కాలుష్య నివారణ చర్యలు తదితరాలన్నీ నిబంధనల కనుగుణంగా ఉండేలా చూసుకోవాలన్నారు. జీవో 7 ప్రకారం మంచినీటి చేపల చెరువులకు అనుమతులు తీసుకుని రొయ్యల సాగు చేయాలనుకుంటే జీవో 15 అనుసరించి ధరఖాస్తులు చేయాలని సూచించారు. జిల్లా స్థాయి కమిటీలో విద్యుత్ అధికారి కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. రొయ్యల సాగు రైతులకు సబ్సిడీ పరిమితులు విధించడంతో రైతులకు న్యాయం జరగడం లేదని రైతులు మంత్రికి వివవరించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక, మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ దివేదీ, ఎమ్మెల్సీ బీద మస్తాన్ రావు, అఖిలభారత రొయ్యల సాగు రైతు సమాఖ్య అధ్యక్షుడు రాజు, తూర్పుగోదావరి జిల్లా ఆక్వా రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రరాజు వెంకటరాజు, మత్స్యశాఖ అదనపు కమిషనర్ సీతారామ రాజు పాల్గొన్నారు.

సంపాదకీయం

అవినీతిపరులకు శిక్షతప్పదు

అవినీతి అక్రమార్కులు ఎంతటివారైనా, ఎంత ఉన్నత స్థానాలను అలంకరించిన వారైనా అంతిమంగా 'శ్రీకృష్ణ జన్మస్థాన' ప్రాప్తి తప్పదు. ఇది చరిత్ర చెప్పిన సత్యం... కొన్ని ప్రపంచ దేశాల అనుభవం కూడా. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదాజియా విషయంలో అదే జరిగింది. అవినీతి కేసులో ఖలీదాకు గురువారం ఐదేళ్ల జైలుశిక్ష పడింది. దీంతో రానున్న డిసెంబరులో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయకుండా 72 ఏళ్ల ప్రధాన ప్రతిపక్ష నాయకురాలుకు ఎదురుదెబ్బ తగిలినట్లయింది. తన భర్త కీ॥శే॥ జియాఉర్ రెహ్మాన్ తరువాత అనాథల ట్రస్టు కోసం విదేశీ విరాళాల్లో 21 మిలియన్ల టాకా (బంగ్లా కరెన్సీ) అంటే 2.50 లక్షల మిలియన్ డాలర్ల దుర్వినియోగం కేసులో ఢాకా ప్రత్యేక కోర్టు ఖలీదాకు జైలు శిక్ష విధించింది. అనాథల ట్రస్టు కేసులో గైర్హాజరు అయ్యేందుకు ప్రయత్నించిన ఖలీదా పెద్ద కుమారుడు, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) సీనియర్ ఉపాధ్యక్షుడు తారిక్ రెహ్మాన్ మరో నలుగురికి కూడా ప్రత్యేక కోర్టు 10 సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. ఈ కేసులో ఇతర నిందితులుగా చట్టసభ మాజీ సభ్యుడు సలీముల్ హక్ కమల్, వ్యాపారవేత్త షరీఫుద్దీన్ అహ్మద్, ఖలీదా ముఖ్యకార్యదర్శి కమాలుద్దీన్ సిద్దిఖీ, ఆమె మేనల్లుడు మోమినూర్ రెహ్మాన్ వున్నారు. ఒక అవినీతి కేసులో దోషిగా నియమించబడిన మాజీ సైనిక నియంత హెచ్‌ఎం ఇర్షాద్ తరువాత అవినీతికి పాల్పడిన రెండవ వ్యక్తిగా ఖలీదా నిలిచారు. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఖలీదాను తెలుపు రంగు జీపులో ఢాకా సెంట్రల్ జైలుకు తరలించారు. ఖలీదా భర్త మాజీ దేశాధ్యక్షుడు జియాఉర్ రెహ్మాన్ హత్యానంతరం 1980లో ఆమె బంగ్లా రాజకీయాల్లోకి వచ్చారు. ముస్లింల ఆధిపత్యం గల దేశానికి ప్రజాస్వామ్య పునరుద్ధరణ అనంతరం ఆమె తొలి మహిళా ప్రధానమంత్రి అయ్యారు. తన 35 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక సందర్భాల్లో జైల్లో గడిపారు. అయితే ఆమెకు జైలు శిక్షపడటం ఇదే మొదటిసారి. ఖలీదాపై మొత్తం 37 కేసులుండగా, 17 కేసుల్లో ఛార్జిషీట్లు సమర్పించారు. గడచిన ఆరు సంవత్సరాల్లో కోర్టు విచారణలకు 143సార్లు ఆమె గైర్హాజరై, అంతిమంగా గత ఏడాది అక్టోబర్ 19న కోర్టుకు హాజరై, బెయిల్ పొందారు. గురువారం కోర్టు తీర్పు అనంతరం బీఎన్‌పీ మద్దతుదారులు ఢాకా వీధుల్లోకి వచ్చి, రహదారుల దిగ్బంధనానికి పాల్పడి, పోలీసులతో ఘర్షణలకు దిగారు. పోలీసులు వారిని చెదరగొట్టేందుకు బాష్పవాయువు ప్రయోగించారు. పాలక అవామీలీగ్, దాని అనుబంధ సంఘాల క్రియాశీల కార్యకర్తలు కూడా బీఎన్‌పీ మద్దతుదారులు ప్రదర్శనలు చేయకుండా నిలువరించడానికి ఢాకాలోని కీలక ప్రదేశాలను ఆక్రమించారు. కోర్టు ఖలీదాకు జైలు శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పు "వివాదాస్పదమైనది" అని ఢాకా విశ్వవిద్యాలయం లా ప్రొఫెసర్ ఆసిఫ్ నజ్రుల్ పేర్కొన్నారు. ఇది రాజకీయ దురుద్దేశంతో ఇచ్చిన తీర్పుగా అభిప్రాయపడేవారు అనేకమంది వున్నారని కూడా ఆయన అన్నారు. కోర్టు ఇచ్చిన తీర్పు వాస్తవాన్ని ప్రతిబింబించడంలో విఫలమైందని డిఫెన్స్ న్యాయవాది ఖండాకర్ మహబూబ్ హుస్సేన్ పేర్కొన్నారు. ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, బెయిల్ మంజూరు కాగలదన్న ఆశాభావంతో ఖలీదా వున్నట్లు ఆయన తెలిపారు. బీఎన్‌పీని రాజకీయాల్లో లేకుండా చేయడానికి ప్రధానమంత్రి షేక్ హసీనా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని బీఎన్‌పీ ప్రధాన కార్యదర్శి మీర్జా ఫక్రుల్ ఆలంగిర్ ఆరోపించారు. ఇప్పటికే దేశంలోని వివిధ ప్రాంతాల్లో 3 వేల మందికి పైగా బీఎన్‌పీ కార్యకర్తలను నిర్బంధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఏది ఏమైనా ఖలీదాకు శిక్ష పడడంతో హసీనా ప్రభుత్వం సజావుగా కొనసాగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2016లో చైనా అధ్యక్షుడు గ్జీ జిన్‌పింగ్ బంగ్లాదేశ్‌లో పర్యటించినప్పుడు హసీనాకు 2,600 కోట్ల డాలర్ల చెక్కును కూడా అందజేశారు. ఈ నేపథ్యంలో చైనాతో హసీనా సత్సంబంధాలు కొనసాగుతాయని కూడా భావించబడుతోంది. అయితే, ఆ విషయంలో వేచి చూడవలసి వుంటుంది. భారత్ పొరుగునున్న బంగ్లాదేశ్‌తో సంబంధాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి.

గతంలో అనేక దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులపై కూడా అవినీతి ఆరోపణలు, కేసులు నమోదు చేయబడ్డాయి. వివరాలు ఇలా వున్నాయి - ఇండోనేషియా అధ్యక్షుడిగా 31 ఏళ్లపాటు కొనసాగిన మహమ్మద్ సుహార్తోపై కూడా అవినీతి అభియోగాలు మోపారు. అధ్యక్షుడిగా వున్నప్పుడు తన ఆధీనంలోని ఏడు ఛారిటీలలో 550 మిలియన్ డాలర్లు దుర్వినియోగం చేసినట్లు ఆయన రాజీనామా చేసిన అనంతరం అభియోగాలు మోపి, గృహ నిర్బంధంలో వుంచారు. అంతిమంగా 2007లో సుహార్తోపై 1.5 బిలియన్ డాలర్ల (150 కోట్ల డాలర్లు) సివిల్ వ్యాజ్యం దాఖలైంది. ఆ తరువాత కొన్ని నెలల్లో ఆయన మృతి చెందడంతో ఆ కేసు విచారణ జరుగలేదు. అయితే, ఆయన కుమారుడు టామీకి లక్షలాది రూపాయల రియల్ ఎస్టేట్ కుంభకోణం కేసులో ఐదేళ్ల జైలుశిక్ష పడింది. ఫిలిప్పైన్స్ మాజీ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ (1965-1986), డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డిఆర్‌సి) పూర్వ అధ్యక్షుడు మొబుటు సెసే సికో (1965-1997), నైజీరియా మాజీ అధ్యక్షుడు సాని అబాచ (1993-1998), ట్యూనీషియా మాజీ అధ్యక్షుడు జైన్ అల్-అబిదిన్ బెన్ అలీ (1987-2011), యుగోస్లావియా మాజీ అధ్యక్షుడు స్లోబ్‌డన్ మిలో సేవిక్ (1989-2000), హైతీ మాజీ అధ్యక్షుడు జీన్ క్లాడే దువాలియర్ (1971-1986), పెరూ మాజీ అధ్యక్షుడు అల్బర్టో ఫుజుమోరీ (1990-2000), ఉక్రెయిన్ మాజీ ప్రధాని పావ్లో లజరెంకో (1996-1997) నికరాగ్వా మాజీ అధ్యక్షులపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. వాదిలో కొందరికి శిక్షలు పడగా మరికొందరు కేసుల విచారణ పూర్తికాకముందే చనిపోయారు. అవినీతి కేసులో భారత మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీని 1977, అక్టోబరు 3న అరెస్టు చేసి, ఒక గంటలోనే విడుదల చేశారు. ఖలీదా జియాకు శిక్షపడటం అవినీతిమయ రాజకీయ నేతలకు హెచ్చరిక కావాలి. వారెంతటివారైనా అవినీతి కేసుల్లో చట్టం తనపని తాను చేసుకుపోతుందని, శిక్షల నుండి తప్పించుకోలేరని గుర్తెరిగి వ్యవహరించాలి.

చురక

కేంద్రంపై అసంతృప్తి
కెరటాలై ఆంధ్రజనం
బడ్జెట్టులో న్యాయానికి
బందు జరిపి చూపె రణం

రాష్ట్రాలను విభజించిన
రాజ్యాంగం నిండుగా
రాసిచ్చిన హామీలకు
రక్షణేది మెండుగా

- వేల్పుల నారాయణ

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శిగా

గురుదాస్ దాస్ గుప్తా చివరి ఉపన్యాసం ఉత్తేజకరం! చారిత్రాత్మకం!



వెలుగూరి రాధాకృష్ణమూర్తి

"ఇంధనం పోసి మంట రాజేయండి! రగుల్కొన్న జ్వాలల్లో పెట్టుబడిదారీ విధానం మాడిపోక తప్పదు! ఇదే నా ఆశ ! ఇదే నా విశ్వాసం!" రాంచిలో డిసెంబర్‌లో జరిగిన ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ప్రియతమ నేత కామ్రేడ్ గురుదాస్ దాస్ గుప్తా ప్రసంగిస్తూ ఉద్వేగంతో అన్నమాటలివి.

"నేను సంతోషంగా సెలవు తీసుకుంటున్నా ! సైద్ధాంతికంగా, నైతికంగా, నిర్మాణ రీత్యా ఏఐటీయూసీని బలోపేతం గావించానన్న సంతృప్తితో ! కార్మిక వర్గ లక్ష్య సాధన కోసం తన విధిని నిర్వహించేంతగా ఏఐటీయూసీని తీర్చిదిద్దానన్న సంతృప్తితో సెలవు తీసుకుంటున్నా!" గురుదాస్ దాస్ గుప్తా నోటి నుండి ఈ మాటలు వెలువడుతున్నప్పుడు సభ యావత్తూ ఉద్వేగానికి గురైంది. కరతాళ ధ్వనులతో మార్మోగి పోయింది. ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో డిసెంబర్ 11 వ తేదీ ఆయన ముగింపు ఉపన్యాసం గావించారు.

బెంగాల్ టైగర్ గురుదాస్ దాస్ గుప్తా దాదాపు 16 సం॥లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శిగా తన ప్రస్థానాన్ని కొనసాగించారు. కార్మిక సంఘాల ఐక్యతకు తపించటమే గాక దాన్ని సాకారం గావించారు. "మరింత ఐక్యత మరిన్ని ఐక్యపోరాటాల" కోసం తన యావత్ శక్తి సామర్థ్యాలను వినియోగించి ఒక మహానాయకునిగా గుర్తింపు, గౌరవాన్ని పొందారు. దేశంలోనే ప్రప్రథమంగా ఒక మహిళా నాయకురాల్ని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శిగా తీర్చిదిద్దగలిగారు. మీద పడిన వయస్సు, అనారోగ్యం కారణాలతో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పదవి నుండి తన రాజీనామాను ఆమోదింపజేసుకొని, స్వచ్ఛందంగా వైదొలిగారు. కార్యదర్శిగా ఉన్న అమరజీత్‌కౌర్ ను ప్రధాన కార్యదర్శి పదవీ బాధ్యతలలోకి తీసుకొచ్చారు. ప్రాణప్రదంగా, తన శ్వాస, ఊపిరిగా ఏఐటీయూసీ కి 16 సం॥ల పాటు సారథ్యం వహించిన గురుదాస్ దాస్ గుప్తాకు రాంచి కౌన్సిల్ సమావేశం ఘనంగా వీడ్కోలు పలికింది. భావోద్వేగాలతో గావించిన ఆయన చివరి ఉపన్యాసం ఏఐటీయూసీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపింది. దిశానిర్దేశం గావించింది. నిరాశ శిఖరాలను బద్దలు గావిస్తూ సాగిన ఆయన ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది కార్మిక వర్గానికి వ్యతిరేకంగా పెట్టుబడిదారీ వర్గం విసురుతున్న సవాళ్ళను ప్రవాహంలాంటి తన వాగ్ధాటితో విశ్లేషించారు. మార్క్సిస్టు విశ్లేషణా విచక్షణతో పెట్టుబడిదారీ సంక్షోభాన్ని వివరిస్తూ "పెట్టుబడిదారీ విధానం ఉన్నంతవరకూ పెట్టుబడిదారీ సంక్షోభాలు నిరంతరం సంభవిస్తూనే ఉంటాయని అన్నారు. సంక్షోభాల నుండి బయటపడాలని ప్రయత్నం చేసిన ప్రతిసారీ పెట్టుబడిదారీ విధానం ఆ భారాలను కార్మిక వర్గ ప్రజలపై నెట్టడం కూడా సర్వసాధారణ విషయమేనని ఆయన అన్నారు. ప్రజల్లో నెలకొన్న నిరాశా, నిస్పృహలను కూడా ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించారు. ప్రజలు దాడికి గురవుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తి నిరంతరం పడిపోతోంది. వ్యవసాయరంగమే సంక్షోభంలో కూరుకు పోతోంది. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆకాశా న్నంటుతున్న ధరలు, పెరుగుతున్న దారిద్ర్యం, ఆహారాన్నే కాదు ! విద్యా, వైద్య, సదుపాయాలను సైతం ప్రజలకు, వారి పిల్లలకు దూరం చేస్తున్నాయి. పెన్షన్ పథకాలు నీరు కార్చబడు తున్నాయి. విస్వసనీయమైన పెన్షన్ పథకం రద్దుగావించ బడింది. వితంతువులు, నిరుపేదల పెన్షన్లను నిలిపివేస్తున్నారు. ఇ.యస్.ఐ వ్యవస్థ కల్పిస్తున్న సౌకర్యాలను సామాజిక భద్రతా పథకాలను రద్దు చేస్తున్నారు. ఆషా, అంగన్ వాడీ, మధ్యాహ్న భోజన తదితర పథకాలను ప్రైవేటీకరణ గావిస్తున్నారు. ప్రావిడెంట్ ఫండ్ పథకాలను మార్కెట్ మాయాజాలానికి అనుసంధానం చేస్తున్నారు. ప్రజలపై ముప్పేట దాడి జరుగుతోంది. సామాజిక భద్రతా రంగాల పటిష్టతకు నిధుల కేటాయింపుల్లో తీవ్రమైన కోతలు విధించి తగ్గించేస్తున్నారు. ప్రజల విద్యా, వైద్య హక్కులు తిరస్కరణకు గురవుతున్నాయి. విద్య వ్యాపారంగా మారింది. వైద్యం ప్రైవేటీకరణ గావించబడింద" ని భారత ప్రజల ఆర్థిక పరిస్థితులపై ఆయన వివరణ ఇచ్చారు. గురుదాస్ దాస్ గుప్తా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రజలపైన మరియు భారతీయ మౌలిక లక్షణాల పైన నిస్సిగ్గుగా బీజేపీ చేస్తున్న దాడుల్ని బహిర్గతం చేశారు.

"బీజేపీ దాని హిందూత్వ శక్తులు గావిస్తున్న మతోన్మాద మారణ కాండను ఈ పరిణామాల నేపథ్యంలో అర్థం చేసుకోవాల్సి ఉంది. ప్రజా ప్రతిఘటనను నీరు గార్చేందుకు, బలహీన పరిచేందుకు మత ప్రాతిపదికపై ప్రజలలో చీలిక తీసుకురాబడుతోంది. మందిర్, మసీద్ అంశాలను తెర పైకి తీసుకువచ్చి బీజేపీ మత కల్లోలాలను రెచ్చగొడుతోంది. తద్వారా ప్రజా ప్రతిఘటన ఉద్యమాలు పదునెక్కకుండా మొద్దుబారేలా చేస్తుందని" గురుదాస్ వివరించారు. బీజేపీ దేశాన్ని ప్రైవేట్ రంగానికి అప్ప జెప్పేస్తుందని అంటూ బీజేపీ యొక్క పెట్టుబడిదారీ భావజాలంపై తన ఆగ్రహాన్ని ఎక్కుపెట్టారు.

"విదేశీ, ఆర్థిక, రక్షణ, శాంతి భద్రతల రంగాలకు ప్రభుత్వ పాలనను పరిమితం చేసి మిగిలిన పాలనా రంగాలన్నిటిని పెట్టుబడిదారీ వర్గ ఇష్టాహిష్టాల మేరకు ప్రైవేట్ రంగానికి అప్పజెప్పాల" నే బీజేపీ లోతైన కుట్రను ఆయన బహిర్గతం చేశారు.

కీలక రంగాలైన రక్షణతో పాటు వ్యవసాయం, రిటైల్, ఔషధం, ఇన్సూరెన్స్ రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐలకు) తలుపులు బార్లా తెరిచిన మోడీ స్వదేశీ భావజాలాన్ని తనదైన శైలిలో ఎద్దేవా చేశారు. సామాజిక సంక్షేమంపై ఖర్చుల్లో కోత పెడుతూ, సైనిక రంగంలో ప్రభుత్వ వ్యయాన్ని పెంచుకుంటూ పోతున్న మోడీ ప్రభుత్వ విధానాలను ఆయన తూర్పార బట్టారు. "కాశ్మీర్ తగలబడుతోంది." మన తలపై ఎక్కుపెట్టిన ఐ.యస్.ఐ.యస్ తుపాకి" లాంటి కల్పిత కథనాలను ప్రచారంచేస్తూ , తద్వారా ప్రజలలో విద్వేషాలను రెచ్చగొడుతూ రక్షణ రంగంపై పెంచుకుంటూపోతున్న ప్రభుత్వ వ్యయాన్ని సమర్థించుకుంటున్న మోడీ తెలివితేటలను దాస్ గుప్తా దెప్పి పొడిచారు.

పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్ రంగాలలో సంస్కరణలను ఉటంకిస్తూ "కార్మికుల కష్టార్జితాన్ని దొంగలు దోచుకుంటున్నారు. అదానీ, అంబానీల బొక్కసాన్ని నింపటమే వారి ధ్యేయం" అని గురుదాస్ నిప్పులు చెరిగారు. "కార్పొరేట్ పెట్టుబడుల అనుకూల లేబర్ మార్కెట్" అవసరం అన్న పేరుతో అనేక త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాల సవరణలకు మోడి ప్రభుత్వం పూనుకుంది. "కార్మికవర్గ హక్కులపై క్రూరమైన దాడి ఇది" అని తన గంభీర స్వరంతో నిజాన్ని నిర్ధారించారు.

"న్యాయవ్యవస్థ సైతం వర్గ పక్షపాతాన్ని ప్రదర్శిస్తోంది" అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తన స్వానుభవాన్ని వివరించారు. కె.జి. బేసిన్ నుండి అక్రమంగా గ్యాస్ తరలించుకుపోతున్న ఆర్.ఐ.యల్.కి వ్యతిరేకంగా న్యాయస్థానంలో తాను దాఖలు చేసిన పిటిషన్‌కు ఏ గతి పట్టిందో ఆవేదనతో ఉదహరించారు "కేసు అనుమతించబడి 3 సం॥రాలు గడిచిన తర్వాత కూడా తన కేసు విచారణకు రాక పోవటాన్ని ఏమనుకోవాలి? కార్పొరేట్ కంపెనీలతో న్యాయ వ్యవస్థ షరీకు అయిందనటానికి ఇది ఉదాహరణ కాదా" అని తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. "దేశం తీవ్ర ప్రమాదంలో పడుతోంది" అని హెచ్చరించారు ఆయన.

"కారు చీకట్లు కమ్ముకుంటున్న పరిస్థితులు తలెత్తాయి. అన్యాయం రాజ్యమేలుతోంది. ప్రజలపై అణచివేత పెరిగిపోతుంది" అని నేటి పరిస్థితుల్ని కళ్ళకు గట్టినట్లు వివరించారు. "కార్మికవర్గ ఐక్యత! అదొక్కటే చీకట్లను పారద్రోలగలిగిన ఆయుధం" అని నిర్ద్వందంగా ప్రకటించారు. ఈ మాటలంటున్నపుడు ఆయన ముఖ కవళికలు గంభీరంగా మారాయి. "ఏఐటీయూసీ స్థాపించబడిన 1920 సం॥లో పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ ఈ నాటి పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారాయి" అని దాస్ గుప్తా నిర్ధారించారు. కేంద్ర కార్మిక సంఘాలు అనేకం ఉన్నాయి. కేంద్ర కార్మిక సంఘాలన్నిటిని కలిపి ఒకే వేదికపైకి తీసుకు రాగలగటం ఒక చారిత్రక ఘట్టం. కాని ఈ ఐక్యతను నిలబెట్టటం, మరింత ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత ఏఐటీయూసీ పైనే ఎక్కువగా వుంది" అని కర్తవ్య బోధ గావించారు గురుదాస్ గుప్తా.

సమిష్టి ప్రతిఘటనను ప్రస్తావిస్తూ ఆయన "బాగానే ఉంది గాని, చాలినంతగా లేద" ని అంటూ "కాని చరిత్ర మారుతుంది, ఆ క్షణం కోసం ఎదురుచూద్దాం ! మంట రగిలించండి ! ఆరిపోకుండా చూడండి ! సరిగ్గా సమయం వచ్చినప్పుడు దోపిడి వ్యవస్థ భస్మం కాక తప్పదు ! అక్కడ శాంతి, సమానత్వం, సాహోదరతలు వెల్లివిరుస్తాయి. ఇది చరిత్ర చాటి చెప్పిన సత్యం ! నిరాశ నిస్పృహలను దరిచేయనీయకండి ! ఆశావాదిగానే ఉండండి !" అంటూ గంభీర స్వరంతో శ్రేణుల్ని ఉత్సాహపరిచిన తీరు అత్యద్భుతం ! సభయావత్తూ కరతాళ ధ్వనులతో మార్మోగిపోయింది."మన శ్రేణుల్ని బలోపేతం చేసుకోవటం, ఐక్యతను సాధించటం, మన సైద్ధాంతిక శక్తిని పెంచుకోవటం పైనే మనవిజయం ఆధారపడివుంద" ని ఆయన అన్నారు. యావత్ కౌన్సిల్ సభ్యులలో నూతన ఉత్తేజాన్ని నింపాలి!. పోరాటాలకు సిద్ధం చేయాలి! ఏఐటీయూసీని మరింత శక్తివంతం గావించాలి! అదే ఆయన తపన ! నిరంతర పోరాట యోధుని మాటల్లో ప్రతిధ్వనిస్తోంది అదే!గుండెలోతుల్లో పాతుకుపోయిన అద్భుత విశ్వాసం ఆయనలో వ్యక్తమైంది. "ఏఐటీయూసీకి ఎదురులేదు, దానికి ఓటమిలేదు . అది ఎప్పటికీ బలహీన పడదు. దానికి సైద్ధాంతిక శక్తి, బలం ఉన్నాయి. దానికి సంఖ్యాబలం ఉంది. అట్టడుగుస్థాయి కార్మికుల దగ్గరకు వెళ్ళండి! ముందున్న ప్రమాదాన్ని వివరించి వారిని మేల్కొలపండి ! పోరాటం తప్ప మరో మార్గంలేదని వారికి చెప్పండి. వారిని పోరాటాలకు సన్నద్ధం చేయండి. యుద్ధభూమిపై అడుగుపెట్టాక మీ ఐక్యతే మీ ఆయుధం ! మీ రాజకీయ సైద్ధాంతిక భావ జాలమే మీ ఆయుధం. మీ ఆయుధాలను పదునెక్కించండి ! ఎగిసిపడే యువశ్రేణుల్ని తీసుకువచ్చి ప్రోత్సహించండి. నూతన తరహా నాయకత్వ జట్టులను నిర్మించండి. చారిత్రాత్మక కర్తవ్యాన్ని మీరు నిర్వహించాల్సివుంది. జనంలో అగ్రహాన్ని రేకెత్తించండి. మనకు నిర్దేశించబడిన కర్తవ్య నిర్వహణకు మనకు మనం పునరంకితం కావలసిన సమయమిది. లాంగ్ లివ్ ఏఐటీయూసీ! లాంగ్ లివ్ వర్కింగ్ క్లాస్ యూనిటీ" అంటూ తన అద్భుత ప్రసంగాన్ని ముగించారు. గురుదాస్ దాస్ గుప్తా ! ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శిగా ఇది ఆయన చివరి ఉపన్యాసం.

పట్టుదల, తిరుగులేని విశ్వాసం, ధృఢచిత్తం మూర్తీభవించిన కామ్రేడ్ గురుదాస్ దాస్ గుప్తా జాతీయ కౌన్సిల్ సభ్యులందరి మనోఫలకాలపై శాశ్వతంగా నిలిచి పోయారు. వర్తమాన కాలంలో ఉత్తేజితుల్ని చేయగల అనేక మంది నాయకుల ఉపన్యాసాలతోపాటు ప్రధాన కార్యదర్శిగా గురుదాస్ గుప్తా చేసిన ఈ చివరి ఉత్తేజిత ప్రసంగం చరిత్ర పుటలలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

పోరాడేందుకు జీవించు!- జీవించేందుకు పోరాడు!" అన్న గురుదాస్ దాస్ గుప్తా నినాదం సర్వకాల సర్వావస్థలలోనూ శిరోధార్యంగా స్వీకరిద్దాం ! "ప్రజల్లో చైతన్య జ్వాలను రగిలించే నాయకత్వ పాత్రను కార్మిక సంఘాలు నిర్వహిస్తాయి. పెట్టుబడిదారీ విధానాన్ని ధ్వంసం చేయాలంటే కార్మిక, కర్షక ఐక్యత నేటి చారిత్రక ఆవశ్యకత. కార్మిక సంఘాలు ప్రత్యేకించి ఏఐటీయూసీ ఈ బాధ్యతను స్వీకరించాల" ని ఆయన బోధించారు. ఈ ఉద్రేక పూరిత ప్రసంగం సహజంగానే ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసి కట్టిపడేసింది.

"ఏదీ జడ పదార్థం కాదు. స్థిరంగా ఉండటాన్ని మనం అనుమతించరాదు. చరిత్ర పుటల్ని తిరగరాసే బాధ్యతను చరిత్ర మనపై వుంచింది. నయా ఉదారవాద, ఆర్థిక పెట్టుబడిదారీ విధానం ప్రపంచ కార్మిక వర్గానికి కనీవినీ ఎరుగని సవాళ్లను విసిరింది. ఆ సవాళ్లను ఎదుర్కొనాలి. పెట్టుబడిదారీ విధానాన్ని ధ్వసం చేయాల్సి"న కర్తవ్యం కార్మిక వర్గం ముందుందని కర్తవ్య బోధగావించారు.

వ్యాస రచయిత : ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి

రాయలసీమ రగులుతోంది



వి. శంకరయ్య

రోగంగుట్టు రోగి రట్టు అనే పూర్వీకుల సామెత ముఖ్యమంత్రి చంద్రబాబుకు జ్ఞప్తిలో వున్నట్లులేదు. ప్రాంతీయ అసమానతలకు అనుగుణంగా ఒక దఫా రాష్ట్రం రెండుగా విభజించబడిన సందర్భంలో నిద్రలేని రాత్రుళ్లు గడిపానని మొసలి కన్నీరు కార్చిన (ఈ పాపంలో చంద్రబాబు పాత్రకూడా వుంది) ముఖ్యమంత్రి రాయలసీమ చారిత్రక వారసత్వాన్ని ప్రాధాన్యతను ఆ ప్రాంత ప్రజల మనోభావాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నేడు రాయలసీమలోని పట్టణాలు నిరసనలతో రగులుతున్నాయి. కానీ ముఖ్యమంత్రి ఏమీ జరగనట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి పరిభాషలోనే చెప్పాలంటే ఎక్కడో కొండల్లో గల అరకులోయలోని ఒక గ్రామంలో వీధిలైట్లు వెలిగే అంశం తన డ్యాష్ బోర్డులో గుర్తించ గలిగినప్పుడు గత పక్షం రోజులుగా రాయలసీమలో సాగుతున్న ప్రదర్శనలు, నిరసనదీక్షలు ర్యాలీలతో కూడిన ఆందోళనా కార్యక్రమాలు ముఖ్యమంత్రి డ్యాష్ బోర్డుకు లేదా ఆయన దృష్టికి రాలేదంటే నమ్మగలమా? పైగా పటిష్టమైన పోలీసు ఇంటలిజెన్స్ ఉండనే వుంది. సందట్లో సడేమియా అన్నట్లు ఇదే సందర్భంలోనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనంతపురం జిల్లానుండి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంలో పవన్ కళ్యాణ్ సీమ ప్రజల వాంఛల గురించి ఏలా స్పందిస్తారో వేచి చూడాలి.

కర్నూల్‌లో హైకోర్టు నెలకొల్పాలని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని గుండ్రేవుల వద్ద రిజర్వాయర్ నిర్మించాలని కృష్ణానదిపై సిద్దేశ్వరం వద్ద అలుగు నిర్మించాలని ప్రధానమైన కోర్కెలతో రాయలసీమ జిల్లాలు ప్రదర్శనలు, నిరసన దీక్షలతో దద్దరిల్లుతున్నాయి. వివిధ ప్రజా సంఘాలతో పాటు రాయలసీమలో హైకోర్టు నెలకొల్పాలని లాయర్లు కూడా ఆందోళన ప్రారంభించారు. తుదకు ముఖ్యమంత్రి సొంత జిల్లా చిత్తూరులో కూడా లాయర్లు విధులు బహిష్కరించారు. కానీ ఈ ఆందోళనలకు పాపులర్ మీడియాలో సముచిత స్థానం లభించడంలేదు. అందుకే గత కొంతకాలంగా సీమలోని యువత సమాచార మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. ఇది దావానంలా వెల్లువెత్తుతోంది. గతంలో హైదరాబాద్‌ను విశ్వనగరం చేసే ఉద్దేశంతో ముఖ్యమంత్రి తన తొమ్మిదేళ్ళ పరిపాలనా కాలంలో సీమాంధ్రను మొత్తంగా నిర్లక్ష్యం చేసినట్లే ప్రస్తుతం ప్రపంచం మెచ్చే అద్భుత రాజధాని అమరావతి అనే ఊబిలో దిగబడి కేంద్రీకృత విధానం అమలుజేయడంతో రాయలసీమలో కనీసం హైకోర్టు అయినా నెలకొల్పే అవకాశాలు సన్నగిల్లాయి. ఫలితంగా నేడు సీమ జిల్లాలలో యువత ఉద్యమబాట పట్టారు. గత తొమ్మిదేళ్ళ తన పరిపాలనా కాలంలో తెలంగాణా అనే పదం కూడా పార్టీ వేదికలపై వినిపించకుండా చేసిన ముఖ్యమంత్రి తుదకు చేదు అనుభవం చవి చూడవల్సి వచ్చింది. నేడు రాయలసీమ విషయంలో ముఖ్యమంత్రి వైఖరి ఫలితంగా తలెత్తే దుష్ఫలితాలను ఎదుర్కొనక తప్పదు.

రాయలసీమ జిల్లా పట్టభద్రుల నియోజకవర్గంలో లక్షా యాభై ఐదువేల ఓట్లు పోలైతే తెలుగుదేశం అభ్యర్థికి 60 వేల ఓట్లు కూడా రాలేదు. కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలోని యువత మనోభావాలు ఆ రోజుల్లోనే వెల్లడైనాయి. కానీ నంద్యాల ఉప ఎన్నికల్లో కోట్లు కుమ్మరించి విజయం సాధించి రాయలసీమ ప్రాంత ప్రజలంతా తన ఏకపక్ష విధానాలను బలపరుస్తున్నారని భావిస్తే అది భ్రమ మాత్రమే. నేడు రాయలసీమ జిల్లాల్లో ప్రధానమైన నాలుగైదు కోర్కెలతో వీధులోకి వస్తున్న యువకులు మేధావులు, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు గొంతెమ్మ కోర్కెలు కోరడంలేదు. రాష్ట్ర సమగ్రతకు ముప్పుతెచ్చే డిమాండ్లు చేయడంలేదు. ఒకవేళ ఇలాంటి ప్రమాదమే మున్ముందు ముంచుకొస్తే ముఖ్యమంత్రి చేపడుతున్న కేంద్రీకృత విధానాలే పౌర సమాజం ముందు ముద్దాయిగా నిలబడాల్సి ఉంటుంది. రాయలసీమ ప్రజలు తమ చారిత్రక వారసత్వాన్ని ధ్వంసం చేయవద్దని కోరుతున్నారు. గతంలో దూర దృష్టితో నిఖార్సైన రాజకీయ నేతల మధ్య కుదిరిన చారిత్రక ఒప్పందం శ్రీబాగ్ ఒడంబడికను పాక్షికంగానైనా అమలు చేయమని కోరుతున్నారు. 1937 నవంబర్ 16వ తేదీన జరిగిన శ్రీబాగ్ ఒడంబడిక మేరకు రాజధానిని ఒక ప్రాంతంలో నిర్మిస్తే హైకోర్టు మరొక ప్రాంతంలో నిర్మించాలని సీమ ప్రజలు వాంఛిస్తున్నారు. సీమ ప్రాంతంలో హైకోర్టు నెలకొల్పితే కోస్తా ప్రాంత ప్రజలనుండి వచ్చే వ్యతిరేకత కూడా ఏమీ వుండదు. పైగా నాలుగు పంటలు పండే భూములను లాగుకున్నందుకు కసితో రగిలిపోతున్నారు. విజయవాడ బందర్ రోడ్డులో ఉన్న మహావృక్షాలను నేల కూల్చిన ముఖ్యమంత్రి వనమహోత్సవం క్రింద మొక్కను నాటడాన్ని మంచంపట్టి అనారోగ్యంతో వున్న ప్రముఖ నవలా రచయిత పెద్దిభట్ల సుబ్బరామయ్య ఆ మధ్య కంటతడి పెట్టినప్పుడు గుండె చెరువై పోయింది. వచ్చిన చిక్కల్లా ఒకటే. ముఖ్యమంత్రి చంద్రబాబును ఆవహించిన కీర్తి కండూతి అడ్డొస్తోంది. అద్భుత రాజధానిని నిర్మించి చరిత్రలో నిల్చిపోవాలనే దిక్కుమాలిన భావజాలమొక్కటే అడ్డంకి. ఈ దుర్మార్గం గమనించిన బీజేపీ నేత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఒక సందర్భంలో ముఖ్యమంత్రికి చురక అంటించారు.

"హైదరాబాద్ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని చంద్రబాబుకు నేనోమాట చెప్పాను. అభివృద్ధి కేంద్రీకృతం కాకూడదు. ఆకర్షణీయ రాజధాని వుండాలి. అభివృద్ధి అన్ని జిల్లాల్లో ఉండాలి. ప్రాంతాల వారీగా మాకేమిటీ అని ప్రజలు అడుగుతున్నారు". అని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కేంద్ర మంత్రిగా వున్న సమయంలో ఒక ఇంటర్వ్యూలో కుండ బద్దలకొట్టినట్లు చెప్పారు. వాస్తవంగా చెప్పాలంటే మిత్రపక్షమైన బీజేపీ కూడా రాజధాని అంశంలో ముఖ్యమంత్రితో ఏకీభవించడంలేదు. అందుకేనేమో రాజధాని శంఖుస్థాపన సందర్భంగా వచ్చిన ప్రధానమంత్రి పిడికెడు మట్టి, చెంబుడు నీళ్ళు ఇచ్చి వెళ్ళారు. ఉమ్మడి హైకోర్టు విభజింపబడి రాష్ట్ర హైకోర్టు అమరావతికి వచ్చే జూన్ కల్లా తరలింపబడుతుందని వార్తలు వెలువడిన తదుపరి రాయలసీమలో హైకోర్టు కోసం ఆందోళన అన్ని వర్గాల ప్రజలలో తీవ్రతరమైంది. రాయలసీమకు చెందిన ప్రముఖ టీడీపీ నేతలకు ప్రజాసంఘాల ప్రతినిధులు మెమోరాండాలు ఇచ్చారు. ముఖ్యమంత్రికి జ్ఞానోదయం కల్పించమని కోరారు. ఇదంతా లాంఛనమే. అందుకే తమ కోర్కెల సాధనకు వీధుల్లోనికి వస్తున్నారు. ఈ ఆందోళనా కార్యక్రమాలకు వైసీపీ కాంగ్రెస్, సీపీఐ, సీపీయం పాక్షికంగా స్థానిక బీజేపీ నేతలు అండ దండలిస్తున్నారు. ఇదే పరిస్థితి మరో పక్షంరోజులు కొనసాగితే స్థానిక టీడీపీ నేతలు ఉక్కిరి బిక్కిరి కావల్సి వస్తుందేమో. ప్రధానంగా హైకోర్టు కడపలో, ఉక్కు ఫ్యాక్టరీ గుండ్రేవుల రిజర్వాయరు, సిద్దేశ్వరం వద్ద అలుగు డిమాండ్లతో ఉద్యమాలు సాగించే నేతలు జాగరూకత వహించాలి.

ఈ నెల 25వ తేది కడపలో ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు, హైకోర్టు కొరకు నిర్వహించిన బంద్ సందర్భంగా పోలీసులు సాగించిన దమనకాండ గర్హనీయం. అమరావతి నిర్మాణంతో కీర్తి కండూతి పట్టుకున్న ముఖ్యమంత్రి మున్ముందు పోలీసు జులుంను పెంచే అవకాశం లేక పోలేదు. ఉద్యమకారులు ఈ ప్రమాదం దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా వుండాలి. నంద్యాల ఉప ఎన్నికల తదుపరి పార్టీ ఫిరాయింపులతో గెలుపు గుర్రం ఎక్కినట్లు భ్రమిస్తున్న ముఖ్యమంత్రికి రాయలసీమ ప్రజల మనోభావాలు తెలియకపోలేదు. ప్రజల అంశానికొస్తే కొంగజపం పాటిస్తున్నారు. అయితే ప్రజలతో పనిలేదు. సీమలో గతంలో ఫ్యాక్షనిష్టులుగా వుండి రాజకీయ అవతారమెత్తి వివిధ పార్టీలలో ఉన్న వారిని పార్టీ ఫిరాయింపులు చేసి తనపార్టీలో చేర్చుకొని వారితోనూ కోట్లాది రూపాయలతోనూ ఎన్నికల్లో గెలుపుగుర్రం ఎక్క వచ్చు అనే భావనతో ఉన్న ముఖ్యమంత్రి అంత సులభంగా సీమ ప్రజల మనో వాంఛలకు తన కీర్తి కండూతిని పణంగా పెట్టే అవకాశాలు లేకపోయినా చరిత్రలో ఇటువంటి వారికి ఎదురైన అనుభవాలు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తుదకు ముఖ్యమంత్రికే 2004లో చేదు అనుభవం ఎదురైంది. ముఖ్యమంత్రి అవలంభిస్తున్న ఏకపక్ష పెడసరి విధానాల వలన రాష్ట్రం మరోమారు రావణకాష్టం అవుతుందనే ప్రజాతంత్ర వాదులను వేధిస్తోంది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి తనకు రాజకీయ జన్మనిచ్చిన రాయలసీమ ప్రజల మనోభావాలను గుర్తించి రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు పెరగకుండా అమరావతిలో అద్భుత రాజధాని నిర్మించుకున్నా రాయలసీమలో హైకోర్టును నెలకొల్పేందుకు సిద్ధంకావడం మంచిది. వెనకబడిన ఉత్తరాంధ్ర అంశానికొస్తే విశాఖపట్నం మహానగరంగా అభివృద్ధి చెంది మణిహారంగావుంది. వెనకబాటుతనం రాయలసీమకు మాత్రమే మిగిలింది. సీమలో తనపార్టీ నేతలను సంతృప్తి పరిచేందుకు రోజుకొక పథకం ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నారు. అనంతపురం జిల్లాలో పేరూరు, భైరవాని తిప్ప ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. 40 టీఎంసీల జలాల సామర్థ్యం గల హంద్రీనీవా నుండి కర్నూలు, అనంతపురం జిల్లాల అవసరాలు తీర్చి తన జన్మభూమి చిత్తూరుకు ఎన్ని టీఎంసీలు తీసుకెళ్తారో అవగతం కావడంలేదు. పైగా బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు మెడమీద కత్తిలా వేలాడుతోంది. పాలమూరు, దిండి ఎత్తిపోతల పథకాల అంశంలో తెలంగాణ ముఖ్యమంత్రి సాహసం చేశారు. కానీ సీమ ప్రజలకు వాస్తవంగా ఉపక రించే గుండ్రేవుల, సిద్దేశ్వరం అలుగు అంశంలో ఏపీ ముఖ్యమంత్రి వెనకాడడాన్ని అదేసమయంలో హైకోర్టునైనా నెలకొల్పని నేపథ్యంలో ముఖ్యమంత్రిని సీమ ప్రజలు నిలదీసే రోజు ఎంతో దూరంలో లేదు.

వ్యాస రచయిత : విశ్రాంత పాత్రికేయుడు
సెల్ : 9848394013

విశాలాంధ్ర
బతుకు
The Life
శనివారం
10 ఫిబ్రవరి 2018



తల్లి ప్రేమ!

అమ్మ ప్రేమ ఏ జీవిలోనైనా ఒక్కటే. బేబీ గొరిల్లా కియో తన తల్లి కుమిలి వద్ద సేద తీరుతున్న ఈ చిత్రమే అందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఈ దృశ్యం జర్మనీలోని లిప్‌జిగ్ ప్రాంతంలోని జంతుప్రదర్శనశాలలోది.



మినీ బల్బులతో మెనీ సమస్యలు!

వివాహం...పండుగ...పార్టీ...సందర్భం ఏదైనా కావచ్చు. పదిమందీ చేరి విందు వినోదాలతో గడపాలనుకున్నపుడు పరిసరాలను శోభాయమానం చేసుకోవడం సహజం. అందుకోసం స్థాయికి తగ్గట్లుగా భారీ ఏర్పాట్లే చేస్తుంటారు. అలాంటి ఏర్పాట్లలో ఒకటి-ఇటీవలి కాలంలో ముఖ్యమైనదీ కూడా...విద్యుద్దీపాలంకరణ. గతంలో పందిరినిండా కాకపోయినా అక్కడక్కడ ఒక పద్ధతి ప్రకారం లేదా 'జిగ్‌జాగ్'లా రంగురంగుల కాగితాల తోరణాలు (పువ్వులు, ఆకుల రూపంలో) వ్రేలాడదీసేవారు. తర్వాత వాటి స్థానాన్ని బెలూన్లు ఆక్రమించగా వాటిని త్రోసిరాజన్నాయి బల్బులు. మొదట్లో మామూలు (జీరో క్యాండిల్) బల్బులకీ రంగుల కాగితాలు చుట్టడమో, రంగుల బల్బులు కొనడమో చేసేవారు. క్రమేపీ నాగరికత సాంకేతికత విజృంభించడంతో మినీ బల్బులే తోరణాల రూపంలో ఆహూతులను అలరించడం మొదలెట్టాయి. వీటికే 'సిరీస్ బల్బు'లనే పేరు. ఇప్పుడు ఏ మండపం లేదా పందిరి చూసినా వీటిదే రాజ్యం.





సిరీస్ బల్బుల అలంకరణ చూడటానికి వాటి సోయగాలను బట్టి అద్భుతంగా వున్నా ఆ అమరిక వెనుకే కొంత ప్రమాదమూ తొంగి చూస్తుందని గ్రహించాలి. ఎందుకంటే ఈ తోరణాలు చాలా తేలికగా పిల్లలకు అందుబాటులో వుంటాయి. కొన్ని సందర్భాలలో ముఖ్యంగా పిల్లలు ఎక్కువ సంఖ్యలో గుమికూడే వివాహ వేడుకలలో ఈ అలంకరణ నేలబారుగానే-చెట్లు, ఫౌంటెన్ల రూపంలో వుంటుంది. వీటివైర్లు అక్కడే తివాచీలకిందే వుంటాయి. ఒక్కొక్కసారి ఇవి ప్రమాదవశాత్తూ పిల్లల కాళ్ళకు అడ్డం పడవచ్చు. లేదా వారే ఆటల్లో పడి వీటిని అటూ ఇటూ లాగవచ్చు. ఫలితంగా అవి పొజిషన్ మార్చుకోవడం, విద్యుత్ సరఫరాలో పెనుమార్పు జరిగి ప్రమాదాలకు దారితీయడం రివాజైపోతుంది.

ఇలా జరగడంలో మన లోపం వున్నప్పటికీ ప్రధాన తప్పిదం మాత్రం ఈ తోరణాల తయారీదార్లదే నంటున్నారు ఈ రంగంపట్ల అవగాహన కలిగివున్న నిపుణులు. ఈ విషయమై ఇటీవలే ఇన్‌సైట్ (కన్స్యూమర్స్ మేగజైన్)లో ఒక కథనం కూడా ప్రచురితమయింది. దానిప్రకారం తెలుస్తున్న వివరాలు:

సాధారణంగా మనం ఉపయోగించే బల్బుల తోరణాలు సామాన్యుల విషయంలో స్థానికంగా తయారైనవే అయివుంటాయి. కనుక నాణ్యత వగైరాల గురించిన ఇబ్బందులుండకపోవచ్చు. వాటిని అమర్చుకోవడంలోనే జాగ్రత్త పడాల్సి వుంటుంది. కానీ కొంచెం స్థితిమంతులు, ఆపై శ్రీమంతులు ఉపయోగించే 'సిరీస్' మాత్రం ఎక్కువగా 'కంపెనీ'లవే ననేది నిర్వివాదం. ఇవన్నీ దాదాపు విదేశీ తయారీయే. అక్కడే వస్తున్నది అసలు చిక్కు. చైనా వంటి దేశాల నుంచి దిగుమతి అయ్యే ఈ సరుకు అన్ని విధాలుగా దగాకోరు సరుకేనని విశదమవుతోంది. ప్యాకెట్లపై వుండే రాతలకు లోపలి సరుకుకు పొంతన ఏమాత్రం వుండటంలేదు. ఎవరు తెప్పించారో కూడా తెలియదు. కనీసం ఆ ప్యాకెట్లయినా నిబంధన లకు అనుగుణంగా వుంటాయా అంటే అదీలేదు. 'ప్లాస్టిక్ ప్యాక్స్'లో సీలువేసి మరీ ఇస్తారు.

'రకరకాల' దగాలు

తయారీదార్లు, దిగుమతిదారులు తెలియని ఈ బల్బుల రకాలు మాత్రం నెట్, నియాన్, రోప్, రైస్, డెకరేటివ్ బల్బ్, లెడ్‌లాంటి విచిత్రమైన నామధేయాలతో అలరారుతుంటాయి. నిపుణులు వాటినే తమ పరిశీలనకు తీసుకుని చూశారు. వీటిలో దాదాపు ఏ ఒకటి మనదేశపు అవసరాలకు తగినది కాదు. ప్యాకెట్లపై నూటఅరవై బల్బులని పేర్కొంటే లోపల 140-150కి మించి వుండవు. వాటి విద్యుత్ వోల్టేజి 220 అంటారు. నిజానికి మనదేశంలో 230 V కి తక్కువలేనే లేదన్నది గమనార్హం. బల్బులలో ఏదైనా మాడిపోతే కొత్తది చాలా సునాయాసంగా పెట్టుకోవచ్చునంటారు. ఇంకా ఇలాగే ఏవో సలహా సూచనలను, హామీలను లెడ్, రైస్‌లాంటి ప్యాకెట్లపై ఘనంగా ముద్రించారు. కానీ అవి ఏవీ సాధ్యంకావని తేలింది. "ప్యాకేజ్డ్ కమోడిటీస్ (సవరణ) చట్టం ప్రకారం ప్రతివస్తువు లేదా పదార్థం ప్యాకెట్‌పైనా తయారీదారు వివరం, తేదీ, లాట్ నంబరు వగైరా వుండాలి. కానీ ఏ సిరీస్ ప్యాకెట్‌పైనా అలాంటి వివరాలు, ఏ విధమైన చిరు నామాలు కనిపించవు. అంటే తేడాలొస్తే ఎవరితో మొరపెట్టుకోవాలో ఎవరిపై దావావేయగలమో తెలియదన్నమాట!? అత్యంత కీలకమైన అతి స్వల్ప విషయాలను సైతం ఈ సిరీస్ తయారీదార్లు పట్టించుకోవడంలేదు. ఇందుకు నిదర్శనం ఈ తోరణాల చివర అమర్చే ప్లగ్గులే. ఇవి మన భారతీయ స్విచ్‌బోర్డులకు ఏమాత్రం తగినవికావు. వీటి కొలతలన్నీ తప్పుల తడకలే. ఈ ప్లగ్స్ పిన్నుల వ్యాసం 5.03 మి.మీ.లకు తక్కువ కాకుండా 5.10 మిల్లీ మీటర్లకు మించకుండా వుండాలి. కానీ చైనా 'కంపెనీ'లు రూపొందించే ఈ సిరీస్‌లో ఏదీ ఈ నిబంధన పాటించడంలేదు. వాటిలోనూ 'రైస్' అయితే ఆ కొలత 3.73 మిల్లీమీటర్లను దాటదు. ఇలాంటివి మన పాకెట్‌లో ఏవిధంగా అమరుతాయి? (పైగా కొందరు బుద్ధిమంతులైతే మనలనే ప్లగ్ పిన్ను తీసేసి తాజాగా మనకు తగినవి బిగించుకోమని సలహా యిస్తుంటారు!)

ఎంపిక ఎలాగ?

ఏది మంచిదో తేల్చకపోతే కొనడం ఎలాగన్నది ఒక సమస్యగా మిగిలిపోయేమాటనిజమే. అందుకే నిపుణులు కొన్ని సూచనలు (టిప్స్) యిస్తున్నారు. ముందుగా యథాశక్తి 'బేరం' ఆడుకున్న తర్వాతే కొనుగోలు చేయడం మంచిది. ప్యాకెట్‌పై పేర్కొన్న ప్రకారం లెక్కకు అనుగుణంగా బల్బులన్నీ వున్నాయా అని చూడాలి. ప్లగ్, హోల్డర్స్, కంట్రోలర్స్ వగైరా పార్టులన్నీ సరిగా వున్నాయో లేదో తనిఖీ చేసుకోవాలి. మొత్తం వైరును నిశితంగా పరీక్షించాలి. వైరులోని లోపాలే ప్రమాదాలకు కారకాలు.ముఖ్యంగా సిరీస్‌ను అక్కడికి అక్కడే వెలిగించి చూపాలని పట్టుబట్టాలి. అన్నీ అనుకున్న ప్రకారం వెలుగుతున్నాయో లేదో చూసుకోవాలి. ఏ సిరీస్ కన్నా పూర్తిగా ట్వింకిల్ లేదా 'కాంబినేషన్' తరహా వుండేట్లు చూసుకోవాలి. ఇందువల్ల చూపరులను ఆకర్షించడమేగాక వాటి జీవన ప్రమాణం ఎక్కువగాను, మన బిల్లు తక్కువగాను వుంటుంది.

ఉత్తమం...ఏదీ కాదు

సాధారణంగా ఇటువంటి కథనాలలో (వివిధ రకాలను పోల్చినపుడు) ఏది కొనవచ్చునో సూచించడం రివాజు. పాఠకులు (వినియోగదారులు) ఆశించేదీ అదే! కానీ ఈసారి మాత్రం BEST BUY ప్రసక్తే లేదంటున్నారు నిపుణులు. ఎందుకంటే విదేశీ రకాలు ఏవీ నిబంధనలు పాటించడంలేదు. ఏ విధమైన క్రయ, విక్రయానంతర ఫిర్యాదులకేగాక కనీసం సేవలకు (రిపేర్లు వగైరా) కూడా అవకాశంలేదు. అందుచేత ఏదీ...ఉత్తమం...కాదు!!!

నిర్దుష్టంకాదు....నిర్దిష్టమూ లేదు!

ఈ సిరీస్ వాడకం మొదట్లోనే పేర్కొన్నట్లు 220 వోల్టేజి అని వుంటుంది. ఇండియన్ వోల్టేజి 230V. సరే అలాగే చూద్దామనుకున్నా నియాన్ సిరీస్-నిరంతరం వెలిగిస్తే 220 V. వెలుగుతూ, ఆరిపోతూ వుండేట్లు చేస్తే అది 230 ఎ. స్థానికరకం సిరీస్ నిరంతరం వెలిగేట్లు చేస్తేనే 230 V.. మిగిలిన రకాలు ఎలా చూసినా నాసిరకం గానే తేలాయి. విద్యుత్ వ్యయం విషయానికి వస్తే లెడ్ సిరీస్ కొంతలో కొంత నయమనిపిస్తున్నది. మొత్తం అన్ని సిరీస్‌ను రకానికి వంద బల్బుల వంతున తీసుకుని పరీక్షిస్తే నిరంతరం లేదా వెలుగుతూ, ఆరిపోతూ వుండటం-ఇలా పొజిషన్ ఏదైనా సరే అవి తీసుకునే విద్యుత్ వ్యయం నెలకు 35 రూపాయలు (లెడ్)నుంచి 3668 రూపాయల (డి.బల్బ్) వరకు వుంటున్నది. కనీస బిల్లును బల్బులు కాలేస్థితిని చూస్తే లెడ్ ఫర్వాలేదనిపిస్తుంది.

అయితే....అంతమాత్రాన పూర్తిగా 'లెడ్'పై ఆధారపడటమూ పొరపాటే అవుతుందంటున్నారు. ఎందుకంటే ఇదీ చైనా తయారీయేగనుక! మరమ్మత్తులు అవసరమైతే ఎవరూ చేయ(లే)రు. గడువు గ్యారంటీ అసలే వుండదు. ధర విషయమూ అంతే. నిర్దిష్టమేమీలేదు. "అమ్మేవాడు కొనేవాడి ముఖంచూసి పేర్కొనే ధర మాత్రమే చెల్లుబడి. బేరం చేయగల సత్తా మీకుండాలి మెత్తబడే లక్షణం విక్రేతకు కలగాలి అంతే!

భద్రతా చర్యలు

ఎట్టి పరిస్థితులలో "తేలికగా తీసిపెట్టగల (పుష్-ఇన్, పుష్-అవుట్ టైపు) నియాన్ సిరీస్‌ను మాత్రం ఇళ్ళలో అందునా పిల్లలకు అందుబాటులో వుండేట్లు అమర్చుకోవద్దు. వారు ఏ స్టూల్‌పైనో ఎక్కి ఈ బల్బులను పీకి నోట్లో పెట్టుకునే ప్రమాదం పొంచి వుంటుంది. రోప్ సిరీస్‌కు 'క్యాప్స్' వుంటాయి. ఇవి వాడుక ఎక్కువైనకొద్దీ వదులై నేలమీద పడిపోయే అవకాశం వుంది. చూసుకోకపోతే ఆ క్యాప్ లేనిచోట షాక్ కొట్టవచ్చు. ముందే చెప్పినట్లు ప్లగ్స్ మన సాకెట్స్‌కు సరిపోవు. మార్చుకోవాలి. కనుక కొత్తగా అమర్చుకున్న ప్లగ్ అయినా సాకెట్‌లో స్థిరంగా అమరిందీ లేనిదీ చూసుకోవాలి. లేకపోతే అదే సరఫరా లోటుపాట్లకు తద్వారా ప్రమాదాలకు దారితీయవచ్చు. 'నెట్' సిరీస్ విషయంలో మాడిపోయిన బల్బులను తక్షణం మార్చుకోవాలి. లేకపోతే మిగిలిన బల్బులు వేడెక్కిపోయి రిఫ్లెక్టర్లు కాలిపోతాయి.



మొక్కజొన్న గారెలు !

వెరైటీ వంటలు చేయాలనుకునేవారికీ, తినాలనుకునేవారికీ ఇది చక్కని వంటకం. మంచి పోషకాలు ఉన్న వంటకం కూడా. ఉదయం అల్పాహారంగా లేదా సాయంత్రం వేళ స్నాక్స్‌గా కూడా దీనిని తీసుకోవచ్చు. దీనిని తయారుచేయడమూ సులభమే. అంతగా శ్రమపడక్కర్లేదు. ఎక్కువ సమయమూ తీసుకోదు. మరి ఇంకెందుకు ఆలస్యం. మొక్కజొన్న గారెల తయారీకి వెంటనే సిద్ధం కండి!



కావలసిన పదార్థాలు

మొక్కజొన్న పొత్తులు ఐదు, కాప్సికస్ అరకేజీ, ఉల్లిపాయలు నాలుగు, పచ్చిమిర్చి ఐదు, అల్లం చిన్నముక్క, కరివేపాకు రెబ్బలు నాలుగు, ఉప్పు సరిపడ, నూనె తగినంత.

తయారీ విధానం

ముందుగా మొక్కజొన్నపొత్తులను ఒలిచి గింజలను తీసి ఒక గిన్నెలో వేసి ఉంచుకోవాలి. తరువాత ఉల్లిపాయలు, కాప్సికమ్ బాగా సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. మొక్కజొన్న గింజలను పచ్చివి మిక్సీలో వేసి ఉప్పు, పచ్చిమిర్చి, అల్లం ముక్కలు కూడా వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని మరీ మెత్తగా రుబ్బేయకూడదు. ఇందులో తరిగిన ఉల్లిపాయ ముక్కలు, కాప్సికమ్, కరివేపాకు వేసి కలుపుకోవాలి. పొయ్యి మీద వెడల్పాటి బాణలి పెట్టి నూనె పోసి కాగాక సిద్ధం చేసుకున్న మొక్కజొన్న మిశ్రమాన్ని గారెల్లాగా చేసి నూనెలో వేసి వేయించుకోవాలి. అంతే మొక్కజొన్న గారెలు లేదా వడలు రెడీ. వేడివేడిగా ఆరగిస్తే భలే మజాగా ఉంటాయి.

ఆలూ పాలక్!

ఇదీ ఆరోగ్యకరమైన వంటకాల జాబితాలోదే. ఆలూ ఉందని వెనకాడక్కర్లేదు. బంగాళాదుంపల్లోనూ మంచి పోషకాలు ఉంటాయి. ఇవి కూడా శరీరానికి అవసరమే. ఇది పోషకాహారమే కాదు రుచికరమైనది కూడా. అన్నం, పలావ్ లేదా చపాతి ఇలా ఎందులోకైనా సరిపోతుంది. గరం మసాలా కూడా వాడక్కర్లేదు. కాబట్టి శాకాహార ప్రియులు ఇష్టంగా లాగించేయవచ్చు. మరి దీని తయారీవిధానం తెలుసుకుందామా!



కావలసిన పదార్థాలు

రెండు పెద్ద బంగాళాదుంపలు, ఒకటిన్నర కప్పు పాలకూర, రెండు పచ్చిమిర్చి, చిటికెడు మిరియాల పొడి, పావు టీ స్పూన్ ఆవాలు, పావు టీ స్పూన్ జీలకర్ర, గుప్పెడు కరివేపాకులు, పావు టీ స్పూన్ అల్లం, వెల్లుల్లి పేస్ట్, ఒక టేబుల్ స్పూన్ తెల్ల నువ్వులు, చిటికెడు పసుపు, చిటికెడు ఇంగువ, ఉప్పు రుచికి సరిపడ, నూనె తగినంత

తయారీవిధానం

బంగాళాదుంపలు మరీ చిన్నవి కాకుండా, మరీ పెద్దవి కాకుండా మధ్యస్థంగా ఉండేలా ముక్కలు చేసి పదునుగా ఉడికించి పెట్టుకోవాలి. పొయ్యి మీద పాన్ పెట్టి ఆయిల్ వేసి కాగాక ఆవాలు, జీలకర్ర, కరివేపాకులు, పచ్చిమిర్చి వేసి వేయించండి. ఇవి వేగిన తర్వాత అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి నిముషం ఉంచండి. తర్వాత బంగాళాదుంప ముక్కలు, ఇంగువ, ఉప్పు, పసుపు వేసి వేగనివ్వండి. బంగాళాదుంపలు పూర్తిగా ఉడికేవరకూ పైన మూతపెట్టి ఉంచండి. అవసరమనుకుంటే కొంచెం నీళ్ళు పోయవచ్చు. ఇష్టమైనవాళ్ళు బంగాళాదుంపలు బాగా వేగేవరకూ ఉంచుకోవచ్చు. ఇవి వేగిన తర్వాత తరిగి ఉంచుకున్న పాలకూర వేసి బాగా ఉడకనివ్వాలి. ఆవిరి అంతా పోయి గుజ్జులా తయారయ్యేవరకూ కనీసం ఐదు నిముషాలు ఉంచాలి. చివరగా నువ్వులు, మిరియాల పొడి వేసి బాగా కలియతిప్పితే చాలు. ఆలూపాలక్ కూర రెడీ. ఇది అన్నంతో తినడానికి బాగుంటుంది. చపాతీలోనూ లాగించేయవచ్చు.



అతడు-ఆమె

69



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

తాజా : ఇలాగు అనుకుంటూనే వున్నా - పాపాయి పరుగెత్తు కుంటూ వచ్చి : "అమ్మా నీకీ వుత్తరం ఇమ్మని ఇచ్చాడే - హోటేలు బంట్రోతు" - అంటూ టెలిగ్రాం నాచేతికిచ్చింది. ఆ పచ్చని కవరు చూడగానే నా గుండెలో రాయి పడింది. తప్ప కుండా శాస్త్రి దగ్గర నుంచే అని అనుకున్నాను. "శ్రీమతి వి.శాంతా శాస్త్రి - మెడోస్ హోటేలు - శ్రీనగరం-" అని వుంది! నా చిరునామా శాస్త్రికి ఎలా తెలిసింది? నేను తెలియజెయ్యలేదే! తేనె వెన్నెల రోజులు అతనికింకా బాగా జ్ఞాపకం వున్నాయన్న మాట. అప్పుడు యీ హోటేల్లోనే దిగాం అన్నమాట మర్చి పోలేదు. నేనంటే ఎంత ప్రేమ!

టెలిగ్రాం విప్పడానికి భయం వేస్తూంది. పాపాయిని దగ్గరకి పిలిచి వళ్ళో కూర్చోబెట్టుకున్నా, కవరుచించి చదివేను. "మల్లేశ్వరం జమీను రైతుల తరపున ప్రీవీ కౌన్సిలుకు వకాల్తీ పుచ్చుకున్నాను. ఫీజుకాని ఖర్చులుకాని పుచ్చుకోవడం లేదు. పదిరోజుల్లో బొంబాయినుంచి లండనుకు బయలుదేరాలి. మన ముగ్గురికీ సుభకీ స్టీమరు టిక్కెట్లు కొన్నాను. మిగతా అన్ని ఏర్పాట్లూ చేశాను.

(నిన్నటి సంచిక తరువాయి)

బొంబాయిలో తాజమహలు హోటేల్లో బస. నీ ఖర్చుల కోసం హోటేలువారి పేర వెయ్యి రూపాయలు టెలిగ్రాం ద్వారా పంపించాను. వెంటనే బయలుదేరండి. విక్టోరియా టెర్మినస్‌లో శుక్రవారం ప్రొద్దున్న ఎనిమిది గంటల బండికి కలుసు కుంటాను. ప్రేమతో - శాస్త్రి."

..గంగా యమునా మళ్ళీ కలుసుకున్నాయని సంబరపడు తున్నాను. పాపాయిని గట్టిగా కౌగలించుకున్నాను. సుభను ముద్దుపెట్టుకున్నాను.

86 అతడు

కొచ్చర్లకోట రామస్వామి నిన్న ఆదివారం ప్రొద్దున్నే వచ్చాడు - నా దగ్గరకి మాట్లాడటానికని. శాంతంతో కలిసి అతనూ సుబ్బయ్యా దెబ్బలు తిన్నాక, ఇతన్ని రెండుమాట్లో మూడుమాట్లో చూశారు. ఈమధ్య రైతుసభలంటూ లేవదీసి రైతులని జమీందార్లమీద ఉసికొలుపుతున్నాడు. నెల్లాళ్ళ క్రిందట శాంతం దగ్గరకి వచ్చాడు. ఎందుకోమరి? ఏదో చందా వసూలు చేసుకోవడానికే!

వంటిమీద ఉత్తరీయం వేసుకోడు. చప్పి దవడలు -గోతుల్లాగు కళ్ళు-తుప్పల్లా కనుబొమ్మలు - మనిషి వుత్త దుంపరాష్ట్రం. అతన్ని చూస్తేనే నాకు భయం వేస్తుంది.

"శాస్త్రిగారూ : మీతో ముఖ్యమైన పనివుండి వచ్చా. మల్లేశ్వరం రైతుల కేసులో ప్రీవీ కౌన్సిలుకు అప్పీలు దాఖలు చేశాం. నెల్లాళ్ళలో విచారణ కొస్తుంది. పెద్దవాళ్ళనుకునే వాళ్ళందరి దగ్గరకి వెళ్ళేం. ఎన్నికల మూలాన్ని ఇప్పట్లో వారెవ్వరూ దేశాంతరం వెళ్ళడానికి ఇష్టపడదం లేదు- హోదాలు, పదవులూ పోతాయేమోనని. అంతేకాదు - బీద రైతు లంతా ఖర్చులు తప్ప ఫీజు ఇవ్వలేరని అని కూడాను లెండి!"

ఒక్క నిమిషం ఆగి నావైపు చూస్తూ "జమీందారీ కేసుల్లో మీరు ఘనులు. మీరు మా పక్షాన వకాల్తీ పుచ్చుకొని, లండను వెళ్ళాలి. శాంతంగారు వుంటే ఆమెచేత సిఫార్సు చేయించుదాం అనుకున్నాను. ఆమె లేకపోవడంచేత నేను ముఖస్తంగా మాట్లాడుదాం అని వచ్చా. నేను ఇంక చెప్పవలసిందేంలేదు. బీద రైతుల మీద అభిమానించి మాకు లోకోపకారం చెయ్యాలి. మీకు రాబడి వుండకపోయినా - ఆచంద్రతారార్కం కీర్తి వుండిపోతుంది. వేలాది ప్రాణులను కాపాడినవాళ్ళవుతారు. వందలాది రైతులూ - కంబర్లూ మిమ్మల్ని స్మరించుతారు. దస్తరం ఇక్కడే వదలి వెళు తున్నాను. బుధవారం మళ్ళీ మీదగ్గరకి వస్తా. ఆరోజున మీ నిశ్చయం చెప్పండి!" అంటూ వెళ్ళిపోయాడు.

..ఈ వేళప్పుడే మంగళవారం.

కాగితాలు చదివాను. శివరామకృష్ణయ్య హైకోర్టులో రైతుల వేపు వాదిస్తూ- జమీందార్లకి కంపెనీ తరపున శిస్తులు ఇజరా పాడుకుని వసూలు చేసుకోవడమే తప్ప, శిస్తులు పెంచే అధికారం వాళ్ళకి లేదు అన్నాడు. కాని ఆ వాదన సొంతంగా చేశాడుకాడు. సూచావాచాగా అంటే ఏం లాభం? నేనప్పుడే అనుకున్నా - ఇతను పప్పులో కాలువేశాడురా - అని. ఈ



విషయం మీదనే వాదనంతా పూర్తిగా ఆధారం చేసి - పెర్మ నెంటు సెటిల్మెంటు నాటి శిస్తులే ఖాయం - వీళ్ళ చిత్తం వచ్చి నట్టూ వాటిని హెచ్చించి వసూలు చేసుకోవడానికి కంపెనీ యిచ్చిన సనదులలో ఎక్కడా అధికారాలు లేవు - అని తిప్పికొట్టాలి.

గెలుపు తప్పదు. చరిత్రాత్మకం అయిన కేసు పోతుంది. దేశం అంతా గగ్గోలెత్తిపోతుంది. మీసం మీద నిమ్మకాయ ; బస్తీమే సవాల్ ; ప్రీవీకౌన్సిలు జడ్జీలు కూడా గుండె బాదుకోవాలె - శాస్త్రి అంటే!

...భయం వేస్తుందే; నేనింతవరకు ఎన్నడూ జమీందార్లకి వ్యతిరేకంగా దావాలు పట్టి ఎరగను. ఇంత ముఖ్యం అయిన దావా రైతుల పక్షం పట్టి గెలిపిస్తే - రేపటినుంచి జమీందారీ ఖాతా లన్నీ నాకు సున్నా అన్నమాట. ఇహ జరుగుబాటు ఎట్లా? అసలు నా ప్లీడరీ దుఖాణమే ఎత్తివేయాల్సొస్తుందేమో? ధనికు లందరూ నాకు శత్రువులైపోతే నా పనేంగాను?

... ఇంతటితో తీరిపోతుందా? ఈ తీర్పుతో శిస్తులు పడి పోతాయి - అసలు చెల్లించడమే ఎగగొడతారు రైతులు - జమీందారీ పద్ధతే రద్దు అయిపోతుంది. అటువంటప్పుడు అగ్ర హారాలు మాత్రం నిలుస్తాయా? అప్పుడు నా మాటేంగాను? కడుపులో చల్ల కదలకుండా కాలుమీద కాలు వేసుకుని - సాలీనా పదిహేనువేలు వొళ్ళో పడుతున్నాయి. భూమిశిస్తు పద్ధతే తల్లకిందులైపోతే - డబ్బు విలువే పోతుంది. ఇక మిగిలినది సోషలిజమే! నా వేలిలో నా కంటినే పొడుచుకుంటున్నానేం ఖర్మం...?

నాకేమైనామతిపోతుందా యేమిటి? అబ్బే, ఎంత సోషలిజమయినా - భూములు లాగు కుని డబ్బు ఇవ్వకుండా వుంటారా? ఏ ధర్మ శాస్త్రమూ - ఏ పద్ధతీ వొప్పుకోని పని ఎలా చేస్తారు? అంత అరాచకానికి బ్రిటిషువాళ్ళు వప్పుకోరు-గాంధీగారుఅంతకంటే వప్పుకోరు. అసలు రాజ్యమే లేదు - సోషలిజం ఎక్కడ? అసలు ఇదంతా జాగ్రత్తగా ఒక మెట్టు తరు వాత ఒక మెట్టు - వ్యూహాలు పన్ని- నడిపిం చుకుని రావాలి. హిట్లరులాంటివాడే తొందర పడకుండా - మీనమేషాలు లెక్కపెట్టి - పంచాంగం, జ్యోతిష్యం చూసుకొని మరీ వెళు తున్నాడు.

మనదేశానికి సోషలిజం అంటే కిట్టదు. నేను ఇంగ్లాండులో ఎకనామిక్సు చదువుకున్నా, నాకు కిడుతుందా? నాలాంటివాళ్ళే అందరున్నూ, మన పెద్ద వాళ్ళందరూ ఇంగ్లాండులో చదువుకున్నవాళ్ళే - ఇంగ్లీషు పద్ధతులకు వరవడి దిద్దేవాళ్ళే - అలాంటి వుపద్రవం రాకూడదు. అధవా వచ్చిందీ అంటే ఆ వుపద్రవం వచ్చేలోపుగానే ఆస్తులు పాస్తులు చక్కబెట్టుకోవచ్చు. నేను మరీ బెదురుగొడ్డునైపోతున్నానే :

దావా కాగితాలు చదివితే మాత్రం చాలా ఉత్సాహంగా వుంది. దావా గెల్పించి తీరాలనే పట్టుదల ఒకటి లోపలనుంచి పుట్టుకొస్తూంది. ఇది గెలిస్తే - రేపు పొద్దున్న స్వరాజ్యంవారే నన్ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వెళ్ళమని బలవంతం చేస్తారేమో కూడాను!

అదటుండగా, శాంతం చాలా సంతోషిస్తుంది. సంతోషించడమేమిటి? నన్ను కళ్ళకద్దుకుంటుంది. ఇదివరకు నన్నాడిన వెటకారాలు తల్చుకుని పశ్చాత్తాపపడుతుంది. ఆమెను సంతోషపెట్టడంకంటేను - ఆమె ప్రేమని నిలబెట్టుకోవడం కంటేను - నాకు పరమావధి యేమిటుంది? నిజంగా ఆమె ప్రేమకి పాత్రుడను కావాలంటే - నాకు స్వార్థం లేదు- బీద వాళ్ళంటే కనికరం వుంది- అని ఆమెను నమ్మించాలి.

ఫీజు ఇవ్వలేం అని రామస్వామి అన్నాడు మూతముప్పిడి లేకుండా. శాంతం వుంటే ఖర్చులు కూడా నన్నే భరించమని అని వుండును. ఖర్చులు భరించడం అంటే మాటలా. పదివేలన్న మాట: నేను ఎప్పుడేనా ఇంగ్లాండు వెళితే నిన్ను తప్పకుండా తీసుకువెళతాను అని అన్నా. ఇప్పుడు ఇద్దరం అల్లా ముగ్గురం అయాం-సుభతో నలుగురం! శాంతంతో ఖరారు తప్పకూడదు. అంతా లెక్కవేస్తే యూరపులో నాలుగు దేశాలూ తిరిగి రావాలంటే -అర్థ లకారం అనుకోవాలి.

అమ్మయ్యో! అయితేనేం - ఇది నా జీవితంలో క్రొత్త ప్రకరణం ఆరంభం! శాంతం మెచ్చుకుంటుంది! నిశ్చయం చేసుకున్నా - మరి ఇక వెనకతియ్యను.

...శాంతం పేర టెలిగ్రాం వెయ్యాలి. శ్రీనగరం వెళ్ళినట్లు నిన్ననే తంతి వేసింది. కాబట్టి ఇంకా అక్కడే ఉంటుంది. గృహనౌక యేదైనా ఒకటి అద్దెకు పుచ్చుకుని వుందో- లేకపోతే అప్పటి రోజుల్లోలాగు హోటేలులో వుందో! అప్పుడు మెడోస్ హోటెల్లో దిగాం. ఆ సంతోషమైన రోజులు జ్ఞాపకం తెచ్చుకుని తప్పకుండా అక్కడే బసచేస్తుంది. శాంతంది చాలా సున్నితమైన మనస్సు. ప్రేమ - అనురాగం - ఆమె మనసులో ఒకమాటు ప్రవేశించాయంటే - మరి అవి వేళ్ళతో పాతుకుని పోయాయన్న మాటే. ఆ హోటేలు చిరునామాకే టెలిగ్రాం వేస్తాను...

శాంతం! నీ మీదనే నా ఆశంతా పెట్టుకున్నాను- తప్పకుండా మనం బొంబాయిలో కలుసుకోవాలి సుమా!...

87 ఆమె

జమ్మూ... పఠాన్‌కోట్.. అమృతసరం.. ఇంకా మూడు రోజులు ప్రయాణం వుంది.

పాపాయి అడుగుతూంది సుభని : సుభక్కా మనం యెప్పుడూ యీ రైలులోనే వుండిపోతామేమిటి?"

సుభ జవాబు చెబుతూంది : అబ్బే యీ వేళల్లా అయిపోయాక - రేపల్లా అయిపోయాక యెల్లుండి పొద్దున్నే కాఫీ తాగేక - అప్పుడు నాన్న వస్తారూ- దిగిపోతాం!"... రైలు నడుస్తూంటే కనిపించిన వాళ్ళందరినీ చూసి "నాన్న - నాన్న!" అంటూ పాపాయి నవ్వుతూ చప్పట్లు కొడుతూంది!

తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది - జమీందార్లకు వ్యతి రేకంగా శాస్త్రి రైతుల పక్షం ప్రీవీ కౌన్సిలులో వ్యాజ్యం పట్టడం - దమ్మిడీ పుచ్చుకోకపోవడమే కాకుండా ఖర్చులు కూడా తనే భరించడం! ఇంత మార్పు అతనిలో యెల్లా వచ్చిందో - చిత్రం- పరకాయ ప్రవేశమా - ప్రాయోపవేశమా - వేదాంతమా? లేకపోతే నన్ను సంతోషపెట్టడానికా?

- ఇంకా వుంది.

రైల్వేలో భారీగా ఉద్యోగాలు..



దేశవ్యాప్తంగా వివిధ రైల్వే జోన్లలో 26,502 టెక్నికల్, అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలయింది. కొత్త సంవత్సరం ఆరంభంలోనే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నిరుద్యోగులకు అందించిన అద్భుతమైన అవకాశం ఇది! ఈ ఉద్యోగాలకు ఎంపికైతే.. పోస్టును బట్టి ప్రొడక్షన్ యూనిట్, వర్క్‌షాప్, జనరల్ సర్వీస్, క్యారేజ్ అండ్ వ్యాగన్, ప్రింటింగ్ ప్రెస్, డీజిల్ షెడ్, ట్రాక్ మెషిన్, టెలీకమ్యూనికేషన్ సిస్టమ్, సిగ్నల్ సిస్టమ్ వంటి వివిధ డిపార్ట్‌మెంట్లలో ఆపరేటర్, ఫిట్టర్, డ్రైవర్, పెయింటర్ పోస్టులతోపాటు అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. నెల జీతం రూ.35,000 నుంచి రూ.40,000 వరకు వస్తుంది.

ఎవరు అర్హులు?

- పదోతరగతి తర్వాత ఐటీఐ పూర్తి చేసినవారు, 3 సంవత్సరాల డిప్లొమా పూర్తి చేసినవారు
- పాలిటెక్నిక్ పూర్తిచేసిన తర్వాత 3 సంవత్సరాల ఇంజినీరింగ్ పూర్తి చేసినవారు
- మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్ పూర్తిచేసినవారు
- చివరి సంవత్సరం చదువుతున్నవారు ఈ పోస్టులకు అనర్హులు.

వయో పరిమితులు : జనరల్ కేటగిరీవారు 18-28 సంవత్సరాల మధ్య వారై ఉండాలి. 01-07-2018తో సరిచూసుకొని అభ్యర్థుల వయసు నిర్ణయిస్తారు. రిజర్వేషన్ కేటగిరీలకు మినహాయింపు ఉంటుంది.

ముఖ్యమైన తేదీలు : ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేయడానికి చివరి తేదీ : 05-03-2018.

ప్రథమ కంప్యూటర్ ఆధారిత పరీక్ష : ఏప్రిల్, మే నెలల్లో ఉంటుంది.

అభ్యర్థులు ఏ రైల్వే జోన్‌కు దరఖాస్తు చేయాలో నిర్ణయించుకుని, ఆయా రైల్వే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తిచేసి, ఫీజు చెల్లించాలి. ఏదైనా ఒక రైల్వే జోన్‌కు మాత్రమే దరఖాస్తు చేయాలి. ఒక అభ్యర్థి ఒక దరఖాస్తును మాత్రమే పూర్తి చేయాలి.

ఎంపిక ప్రక్రియ : అసిస్టెంట్ లోకో పైలట్ (ఏఎల్‌పీ), టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తు చేసినవారు మొదట కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) రాయాల్సి ఉంటుంది. ఇందులో క్వాలిఫై అయినవారికి రెండో కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహిస్తారు. మొదటి పరీక్షలోని మార్కులు క్వాలిఫయింగ్ మార్కులు మాత్రమే. రెండో పరీక్షలోని మార్కుల ఆధారంగా టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేస్తారు.

ఏఎల్‌పీ పోస్టుకు దరఖాస్తు చేసినవారికి రెండో సీబీటీ తర్వాత కంప్యూటర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. రెండో సీబీటీలో వచ్చిన మార్కుల్లో 70 శాతం, కంప్యూటర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో వచ్చిన వాటిల్లో 30 శాతం మార్కుల ఆధారంగా మెరిట్ లిస్ట్ తయారు చేస్తారు.

పరీక్ష జరగడానికి 3 నెలల సమయం ఉంది. రోజువారీ వీలైనంత ఎక్కువ సమయం సన్నద్ధత కోసం వెచ్చించటం సముచితం. ఎక్కువ ప్రశ్నలను సాధన చేస్తూ ఆత్మవిశ్వాసంతో ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చు!

కంప్యూటర్ ఆధారిత పరీక్ష (ఏఎల్‌పీ/ టెక్నీషియన్)

అర్థమెటిక్, మ్యాథమేటిక్స్, జనరల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్ అంశాల నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు. 60 నిమిషాల వ్యవధిలో పూర్తిచేయాలి. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు తప్పు సమాధానానికి 1/3 మైనస్ మార్కులున్నాయి.

జనరల్ కేటగిరీవారు 40శాతం, ఓబీసీ, ఎస్సీవారు 30 శాతం, ఎస్‌టీ వారు 25 శాతం కనీస అర్హత మార్కులు పొందాలి.

రెండో సీబీటీ : (ఏఎల్‌పీ/ టెక్నీషియన్)

మొదటి సీబీటీలో క్వాలిఫై అయిన వారిలో, పోస్టుల ఆధారంగా 15 రెట్ల మంది అభ్యర్థులను రెండో సీబీటీకి అర్హులుగా నిర్ణయిస్తారు. పార్ట్- ఎ, పార్ట్- బి పరీక్షలుంటాయి. రెండు పరీక్షలను 2.30 గంటల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

పార్ట్- ఎ : మ్యాథమెటిక్స్, అర్థమెటిక్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ అవేర్‌నెస్, బేసిక్ సైన్స్, ఇంజినీరింగ్ (టెక్నికల్) సబ్జెక్టుల నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. 90 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాలి.

పార్ట్- బి : డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రెనింగ్ వారు నిర్ణయించిన ట్రేడ్ సిలబస్ ఆధారంగా 75 ప్రశ్నలు ఇస్తారు. 60 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాలి. ఇందులో 35శాతం అర్హత మార్కులు సాధిస్తే చాలు. మొత్తం మెరిట్ మార్కుల్లో పార్ట్- బిని పరిగణించరు.

కంప్యూటర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏఎల్‌పీ పోస్టులకు మాత్రమే)

రెండో సీబీటీలో క్వాలిఫై అయినవారిలో పోస్టుల సంఖ్య ఆధారంగా 8 రెట్ల మందికి కంప్యూటర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతీ టెస్ట్ బ్యాటరీలో 42 మార్కులు రావాలి. ఈ పరీక్ష సైకాలజీ టెస్ట్ లాంటిది.

ప్రిపరేషన్‌కు సూచనలు

టెక్నిషియన్ పోస్టులకు రెండు అంచెల్లో, ఏఎల్‌పీ పోస్టుకు మూడు అంచెల్లో జరుగుతున్న పరీక్షలో మొదటిది సీబీటీ (కంప్యూటర్ బేస్‌డ్ టెస్ట్) క్వాలిఫయింగ్ పరీక్ష మాత్రమే. రెండో సీబీటీలోని పార్ట్-ఎ, కంప్యూటర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ మార్కుల ఆధారంగా మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రెండో సీబీటీలోని పార్ట్-బి కూడా క్వాలిఫయింగ్ మాత్రమే.

అభ్యర్థులు మేథమేటిక్స్, అర్థమెటిక్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్ సబ్జెక్టులు మొదటి సీబీటీ, రెండో సీబీటీ పరీక్షల్లో వస్తున్నాయి. కాబట్టి వీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపితే మొదటి సీబీటీలో క్వాలిఫై అవడంతోపాటు రెండో సీబీటీలో ఎక్కువ మార్కులు పొందవచ్చు.

టెక్నికల్ సబ్జెక్టు అయిన బేసిక్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రెండో సీబీటీలో పార్ట్-ఎలో ఉంటుంది. అభ్యర్థులు వారు పూర్తిచేసిన కోర్సుల్లోని సబ్జెక్టులే కాబట్టి, పునశ్చరణ చేస్తే సరిపోతుంది.



- **అర్థమెటిక్ :** సింప్లిఫికేషన్‌లో బాడ్‌మాస్, పెడ్‌మాస్ రూల్స్ వినియో గించే విధానం, నంబర్ సిస్టమ్స్, శాతాలు, రేషియో-ప్రపోర్షన్, లాభ నష్టాలు, కాలం-పని, కాలం-దూరం, చక్రవడ్డీ, బారువడ్డీ, ఎల్‌సీఎం, హెచ్‌ఎస్‌ఎఫ్, భాగస్వామ్యం, పైప్స్-సిస్టన్స్, క్యాలెండర్, గడియారాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

డేటా అనాలిసిస్, డేటా సఫిషియన్సీ ప్రశ్నలకు సమాధానాలను గుర్తించ డం సాధన చేయాలి. సింప్లిఫికేషన్ తక్కువ సమయంలో పూర్తిచేయడం తెలిసుండాలి. శాతాలను ఆధారంగా తీసుకుని లాభనష్టాలు, చక్రవడ్డీ, బారువడ్డీ, నిష్పత్తి-అనుపాతం ప్రశ్నలను సాధన చేయాలి. ఇవన్నీ ఒకే కోణానికి చెందిన అంశాలు. లాజిక్ ఒకేవిధంగా ఉంటూ ప్రశ్నలో ఉపయోగించే భాష మాత్రమే వేరుగా ఉంటుంది. ఇలా సాధన చేస్తే సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.

- **మేథమేటిక్స్ :** త్రికోణమితి, ఎత్తు-దూరం, ఆల్జీబ్రా, జామెట్రీలో ప్లేన్ జామెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీ, ఎలిమెంట్రీ స్టాటిస్టిక్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి. వీటికి సంబంధించిన ఫార్ములాలన్నింటినీ ఒక దగ్గర రాసుకుని వాటిని ఎలా ఉపయోగించాలో సాధన చేయాలి. షార్ట్‌కట్స్ ఉపయోగించి తక్కువ సమయంలో సమాధానాలను గుర్తించడం అలవాటు చేసుకోవాలి.
- **జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్ :** లాజికల్ రీజనింగ్ అంశాలైన నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, ఆడ్‌మాన్ అవుట్ నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నలో ఉన్న సమాచారాన్ని లింక్ చేస్తూ లాజిక్‌ను కనిపెట్టాలి. వెన్ చిత్రాలు, సిమిలారిటీస్, డిఫరెన్సెస్ వంటి క్లరికల్ ఆప్టిట్యూడ్ అంశాలు, రిలేషన్‌షిప్, మేథమేటికల్ ఆపరేషన్స్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

ఇంగ్లీష్ భాషపై పట్టు సాధిస్తే క్రిటికల్ రీజనింగ్‌లోని ప్రశ్నలు సులువుగా చేయవచ్చు. సమాధానం గుర్తించకపోతే వెంటనే లాజిక్ మార్చి ప్రశ్నను పూర్తిచేయడం అలవాటు చేసుకోవాలి.

- **జనరల్ సైన్స్ :** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ అంశాలు పదో తరగతి స్థాయిలో ఉంటాయి.
- **జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్ :** సమాజంలో చుట్టూ జరుగు తున్న శాస్త్రీయ, సాంకేతిక, భౌగోళిక, ఆర్థికవ్యవస్థలపై అవగాహన కలిగివుండాలి. జాతీయ, అంతర్జాతీయ అంశాలు, వార్తల్లోని వ్యక్తులు, దేశాలు-రాజధానులు, కరెన్సీ, ఇటీవలి అంతర్జాతీయ సమావేశాలు మొదలైనవి ముఖ్యం.
- **బేసిక్ సైన్స్, ఇంజినీరింగ్ :** టెక్నికల్ సబ్జెక్టులో ఉండే అంశాల నుంచి సాధారణ ప్రశ్నలు వస్తాయి. బేసిక్ ఎలక్ట్రిసిటీ, యూనిట్ మెజ ర్‌మెంట్స్, సర్క్యూట్స్, స్పీడ్-వెలాసిటీ, హీట్-టెంపరేచర్, మెషిన్స్, లివర్, సేఫ్టీ-హెల్త్, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్, యూనిట్స్, మాస్ వెయిట్-డెన్సిటీ. ఇంజినీరింగ్ డ్రాయింగ్స్‌లోని ప్రొజెక్షన్స్, డ్రాయింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, జామెట్రిక్ ఫిగర్స్, సింబాలిక్ రెప్రజెంటేషన్స్ అంశాల్లోని సాధారణ ప్రశ్నలు వస్తాయి. అభ్యర్థులు వారు చదువుతున్న పుస్తకాల్లోని ఈ అంశాలకు రివిజన్ పూర్తిచేసి ఆబ్జెక్టివ్ విధానాల్లో అడగటానికి అవకాశం ఉన్న ప్రశ్నలు గుర్తించి వాటికి ప్రిపేర్ కావాలి.



ప్రముఖ సంస్థల్లో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యకు ఉమ్మడి పరీక్ష

ఇంజినీరింగ్ కోసం ఐఐటీలు, మేనేజ్‌మెంట్ విద్యకు ఐఐఎంలు, ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులకు నిఫ్ట్‌లు పేరొందిన సంస్థలని చాలా మందికి తెలుసు. మరి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు చదవాలంటే? ఈ ప్రశ్నకు సమాధానమే ఐహెచ్‌ఎంలు. ఐఐటీలు, ఐఐఎంల మాదిరిగా ఆతిథ్య రంగంలో ఉత్తమ విద్యాబోధన కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం)లు దేశవ్యాప్తంగా వెలిశాయి. ఇవి కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తు న్నాయి. ఈ సంస్థలను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్‌ఎంసీటీ) పర్యవేక్షిస్తుంది. వీటిలో మూడేళ్ల వ్యవధితో బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చదువుకోవచ్చు. ఉమ్మడి పరీక్ష ద్వారా 58 ఐహెచ్‌ఎంల్లో ప్రవేశం లభిస్తుంది. వీటిలో 21 జాతీయ సంస్థ(ఐహెచ్‌ఎం)లు, 22 రాష్ట్రీయ, 14 ప్రైవేట్ సంస్థలు, ఒక పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ సంస్థ ఉన్నాయి. ప్రవేశం కల్పిస్తున్న సంస్థల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం), హైదరాబాద్ ఒకటి. అలాగే రాష్ట్రీయ సంస్థ అయిన వైఎస్‌ఆర్ నిథమ్- హైదరాబాద్ లోనూ ఈ పరీక్ష ద్వారా ప్రవేశం పొందవచ్చు. ప్రవేశం లభిస్తుంది. ఈ పరీక్ష ప్రకటన వెలువడింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పరీక్ష విధానం..

200 ప్రశ్నలు ఉంటాయి. వ్యవధి 3 గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. న్యూమరికల్ ఎబిలిటీ అండ్ ఎనలిటికల్ ఆప్టిట్యూడ్ 30, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్ 30, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ 30, ఇంగ్లిష్ 60, ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ నుంచి 50 ప్రశ్నలొస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు చొప్పున తగ్గిస్తారు. ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ విభాగంలో ప్రశ్నలకు సమాధానం పూర్తిగా సరైనది అయితే ఒక మార్కు చాలా వరకు సరైనది అయితే ముప్పావు మార్కు, సగం సరైనది అయితే అర మార్కు చొప్పున కేటాయిస్తారు. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు.

కోర్సులు...కరిక్యులమ్...

ఆతిథ్య రంగంలోకి అడుగెట్టాలంటే హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తిచేయడం తప్పని సరి. ఈ కోర్సులు సాధారణంగా పదో తరగతి తర్వాత ప్రారంభమవుతాయి. అయితే ఇంటర్ పూర్తిచేసుకుని మూడేళ్ల డిగ్రీ కోర్సు చేసినవారికి ఈ రంగంపై పూర్తిస్థాయి అవగాహన కలుగు తుంది. దీంతోపాటు అవకాశాలూ ఎక్కువగా లభిస్తాయి. మూడేళ్ల కోర్సులో మొదటి ఏడాది ఆతిథ్య రంగంలోని అన్ని అంశాలపై అవగాహన కల్గిస్తారు. హౌస్ కీపింగ్, ఫ్రంట్ ఆఫీస్, ఫుడ్ అండ్ బేవరేజెస్, ప్రొడక్షన్/ సర్వీసెస్ తదితర విభాగాల్లో ప్రాథమికాంశాలపై పరిజ్ఞానం కల్పిస్తారు. ఇవేకాకుండా వివిధ కొలతలు (టీ స్పూన్, టేబుల్ స్పూన్), ఏవి ఎంత మొత్తంలో వాడాలి, డైనింగ్ టేబుల్ ఎటికెట్స్, అతిథితో ఎలా వ్యవహరించాలి...ఇలా ప్రతి అంశం గురించి సూక్ష్మస్థాయితో మొదలు పెట్టి, పూర్తిగా అవగాహన కల్పిస్తారు. కోర్సు రెండో సంవత్సరంలో క్షేత్రస్థాయిలో శిక్షణ ఉంటుంది. అంటే విద్యార్థులు పనిచేస్తూ నేర్చుకుంటారు (లెర్నింగ్ బై డూయింగ్). దీనికోసం ఏదైనా హోటల్ లేదా క్యాటరింగ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని తర్ఫీదు అందిస్తారు. మూడో సంవత్సరంలో ఫైనాన్స్, బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ అంశాల గురించి చదువుకుంటారు. హొటల్ అకౌంటెన్సీ, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్, ఫెసిలిటీ ప్లానింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, టూరిజం మార్కెటింగ్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ అంశాలనూ పూర్తిస్థాయిలో బోధిస్తారు.



అవకాశాల వెల్లువ...

పర్యాటక రంగం బాగా విస్తరిస్తోంది. అలాగే రుచి, వెరైటీ రెండింటికీ ప్రాధాన్యం పెరిగింది. ఎక్కువ మంది బయట తినడానికి ఆసక్తి చూపు తున్నారు. ఖర్చుకి వెనుకాడడం లేదు. వీటన్నింటి కారణంగా ఆతిథ్యంలో అవకాశాలు విస్తృతమ య్యాయి. ఈ పరీక్ష ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలకు ఢోకాలేదనే చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఈ సంస్థలన్నీ జాతీయ స్థాయిలో పేరున్నవే. కోర్సును విజయ వంతంగా పూర్తిచేసు కున్నవాళ్లు మేనేజ్‌మెంట్ ట్రెయినీ హోదాతో హోటళ్లు, రిసార్ట్‌ల్లో కెరీర్ ప్రారంభించొచ్చు. ఆసక్తి, ప్రావీణ్యాన్ని బట్టి కిచెన్ మేనేజ్‌మెంట్, హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్, ఫ్లైట్ కిచెన్స్/ ఆన్ బోర్డ్ ఫ్లైట్ సర్వీసెస్, వివిధ సేవా పరిశ్రమల్లో గెస్ట్/ కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్, ఫాస్ట్‌ఫుడ్ చెయిన్స్‌లో ఎగ్జిక్యూటివ్, క్యాటరింగ్ సంస్థలు, షిప్పుల్లో సప్లై, కిచెన్ సెక్షన్ ఉద్యోగాలు; పర్యా టక సంస్థలు, కేంద్రాల్లో వివిధ రకాల సేవలు, బహుళజాతి కంపెనీల క్యాంటీన్లు, హౌస్ కీపింగ్ నిర్వహణ, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశా లల్లో ఫ్యాకల్టీ, సొంతంగా ఫుడ్ చెయిన్ ప్రారం భించ డం... తదితర అవకాశాలు దక్కు తాయి. చాలా సంస్థల్లో క్యాంపస్ నియామకాలు జరుగు తున్నా యి. ఆతిథ్య, సేవారంగాలకు చెందిన సంస్థలు/ కంపెనీల్లో హోటల్ మేనేజ్ మెంట్ విద్యార్థులకు అవకాశాలు లభిస్తున్నాయి. ఐహెచ్ ఎంల్లో కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థుల్లో దాదాపు 90 శాతం మంది ఆన్ క్యాంపస్, ఆఫ్ క్యాంపస్ ద్వారా ఆఫర్ లెటర్లు అందుకుం టున్నారు.

ముఖ్య సమాచారం

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత. ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా చదివుండాలి. (ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు)

వయసు : జులై 1, 2018 నాటికి 22 ఏళ్లకు మించకూడదు. అంటే జులై 1, 1996 తర్వాత జన్మించినవాళ్లు అర్హులు. ఎస్సీ, ఎస్టీలైతే 25 ఏళ్ళు. ఈ విభాగాలకు చెందినవాళ్లు జులై 1, 1993 తర్వాత జన్మించినవాళ్లు అర్హులు.

ఎంపిక : ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది : 11.04.2018

పరీక్ష తేది : 28.04.2018 (శనివారం). ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1.00 వరకు తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం హైదరాబాద్ లోనే ఉంది.

ఫలితాలు : మే మూడోవారంలో ప్రకటిస్తారు.

వెబ్‌సైట్: https://applyadmission.net/nchmjee2018

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-407.40 ▼	-121.90 ▼	300 ▲	28,740	-1000 ▲	42,600	
34,005.76	10,576.85	28,850	ప్రొద్దుటూరు 28,610	39,900	ప్రొద్దుటూరు 39,100	64.40
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టాటా స్టీల్	683.65	1.83
రెడ్డీ ల్యాబ్స్	2,194.80	0.73
ఏషియన్ పెయింట్స్	1,131.55	0.67
హెచ్‌యుఎల్	1,343.95	0.23
టీసీఎస్	2,991.75	0.20

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)


కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎస్ బ్యాంక్	325.55	-2.84
ఐసీఐసీఐ బ్యాంక్	326.75	-2.33
హెచ్‌డీఎఫ్‌సీ	1,773.20	-2.13
ఇన్ఫోసిస్	1,124.90	-2.01
యాక్సిస్ బ్యాంక్	579.00	-1.93

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.26	64.40
యూరో	78.49	78.79
పౌండ్	89.83	88.81
ఆస్ట్రేలియా డాలర్	50.08	50.16
సింగపూర్ డాలర్	48.29	48.39

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,740	30,737
చెన్నై	28,660	30,652
బెంగళూరు	28,200	30,160
ముంబై	29,590	31,647
విజయవాడ	28,850	31,080
విశాఖపట్నం	28,740	30,327
ప్రొద్దుటూరు	28,610	31,000
ముడి చమురు		64.81



పుంజుకున్న బంగారం

ముంబై: వరుసగా రెండురోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం ధరకు బ్రేక్ పడింది. శుక్రవారం బంగారం ధర దేశీయ మార్కెట్‌లో ఒక్కసారిగా రూ.220లు పెరిగి 10గ్రాములు రూ.31,170లు పలికింది. వెండి కూడా రూ.330లుపెరిగి కేజీ వెండి ధర రూ.39,230లకు చేరింది. పెండ్లిళ్ల సీజన్ కావడంతో బంగారానికి డిమాండ్ పెరిగిందని బులియన్ వర్తకులు వెల్లడించారు. అంతర్జాతీయంగా బంగారం ధర 0.02 శాతంపెరిగి ఔన్స్ 1318.30 డాలర్లకు చేరింది. వెండి ధర 0.31శాతం పెరిగి 16.39 డాలర్లకు చేరింది. గత రెండ సెషన్లలో బంగారం రూ.650 లు నష్టపోయింది. దేశ రాజధానిలో బంగారం 99.9 మరియు 99.5శాతం స్వచ్ఛమైన బంగార ధర రూ.31,170లు మరియు రూ.31,020 పలికింది.

13పైసల నష్టంలో రూపాయి



ముంబై: డాలర్‌తో రూపాయి మారకపు విలువ శుక్రవారం 13పైసల నష్టంలో ముగిసింది. బ్యాంకులు, దిగుమతి దారుల నుండి అమెరికా డాలర్ డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ 13పైసల నష్టంతో 64.39 వద్ద నిలిచింది. దేశీయ ఈక్విటీ మార్కెట్‌లోని నష్టాలు, విదేశీ నిధుల లాభాలు పెరగ డం రూపాయిపై ప్రభావం చూపింది. యెన్ 108.56 నాలుగు వారాల కనిష్టానికి పడిపోయింది. ఇప్పటివరకు 1.3 శాతం నష్టపోయింది. గురువారం 2పైసలు పెరిగి 64.26 వద్ద ముగిసి ఈక్విటీ మార్కెట్‌లో కొద్దిగా పుంజుకుంది. విదేశీ మదుపరులు రూ.2297 కోట్ల షేర్లును అమ్మినట్లు తెలుస్తోంది.

మార్చి 31లోపు ఐటీఆర్‌లు దాఖలు చేయవలసిందే: ఐటి శాఖ

న్యూఢిల్లీ: పెద్దనోట్లరద్దు అనంతరం డిపాజిట్ చేసిన నగదుపై మార్చి 31లోపు ఐటీఆర్ దాఖలు చేయవలసిందిగా ఆదాయ పుపన్ను శాఖ ఆదేశాలు జారీ చేసింది. . డీమానిటైజేషన్ అనంతరం పెద్దమొత్తాల్లో నిధులు జమచేసిన ఖాతాదారులతోపాటు కంపెనీలు పెండింగ్‌లో ఉన్న రిటర్నులు ఇదే తుది ఆదేశంగా ఆదాయపుపన్నుశాఖ సమర్పించవలసిందిగా లేని ఎడల పెనాల్టీ, ప్రాసిక్యూషన్ సమస్యలు ఎదురుకావచ్చునని తెలపింది. ఈ తుది గడువులోగా ఆదాయపు పన్ను రాబడిని దాఖలుచేసేందుకు అర్హతకల ట్రస్టులు, రాజకీయ పార్టీలు, సంబంధిత సంఘాలు కూడా చివరి నిమిషంవరకు వేచి చూడకుండా దాఖలుచేయవలసిందిగా కోరింది. కంపెనీలు, ఫర్మ్‌లు, పార్ట్‌నర్‌షిప్‌లకు కూడా ఈ నిబంధన వర్తిసుందని తెలిపింది. ఫైలింగ్ చేయకపోయినా సంబంధిత జరిమానా విధించడమవుతుందని స్పష్టంచేసింది.

'లారీ' సమస్యలపై స్వారీ

- ఏటేటా పెరుగుతున్న సంక్షోభం
- బెంబేలెత్తిస్తున్న ఇన్సూరెన్స్, ట్యాక్స్‌లు, టోల్ రేట్లు
- సెక్షన్ 44 ఆదాయ చట్ట సవరణ బిల్లుతో మరింత భారం
- డ్రైవర్లు, క్లీనర్ల కొరతతో తీవ్ర ఇక్కట్లు



విశాలాంధ్రబ్యూరో-అమరావతి: ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాదిమందికి జీవనోపాధి కల్పించే లారీ పరిశ్రమ మున్నెన్నడూలేనంత తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. పన్నుల రూపేణా ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చిపెడుతున్న ఈరంగం పట్ల పాలకులు చిన్నచూపు చూస్తున్నారు. ఫలితంగా ఈ రంగం శతకోటి సమస్యలతో సతమతమవుతోంది. వ్యవసాయరంగం తరహాలో ఇది కూడా అసంఘటిత రంగం కావడంతో లారీ యజమానుల గోడు చెవిటివాడి ముందు శంఖం ఊదిన చందంగా మారింది. ఏటేటా పెరుగుతున్న ఇన్స్యూరెన్స్‌లు ప్రీమియంలు, రోడ్ ట్యాక్స్‌లు, టోల్ రేట్ల కనుగుణంగా కిరాయి ధరలు పెరగక పోవడంతో లారీ ఉనికే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి తలెత్తుతోంది. దీనికితోడు లారీ వల్ల లాభమో, నష్టమో తర్వాత సంగతి. ముందు లారీ రోడ్డెక్కాలంటే డ్రైవరు, క్లీనరు అవసరం.కాని పెరుగుతున్న వాహనాల సంఖ్యకనుగుణంగా డ్రైవర్లు లభ్యం కావడం లేదు. వీరి కొరత పరిశ్రమను తీవ్రంగా వేధిస్తోంది. అరకొర వేతనాలు, విధి నిర్వహణలో ఇబ్బందులతోపాటు మరో ప్రక్క విద్యారంగానికి పెరిగిన ప్రాముఖ్యత నేపథ్యంలో నూటికి 99 శాతం ఏ లారీ డ్రైవరూ తన కుమారుడ్ని డ్రైవర్‌గా చేయ దానికి ఇష్టపడడం లేదు. ఇక డ్రైవింగ్ పట్ల ఆసక్తి కల్గిన కొద్దిపాటి యువత ఏసీ సౌకర్యమున్న లగ్జరీ వాహనాల పట్ల ఆకర్షితులవుతున్నారు. మరి కొందరు బ్యాంకులు, ప్రభుత్వ కార్పోరేషన్లు అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని సొంత ఆటోలు, ట్యాక్సీలు కొనుక్కొని నడుపుకుంటున్నారు. దీంతో లారీలకు డ్రైవర్లు, క్లీనర్లు దొరక్క అనేకమంది యజమానులు తమ వాహనాలను తెగనమ్ముకునే పరిస్థితి ఏర్పడుతోంది.

డ్రైవర్లుగా మారుతున్న ఓనర్లు : గతంలో లారీ యజమాని అంటే గొప్పగా వుండేది. ఇక మూడు, నాలుగు లారీలుంటే గ్రామంలో పెద్ద మోతుబరి కింద లెక్క. ఇప్పుడు అటువంటి వారంతా దాదాపు దివాళా తీశారు. డ్రైవర్‌గా పనిచేసే యజమానులు మాత్రమే ఈరంగంలో మిగిలారు. ఇటువంటివారంతా ఎక్కువ వాహనాలున్నప్పటికీ వాటిని తెగనమ్ముకొని ఒక్క వాహనాన్ని మాత్రమే వుంచుకొని డ్రైవర్లుగా కొనసాగుతున్నారు. ఇతర పనులు చేయలేక, అవకాశాల్లేక లారీనే నమ్ముకొని బతుకుతున్నారు. అయితే మార్కెట్లో అవసరానికి మించిన కొత్త లారీలు రావడం, ఈరంగానికి సంబంధం లేనివారు ప్రవేశించి దీనిని వ్యాపారంగా మార్చడం, మరోప్రక్క మినీ ఆటోల సంఖ్య పెరగడం వంటి కారణాలతో మొదటినుండి లారీ పరిశ్రమను నమ్ముకొని జీవిస్తున్నవారు ఇబ్బందిపడుతున్నారు.

జీరో ఫైనాన్స్ ఎఫెక్ట్ : కొత్తలారీలకు ఫైనాన్స్ కంపెనీలు పోటీపడి జీరో ఫైనాన్స్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. కంపెనీ నమ్మదగ్గ సాక్ష్యం సంతకం పెట్టించగల్గితే చాలు. ఒక్క రూపాయి కూడా చెల్లించే పని లేకుండా ఎన్ని కొత్త లారీలకైనా ఫైనాన్స్ మంజూరవుతోంది. దీనికితోడు బాడీ నిర్మాణం కోసం మరో రూ.5లక్షల నగదు అదనంగా ఇస్తున్నారు. వీటిలో రవాణా పన్నులు, ఇన్స్యూరెన్స్, బాడీ ఖర్చులన్నీ పోను సుమారు 2 లక్షలు ఓనర్‌కి మిగులుతున్నాయి. దీంతో ఇతర రంగాలకు చెందిన కాంట్రాక్టర్లు, బడా వ్యాపా రులు ఆకర్షితులై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పెద్దమొత్తంలో లారీలు కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా మార్కెట్ అవసరాలకు మించి లారీల సంఖ్య పెరుగుతోంది. వీరివల్ల లారీ తిరిగితేనే జీవనం గడిచే అసలైన యజమానులు నెలవారీ ఖర్చులు రాక తీవ్ర ఆర్థిక ఇక్కట్లకు లోనవుతున్నారు.

ఈ ఖర్చు తప్పనిసరి : కిరాయిలున్నా, లేకున్నా, లారీ తిరిగినా తిరగకపోయినా ఏడాదిలో ప్రతి లారీకి నెలకు సుమారు లక్ష ఖర్చవుతుంది. దీనికి మించి ఆదాయమొస్తేనే జీవన ఖర్చులకు ఇబ్బంది వుండదు. లేనిపక్షంలో అప్పులపాలు కావ ల్సిందే. ఉదాహరణకు 10 టైర్ల లారీకి ప్రతి ఏటా సుమారు రూ.12లక్షలు ఖర్చు తప్పనిసరి. అంటే నెలకు కనీసం లక్ష 25వేలు ఆదాయమొస్తేనే ఇవన్నీ సకాలంలో చెల్లింపులు చేయడంతోపాటు, తన కుటుంబాన్ని పోషించుకోగల్గుతాడు. అదీ లారీ ప్రమాదానికి గురికా కుండా సక్రమంగా నడిస్తే. దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగితే మాత్రం కోలుకోవడం అంత సులభం కాదు.

భారం కానున్న సెక్షన్ 44 ఏఈ సవరణ బిల్లు : మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా కేంద్ర ప్రభుత్వం ఈఏడాది ఫైనాన్స్ బిల్లులో సెక్షన్ 44 ఇన్‌కంటాక్స్ యాక్ట్‌ను మార్పులు చేస్తూ బిల్లు ప్రతిపాదించింది. దీని ప్రకారం 10 టైర్ల లారీలు 10వుంటే ఆదాయంతో నిమిత్తం లేకుండా సంవత్సరానికి రూ.8,25,000 ఆదాయ పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఇక 14 టైర్ల లారీకైతే రూ.15లక్షలు, ట్రైలర్‌కైతే రూ.20 లక్షలు చెల్లించాలి. ఇప్పటివరకు 3లారీల కంటే ఎక్కువ వున్న యజమానులు ఏడాదికి రూ.90వేల చొప్పున ఆదాయాన్ని లెక్కించి మాత్రమే ఐటీ చెల్లించేవారు.

10 టైర్ల లారీకి ఏటా విధిగా అయ్యే ఖర్చు

క్వార్టర్లీ రోడ్‌టాక్సులు 4సార్లు	-రూ.16,000
ఇన్స్యూరెన్స్ ప్రీమియం	-రూ.40,000
నేషనల్ పర్మిట్	-రూ.20,000
ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్లకు జీతాలు	-రూ.6,00,000
10టైర్లుకి..	-రూ.1,60,000
ఇంజిన్ ఆయిల్	-రూ.40,000
వీల్ గ్రీజ్	-రూ.20,000
సాధారణమరమ్మత్తులకు	-రూ.1,00,000
ఫైనాన్స్ కంపెనీలకు వడ్డీ రూపంలో	-రూ.2,00,000


ప్రస్తుతం మార్కెట్లో 6 టైర్ల లారీలు పూర్తిగా కనుమరుగై, 10 టైర్ల లారీలు మాత్రమే వున్నాయి. ఇవి దాదాపు రాష్ట్రంలో మూడున్నర లక్షల వాహనాలున్నాయి. ఒక్క లారీ వున్న యజమాని కూడా ఆదాయపన్ను చెల్లించాల్సి వస్తుంది.

లారీ రంగంపై పాలకులు చిన్నచూపు-ఈశ్వరరావు

ప్రభుత్వాలకు రూపాయి భారం లేకుండా కోట్లాదిరూపాయల ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్న లారీ పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఏపీ లారీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వై.వి.ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాదిమందికి జీవనభృతి కల్పిస్తున్న ఈరంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వుందన్నారు. అసలే తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న లారీ రంగానికి సెక్షన్ 44ఏఈ సవరణ బిల్లు గుదిబండ అవుతుందన్నారు. ఈక్షణమే కేంద్రం ఈ నూతన ప్రతిపాదనను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. అలాగే గత 13 నెలల్లో డీజిల్ ధర లీటరు రూ.21లు, పెట్రోలు రూ.22 పెరిగిందని. దీనివల్ల ఈరంగం కోలుకోలేని పరిస్థితికి నెట్టివేయబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీ వీటికి కూడా అమలు చేయాలని, అలాగే ఇటీవల డిజిల్‌పై తగ్గించిన రూ.8లు ప్రజలకు వర్తింపజేయాలని. లేనిపక్షంలో టోలు ట్యాక్స్‌లు రద్దు చేయాలని ఈశ్వరరావు డిమాండ్ చేశారు.

మరోసారి కష్టాల్లో....మార్కెట్లు

- 400పాయింట్ల నష్టంతో సెన్సెక్స్
- భారీగా నష్టపోయిన ఐటీ, బ్యాంకింగ్, టెలికాం
- లాభాల్లో టాటాస్టీల్



ముంబై: దేశీయ మార్కెట్లు మరోసారి నష్టాల్లో ముగిశాయి. వరుసగా కొనసాగుతున్న నష్టాలనుండి కాస్త కోలుకునేలోపే... గురువారం ట్రేడింగ్‌లో అమెరికా మార్కెట్లు భారీగా పతనం కావడంతో దీని ప్రభావం దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. మార్కెట్ల ఆరంభంలోనే సూచీలు నష్టాబాట పట్టాయి. తొలుత 500 పాయింట్లు దిగజారి అనంతరం స్వల్పంగా కోలుకున్నట్లు కనిపించినా.. బ్యాంకింగ్ షేర్ల పతనంతో మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీసింది. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 400పాయింట్లు కోల్పోయి 33,997 వద్ద నిలువగా.. నిఫ్టీ 10,500 దిగువకు పడిపోయి 10,447 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ. 64.37గా కొనసాగుతోంది.అమెరికా సెంట్రల్ బ్యాంకు వడ్డీరేట్లను పెంచనున్న నేపథ్యంతో భయాందోళనతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్‌మార్కెట్లు క్రాష్ అవుతున్నాయి. సెన్సెక్స్ స్టాక్స్‌లో 29రెడ్‌లో ట్రేడ్‌కాగా, టాటా స్టీల్ అత్యధికంగా 0.22శాతంతో 672 వద్ద ముగిసింది. ఫిబ్రవరి 1నుండి ఇప్పటివరకు సెన్సెక్స్ 5.7 శాతం పతనమై నష్టాలను చవిచూస్తోంది. బిఎస్‌ఇ లూజర్స్‌లో గ్లెన్‌మార్క్ 8.15శాతం, రెడింగ్‌టన్ 3.88శాతం జస్ట్ డయల్ 3.02శాతం నష్టపోయాయి. మిడ్‌కాప్, స్మాల్ కాప్ సూచీలు133పాయింట్లు, 118పాయింట్లు నష్టపోయాయి. విదేశీమదుపరులు రూ.2297 కోట్ల షేర్లను అమ్మగా దేశీయ మదుపరులు రూ.2373.59 కోట్లు షేర్లను అమ్మకాలు చేశారు. బిఎస్‌ఇ బ్యాంకెక్స్, ఆటో సూచీల్లో 511 పాయింట్లు నష్టంతో 28,884 పాయింట్లు, 184పాయింట్లతో 25,099పాయింట్లు నమోదుచేసాయి. ఐసిఐసిఐ బ్యాంకు ,హెచ్‌డిఎఫ్‌సి, ఐటిసి సెన్సెక్స్ ప్రధాన నష్టదారులుగా ఉన్నారు.. నిఫ్టీ మిడ్‌క్యాప్ స్వల్పంగా 0.3 శాతం లాభాల్లో ముగిసింది. ఎన్ఎస్ఈలో దాదాపు అన్ని రంగాల షేర్లు నష్టపోగా.. మెటల్ మాత్రమే 1.3 శాతం మెరిసింది. బ్యాంకు నిఫ్టీ దాదాపు 2 శాతం. ఆటో. ఐటీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ 1 శాతం నుంచి 0.5 శాతం మధ్య బలహీనపడ్డాయి.ఎంసీఎక్స్ మార్కెట్‌లో బంగారం ధరలు 91 రూపాయల నష్టంలో రూ.30,016గా ఉన్నాయి.

అంతర్జాతీయ మార్కెట్లు: శుక్రవారం ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగిసాయి.షాంగై కాంపోజిట్ సూచీ 4.1శాతంతో మే 2017 అనంతరం భారీగా నష్టపోయింది. బ్లుచిప్ సిఎస్1300 ఇండెక్స్ 4.6శాతం నష్టాల్లో ముగిసింది. జపాన్ నిక్కీ 3.2శాతం నష్టంతో ఈ వారం 8.9శాతం నష్టపోయింది. ఆసియాపసిఫిక్ షేర్లు జపాన్ వెలువల 2.3శాతంతో రెండునెలల కనిష్టానికి ముగిసింది.డౌ జోన్స్ దాదాపు 1000పాయింట్లు కోల్పోయింది.

నూతన ప్రాంగణంలోకి 'చెర్రీస్'

విజయవాడ: పదేళ్లుగా కొత్త తరహా రుచులను అందిస్తూ వేలాది మంది అభిమానాన్ని చూరగొన్న ప్రముఖ మిఠాయిల దుకాణం 'చెర్రీస్' నూతన ప్రాంగణంలోకి అడుగుపెట్టింది. శుక్రవారం నూతన భవనాన్ని లింగమనేని పూర్ణ భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ తుమ్మల రవికుమార్ మాట్లాడుతూ దేశవిదేశాల్లో 'చెర్రీస్' వేలాదిమంది అభిమానులను సంపాదించుకుందని తెలిపారు. ఆధునిక వసతులతో రెస్టారెంట్, బ్యాంక్వెట్ హాల్, గిఫ్ట్ షోరూమ్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

చౌక గృహ కొనుగోలుదారులపై జీఎస్టీ వేయవద్దు

బిల్డర్లకు కేంద్ర ప్రభుత్వం సూచన

న్యూఢిల్లీ : చౌక గృహ కొనుగోలుదారుల నుంచి జీఎస్టీ వసూలు చేయవద్దని బిల్డర్లకు ప్రభుత్వం సూచించింది. దాదాపు అన్ని చౌక గృహ ప్రాజెక్టులపై ప్రభావిత జీఎస్టీ రేటు 8 శాతంగానే ఉన్నందున దీన్ని హోం బయ్యర్ల నుంచి ఏ రకంగాను తీసుకోవద్దని బుధవారం బిల్డర్లను కేంద్రం కోరింది. గత నెల జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీం కింద నిర్మాణమయ్యే గృహాల కోసం జీఎస్టీలో 12 శాతం రాయితీ రేటును పొడిగించారు.

బలవంతపు చర్యలొద్దు : మరోవైపు స్టార్టప్‌ల నుంచి పన్నుల బకాయిలను రాబట్టేందుకు బలవంతపు చర్యలను చేపట్టవద్దని ఆదాయం పన్ను (ఐటీ) శాఖకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) సూచించింది. దేశంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఇది అవసరమని సీబీడీటీ అభిప్రాయపడింది.

గూగుల్‌కు రూ.136 కోట్ల ఫైన్




న్యూఢిల్లీ: అంతర్జాతీయ టెక్నాలజీ, ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్‌పై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ఇండియా (సీసీఐ) గురువారం భారీ జరిమానా విధించింది. భారతీయ మార్కెట్ నిబంధనలను ఉల్లంఘించినందుకుగాను రూ.135.86 కోట్ల జరిమానాను వేసిం ది. 2013, 2014, 2015 ఆర్థిక సంవత్సరాల్లో దేశీయంగా వివిధ వ్యాపార విభాగాల కార్యకలాపాల నుంచి గూగుల్ అందుకున్న మొత్తం సగటు ఆదాయంలో ఇది 5 శాతంతో సమానం.

దేశీయ చట్టాలను అతిక్రమించి మార్కెట్‌లో ఆధిపత్యం కోసం గూగుల్ అక్రమ వ్యాపార పద్ధతు లను అవలంభించిందని, అందుకే భారీ జరిమానాను వేశామని ఇందుకు సంబంధించిన ఆదేశంలో సీసీఐ పేర్కొన్నది. కాగా, 2012లో గూగుల్ ఎల్‌ఎల్‌సీ, గూగుల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గూగుల్ ఐర్లాండ్ లిమిటెడ్ లకు వ్యతిరేకంగా మ్యాట్రి మొనిడాట్ కామ్, కన్స్యూమర్ యూనిటీ, ట్రస్ట్ సొసైటీ (కట్స్)లు ఇచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేసిన సీసీఐ.. ఈ జరిమానాను ప్రకటించింది. వివిధ దేశాల్లో గూగుల్‌పై ఈ తరహా విచారణలు జరుగుతున్నా.. భారీ జరిమానాతో అంతర్జాతీయంగా మాత్రం ఇది అరుదైన కేసుల్లో ఒకటిగా నిలిచింది. ఇదిలావుంటే గూగుల్ అధికార ప్రతినిధి మాట్లాడుతూ సీసీఐ గుర్తించిన కొద్దిపాటి ఆందోళనలపై సమీక్షిస్తున్నామన్నారు. అయినప్పటికీ తాము ఎల్లప్పుడూ వినియోగదారులకు మెరుగైన, వేగవంతమైన సేవలను అందించడంపైనే దృష్టి పెడుతామన్నారు.

విజ్ఞానం

వైరస్‌ల జలపాతం



ఆకాశం నుంచి లక్షలాది వైరస్‌లు జారిపడుతున్నాయంట తెలుసా... ప్రతిరోజూ 800 మిలియన్లకు పైగా వైరస్‌లు భూగ్రహం ఉపరితలంపై భూమి వాతావరణం చుట్టూ కేంద్రీకరించబడి ఉన్నట్లు కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా శాస్త్రవేత్తలు వెల్లడించారు. అంటే కెనడాలోని ప్రతి వ్యక్తి చుట్టూ 25రకాల వైరస్‌లు ఉన్నట్లు అనమాట. 20ఏళ్ల క్రితం శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా భిన్నమైన పరిసరాలలో విభిన్నమైన వాతావరణంలో జన్యుపరంగా ఒకేవిధమైన వైరస్‌లను గుర్తించారు. ఈ వైరస్‌లు చిన్నవిగా, తేలికగా ఉండి గాలి, వాయువు వంటి పదార్థాల్లో సైతం దీర్ఘకాలంఉండగలవని తెలుస్తోంది. బాక్టీరియా, వైరస్‌లు భూ వాతావరణంలోని వర్షాలు, సహారా ఎడారివంటి ప్రదేశాల్లో సైతం జీవించిఉండగలవు. వర్షానికి కూడా వైరస్‌లను తొలగించే శక్తి తక్కువే ఉంటుందని స్పెయిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ గ్రెనడా ఎకాలజిస్ట్ వెల్లడించారు. స్పెయిన్‌లోని అత్యంత ఎత్తైన సియరా నెవడా పర్వతాల్లో బిలియన్ల వైరస్‌లు మిలియన్లకొలదీ బాక్టీరియాలు ఉన్నట్లు పరిశోధకులు వెల్లడించారు. బాక్టీరియాతో పోల్చుకుంటే వైరస్ డిపాజిట్లు తొమ్మిదినుండి 461 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రయోగశాలలో మనిషి గుడ్లు వృద్ధి...!



వైద్యం నూతన పుంతలు తొక్కుతోంది. మొదటి సారి మనిషి గుడ్లను ప్రయోగశాలలో అభివృద్ధి చేసినట్లు ఎడిన్‌బరో శాస్త్రజ్ఞులు వెల్లడించారు. కేన్సర్ చికిత్సలో భాగంగా పిల్లల్లో సంతానోత్పత్తి కలుగజేసే సాంకేతిక విధానాన్ని వృద్ధి చేసినట్లు ఈ అధ్యయన బృందం వెల్లడించింది. సైన్స్‌లో మనిషి గుడ్డును వృద్ధి చేయడం పెద్ద మిస్టరీగా ఉంది. మనిషి గుడ్డును క్లినికల్‌గా వృద్ధి చేసేందుకు మరింత కృషి అవసరమైందనీ తమకే చాలా ఆశ్చర్యంగా ఉందని తెలిపారు. స్త్రీలు తమ ఓవరీల్లో ఎదగని గుడ్లతో జీవిస్తారని ప్యూబర్టీ తరువాత వారిలో ఈ గుడ్ల ఎదుగుదల ఉంటుంది. స్త్రీల అండాశయం వెలుపల ప్రయోగశాలలో ఈ గుడ్లు పరిపక్వత సాధించేందుకు శాస్త్రజ్ఞులు కొన్ని దశాబ్దాలుగా వీరు చేపట్టిన ప్రయోగం విజయవంతం కావడంతో అత్యంత సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. ప్రయోగశాలలోని ఆక్సిజన్ శాతం, హార్మోన్స్, ప్రోటీన్లు, వాతావరణం గుడ్లు ఎదిగేందుకు అతి జాగ్రత్తగా శ్రద్ధ వహించవలసిఉంది. శాస్త్రజ్ఞులు సాధ్యమేనని ప్రయోగాత్మకంగా రుజువు చేసినట్లు వెల్లడించారు. కేవలం 10శాతం గుడ్లు మాత్రమే మెచ్యూరిటీ సాధించినట్లు తెలుస్తోంది.

మార్కెట్లోకి ప్రొబయోటిక్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రొబయోటిక్స్‌ను అందించడంలో అగ్రగామిగా ఉన్న టాబ్లెట్స్ (ఇండియా) లిమిటెడ్ తాజాగా మరో వినూత్న ప్రొబయోటిక్ 'రెస్యునేట్'ను దేశవ్యాప్తంగా మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. దీంతో తన పోర్ట్‌ఫోలియోను మరింత విస్తృతం చేసుకుంది. జపనీస్ అగ్రగామి మోరినాగా మిల్క్ ఇండ్రస్టీ కంపెనీ (లి) ద్వారా ప్రొబయోటిక్ బైఫైడొ బాక్టీరియన్ బ్రెవ్ ఎం-16వి నుంచి ఇది అభివృద్ధి చెందిందని సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎన్నో ఏళ్ల పరిశోధన ఆధారంగా ఇది రూపుదిద్దుకుంది. నవజాత శిశువుల్లో రోగనిరోధక శక్తిని అభివృద్ధి చేసేందుకు, రోగనిరోధక స్పందనను మాడ్యులేట్ చేసేందుకు ఇది తోడ్పడుతుంది. టాబ్లెట్స్ ఇండియా సంస్థ ఇప్పటికే కడుపు, దంత, జీర్ణ సంబంధిత ఔషధాలను అందిస్తోంది.

ట్రక్కు డ్రైవర్ల చెంతకే వైద్య సేవలు...!

విజయవాడ : శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ ఆర్థిక సాయంతో పిరమల్ స్వాస్థ్య ఏపీలోని విశాఖపట్నం, రాజమహేంద్రవరం, నెల్లూరు, అనంత పురంలో సంచార వైద్య యూనిట్లను ప్రారంభిస్తోంది. ట్రక్కు డ్రైవర్లు, సహాయకులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. సాధారణంగా ట్రక్కు డ్రైవర్లు సుదూర ప్రాంతాల్లో పర్యటిస్తుంటారు. తమ అనారోగ్య పరిస్థితులనూ పట్టించుకోరు. ఈ స్థితిలో వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స, చిన్న చిన్న వ్యాధులను రిఫర్ చేయటమే లక్ష్యంగా ఈ సంచార వైద్య యూనిట్‌లు పని చేస్తాయి. సంక్రమిత, సంక్రమితంకాని వ్యాధులపై అవగాహన కల్పించి, కౌన్సెలింగ్ ద్వారా జీవనశైలి మార్పు తీసుకురావటానికి ఈ యూనిట్లు యత్నిస్తాయి. ఈ సందర్భంగా పిరమల్ స్వాస్థ్య సీఈవో విశాల్ ఫన్సే మాట్లాడుతూ, ట్రక్కు డ్రైవర్ల ఆరోగ్య స్థితిని మెరుగు పర్చటానికి దేశవ్యాప్తంగా సానుకూల ఆరోగ్య ఫలితాల సాధనకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఉమేశ్ రేవన్కర్ మాట్లాడుతూ, రవాణా రంగానికి చెందిన సమాజానికి సకాలంలో ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటులోకి తీసుకురావలన్నది తమ సంస్థ ధ్యేయమన్నారు.

పశ్చిమాసియా పర్యటనకు మోడీ

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం పాలస్తీనాతో సహా మూడు పశ్చిమాసియా దేశాల పర్యటనకు బయలుదేరి వెళ్లారు. భద్రత, వాణిజ్యం వంటి వ్యూహాత్మక అంశాలపై సహకారానికి సంబంధించి ఆయా దేశాల అధినేతలతో ఈ పర్యటన సందర్భంగా మోడీ చర్చలు జరపనున్నారు. జోర్డాన్, పాలస్తీనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఒమన్‌లలో నేటి నుంచి నాలుగు రోజులపాటు పర్యటించనున్నారు. గల్ఫ్, పశ్చిమాసియా దేశాలతో సంబంధాలను విస్తృతపరుచుకోవడమే ఈ పర్యటన లక్ష్యమని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 10వ తేదీ పాలస్తీనా నుంచి మోడీ పర్యటన ప్రారంభమవుతుంది. అంతకుముందు జోర్డాన్ మీదగా ఆయన పాలస్తీనా చేరుకుంటారు. రాజు అబ్దుల్లా 2తో మోడీ సమావేశమవుతారు. భారత విదేశీ వ్యవహారాలకు సంబంధించి గల్ఫ్, పశ్చిమాసియాలకు ప్రథమ ప్రాధాన్యత ఉన్నది. పర్యటనకు బయలుదేరడానికి ముందు మోడీ విలేకరులతో మాట్లాడుతూ, పశ్చిమాసియా ప్రాంతంతో సంబంధాలు పటిష్టపర్చుకోవడమే తన పర్యటన ప్రధాన లక్ష్యమని చెప్పారు. 2015 నుంచి గల్ఫ్, దక్షిణాసియాలో తాను జరుపుతున్న ఐదవ పర్యటన ఇదని తెలిపారు. "మా విదేశీ వ్యవహారాలకు సంబంధించి ఈ ప్రాంతానికి కీలక ప్రాధాన్యత ఉంది. ఈ ప్రాంతంలోని దేశాలతో మాకు పటిష్టమంతమైన సంబంధాలు ఉన్నాయి. వీటిని మరింత బలోపేతం చేసుకోవాల్సి ఉన్నది. ఈ పర్యటన ద్వారా పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతంలో సంబంధాలకు అత్యధిక ప్రాధాన్యత ఏర్పడుతుంది" అని చెప్పారు. భారత్‌తో పటిష్టమైన ఆర్థిక , బలీయమైన వ్యాపార సంబంధాలు ఒమన్ పెట్టుకోవడం ఇదే మొదటిసారని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీ సాయంత్రం ఒమెన్ సుల్తాన్‌ను కలుసుకోనున్నట్టు చెప్పారు.

బుల్లి మైక్రోలెన్స్


ఆధునిక హంగులతో ఫోన్ కెమెరాలు చేస్తున్న సందడి చూస్తూనే ఉన్నాం. డిజిటల్ కెమెరాల మాదిరిగా అదనపు లెన్స్‌ని ఫోన్ కెమెరా లెన్స్‌కి తగిలిస్తూ భిన్నమైన ఫొటోలు తీసేందుకూ ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో అనేక రకాల లెన్స్ స్మార్ట్ ఫోన్‌ల కోసం పుట్టుకొస్తున్నాయి. వాటిల్లో ఇప్పుడు కొత్తగా రెండు మినీ లెన్స్ సందడి చేస్తున్నాయి. అవే Blips Lenses. ప్రపంచంలోనే అత్యంత పల్చటి మైక్రోస్కోప్ లెన్స్ ఇవేనట. స్మార్ట్ ఫోన్‌లు, ట్యాబ్లెట్ కెమెరాలకు వీటిని చిత్రంలో మాదిరిగా అతికించి మైక్రో ఫొటోగ్రఫీ చేయవచ్చు. సూక్ష్మ ప్రపంచాన్ని ఫోన్ కెమెరా కంటితో సులువుగా చూడొచ్చు. Macro, Micro మోడ్స్‌లో రెండు రకాల లెన్స్‌ని వాడుకోవచ్చు. మ్యాక్రో లెన్స్‌ని వాడి 10ఎక్స్ మ్యాగ్నిఫికేషన్‌తో ఫొటోలు తీయొచ్చు. రెండు లెన్స్ మందం వరుసగా 0.5, 1.2ఎంఎం. వీటిని ఏటీఎం కార్డ్‌ల మాదిరిగా



పర్సులో పెట్టుకుని తీసుకెళ్లొచ్చు. వాడుతున్న ఫోన్ మోడల్‌కి అనుగుణంగా లెన్స్‌ని కెమెరాకి అతికించొచ్చు. లెన్స్‌తో కూడిన టేపు ఎన్నిసార్లయినా అతుక్కుంటుంది. ఒక్కసారి అతికించి ఫోన్‌కి అలానే వదిలేయవచ్చు కూడా. ఎందుకంటే ఫోన్‌ని వాడేటప్పుడు లెన్స్‌తో ఎలాంటి అసౌకర్యం ఉండదు. ఫోన్ కెమెరా సెన్సర్ ఆధారంగా లెన్స్ పని చేస్తాయి. లెన్స్ ధర సుమారు రూ.1400 ఉండొచ్చని అంచనా. వీడియో, ఇతర వివరాలకు: https://goo.gl/bgDfvn

పిల్లల కోసం

చదువు, ఆటలు, పాటలు... పిల్లలకు ఇప్పుడు ఇవన్నీ స్మార్ట్‌ఫోన్, ట్యాబ్‌ల్లోనే. అంతగా పిల్లలతో మమేకమైపోయాయి ఈ గ్యాడ్జెట్లు. విద్యకు సంబంధించిన వీడియోలు, ఆడియోలు, ఈ- బుక్స్, సరదా కోసం గేమ్స్‌ను వాటిలో డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. వీటికే ప్రత్యేకంగా ఓ ట్యాబ్ ఉంటే బాగుంటుంది కదా. లెనోవో అలాంటి ఓ ట్యాబ్‌ను విడుదల చేసింది. 'సీజీ స్లేట్' పేరుతో రూపొందిన ఈ ప్రత్యేక ట్యాబ్ ధర రూ.8,499. దీంట్లో పిల్లలకు అవసరమయ్యే చాలా సమాచారం ప్రీలోడెడ్‌గా ఉంటుంది. కావాలంటే అదనపు సమాచారం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. స్పెషిఫికేషన్స్ విషయానికొస్తే... ఆండ్రాయిడ్ ఓఎస్‌తో పని చేస్తుంది. 7 అంగుళాల టచ్‌స్క్రీన్ ఉంటుంది. బ్యాటరీ సామర్థ్యం 3450 ఎంఏహెచ్. ఒక జీబీ రామ్, 8 జీబీ అంతర్గత స్టోరేజీ ఉంటాయి. మెమొరీ కార్డు సహాయంతో స్టోరేజీని 32 జీబీ వరకు పెంచుకోవచ్చు.



ఆధార్, పాన్‌లను లింక్ చేయండి ఇలా..



మీ పాన్‌కార్డ్‌ని ఆధార్‌తో లింక్ చెయ్యాలంటే కింది విధంగా చేయండి

1. ముందుగా పాన్, ఆధార్ నెంబర్ లను దగ్గర పెట్టుకోండి.
2. ఇప్పుడు మీ మొబైల్ లేదా డెస్క్‌టాప్‌లో ఇంటర్నెట్ బ్రౌజర్‌ని ఓపెన్ చెయ్యండి.
3. సెర్చ్ బార్‌లో www.incometaxindiaefiling.gov.in టైప్ చేసి మొబైల్ ఐతే go పై క్లిక్ చేయండి అదే డెస్క్‌టాప్ ఐతే enter press చెయ్యండి
4. ఇప్పుడు వచ్చే స్క్రీన్ లో మీకు ఎడమ వైపు బ్లింక్ అవుతూ Link aadhar అని కనిపిస్తుంది దానిపై క్లిక్ చేయండి.
5. కొత్త పేజీ వస్తుంది అందులో ఆధార్, పాన్ వివరాలు ఇచ్చి OTP కోసం రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్ ఇవ్వండి ఇప్పుడు continue పై క్లిక్ చెయ్యండి
6. ఇప్పుడు మీకు OTP వస్తుంది దాన్ని ఎంటర్ చేసి submit క్లిక్ చెయ్యండి.
7. ఆధార్, పాన్ వివరాలు సరిపోతే successful అని వస్తుంది. అలా రాకపోతే ఆధార్ లేదా పాన్‌లో వివరాలు ఒకేలా మార్చుకొని పైవిధంగా లింక్ అనేది చేసుకోవాలి.


యాక్షన్ కెమెరా

ప్రతికూల వాతావరణంలో సాహసాలు చేసే రియల్ హీరోలు తమ సాహసాల్ని చిత్రీకరించేందుకు దృఢమైన కెమెరాని మార్కెట్‌లో ప్రవేశపెట్టింది ఒలంపస్ కంపెనీ. పేరేంటో తెలుసా? Tough! TG-Tracker. 30 మీటర్ల లోతులో నీటి అడుగున చిత్రీకరణ చేసేలా వాటర్‌ప్రూఫ్ కవచం ఉంది. అలాగే, 10 డిగ్రీల గడ్డకట్టే మంచులోనూ Freezeproof కవచంతో వీడియోలు చిత్రీకరించొచ్చు. CMOS సెన్సర్‌తో కూడిన 7.2 మెగాపిక్సల్ కెమెరాతో 4కే క్వాలిటీతో హెచ్‌డీ వీడియోలను చిత్రీకరణ చేయవచ్చు. 204 డిగ్రీల వైడ్ యాంగిల్ లెన్స్‌తో ఫ్రేమ్ విశాలంగా కనిపిస్తుంది. వీడియోలను చిత్రీకరిస్తున్నప్పుడే 1.5 అంగుళాల ఎస్‌సీడీ తెరపై చూడొచ్చు. వెలుతురు చాలకపోయినా... రాత్రి సమయంలో... చిత్రీకరణకు ప్రత్యేక 'హెడ్‌లైట్'ని కెమెరాలో నిక్షిప్తం చేశారు. నీళ్లలో చిత్రీకరణ చేయాల్సివస్తే 'అండర్‌వాటర్ డిటెక్టర్' ఆప్షన్‌తో 50 సెంటీమీటర్ల లోతు దాటగానే ఆటోమాటిక్‌గా కెమెరా మోడ్ మారిపోయి, నీటి అడుగు చిత్రీకరించేందుకు అనువుగా సిద్ధం అవుతుంది. ఒక్కసారి కెమెరాని ఛార్జ్ చేస్తే సుమారు 90 నిమిషాల పాటు చిత్రీకరణ చేయవచ్చు. కెమెరా కదలకుండా పట్టుకునేందుకు ప్రత్యేక 'హ్యాండ్‌గ్రిప్' కెమెరాకి తగిలించి వాడుకోవచ్చు. అంతేనా... ప్రత్యేక సెన్సర్ సిస్టంతో GPS, Compass, Barometer, Thermometer, Acceleration sensor సేవల్ని అందిస్తుంది. అన్ని వివరాల్ని వీడియోతో పాటు రికార్డ్ చేసి అందిస్తుంది. ధర సుమారు రూ.24,000. వీడియో, ఇతర వివరాలకు: https://goo.gl/8dARrb



అదనపు స్టోరేజ్

ఫోన్‌లోని మెమొరీ సామర్థ్యాన్ని ఎక్స్‌టర్నల్ మెమొరీ కార్డ్‌లతో పెంచుకోవడం తెలిసిందే. ఏదైనా ముఖ్యమైన వీడియో చిత్రీకరిస్తున్నప్పుడు 'మెమొరీ ఫుల్' అంటూ చిత్రీకరణ ఆగిపోతుంది. ఇక చేసేది లేక స్టోరేజ్ నుంచి కొంత డేటాని తొలగించేందుకు ప్రయత్నిస్తాం. ఈ క్రమంలో కొన్ని సార్లు ముఖ్యమైన డేటానీ అనుకోకుండా తొలగిస్తుంటాం. ఇలాంటి సమస్యలేం రాకుండా ఉండాలంటే? శాన్‌డిస్క్ అందిస్తున్న iXpand Flash డ్రైవ్‌ని వాడితే సరి. ఐఫోన్, ఐప్యాడ్‌లకు ఇది ప్రత్యేకం. దీన్ని ఫోన్‌కి కనెక్ట్ చేస్తే చాలు. ఆటోమాటిక్‌గా ఫోన్ కెమెరాతో తీసిన ఫొటోలు, వీడియోలను బ్యాక్‌అప్ చేస్తుంది. అవసరం నిమిత్తమో... ప్రయాణాల్లోనో... డ్రైవ్‌లో సేవ్ చేసిన వివిధ ఫార్మెట్ వీడియోలను ఫోన్‌లోనే చూడొచ్చు. ఇంకా చెప్పాలంటే... డ్రైవ్‌ని కనెక్ట్ చేసి చిత్రీకరించే వీడియోని



సరాసరి దాంట్లోనే సేవ్ అయ్యేలా చేయవచ్చు. యూఎస్‌బీ 3.0తో డేటాని మెరుపు వేగంతో సిస్టంలోకి ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. డేటాని ఆటోమాటిక్‌గా బ్యాక్‌అప్ చేసేందుకు iXpand మొబైల్ ఆప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. 128, 64, 32, 16 జీబీ మెమొరీ సామర్థ్యంతో డ్రైవ్‌ని అందిస్తున్నారు. వీటి ధరలు వరుసగా... రూ.9,990, రూ.6,990, రూ. 4,990, రూ.3,990. వీడియో, ఇతర వివరాలకు https://goo.gl/QJRvuP

యావరేజ్ 'ఇంటిలిజెంట్'

సినిమా సమీక్ష

సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో శుక్రవారం థియేటర్లలోకి వచ్చింది ఇంటిలిజెంట్ సినిమా. మరి టైటిల్‌కు తగ్గట్టు సినిమాలో ఇంటిలిజెన్స్ ఉందా.. మూవీ రిజల్ట్ ఏంటి.. దీనిపై ప్రత్యేక సమీక్ష

కథ:

సాయిధరమ్ తేజ్‌కు చిన్నప్పట్నుంచి ప్రాక్టికల్‌గా ఉండడం అలవాటు. మరీ ముఖ్యంగా మంచి చేసినవాళ్లను మరిచిపోకూడదు, వాళ్ల కోసం ఏదైనా చేయాలనే తత్వం. ఈ మంచి విషయాన్ని నాజర్ నుంచి నేర్చుకుంటాడు. ఎవరికైనా మంచి చేస్తే మనకు కూడా మంచే జరుగుతుందని నమ్మే నాజర్‌ను గురువుగా భావిస్తుంటాడు సాయిధరమ్ తేజ్. అతడి అడుగు జాడల్లోనే పెరిగి పెద్దవాడవుతాడు. నాజర్ పెట్టిన కంపెనీలోనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేరతాడు. అంతేకాదు..నాజర్ కూతురు లావణ్య త్రిపాఠి, తేజు ప్రేమించుకుంటారు. సరిగ్గా ఇదే టైమ్ లో మాఫియా డాన్ రాహుల్‌దేవ్ రంగప్రవేశం చేస్తాడు. నాజర్ ను చంపేసి ఆత్మహత్యగా ఆధారాలు సృష్టిస్తాడు. నాజర్ సాఫ్ట్‌వేర్ కంపెనీని తను సొంతం చేసుకుంటాడు. గురువును చంపిన రాహుల్ దేవ్ మీద ప్రతీకారం తీర్చుకోవాలని ఫిక్స్ అవుతాడు సాయిధరమ్ తేజ్. ఓ వ్యక్తిగా అతడిని ఎదిరించే కంటే.. తన తెలివితేటలతో ఓ శక్తిగా మారతాడు. ఈ క్రమంలో ధర్మాభాయ్‌గా మారతాడు. కేవలం నాజర్‌ను చంపినందుకు ప్రతీకారం తీర్చుకోవడమే కాకుండా.. మంచి చేసే వాళ్లకు మంచే జరుగుతుందనే సందేశాన్ని తనదైన శైలిలో జనాల్లోకి చేరవేస్తాడు. ఇది ఇంటిలిజెంట్ స్టోరీలైన్.

ప్లస్ పాయింట్స్- సాయిధరమ్ తేజ్ నటన, డాన్స్ ,సప్తగిరి కామెడీ సన్నివేశాలు , కళామందిర్ సాంగ్, ఇంటర్వెల్ ఫైట్, రీరికార్డింగ్

మైనస్ పాయింట్స్ - వినాయక్ డైరక్షన్, నాసిరకం ప్రొడక్షన్ వాల్యూస్, కథలో దమ్ములేకపోవడం, హీరోయిన్ నటన, ఎడిటింగ్, యాక్షన్ సన్నివేశాల్లో లోపాలు



ఇంటిలిజెంట్.. ఈ సినిమాకు ఈ టైటిల్ కరెక్టే. కానీ స్క్రీన్ ప్లే, ఎడిటింగ్ విషయాల్లో మాత్రం ఈ టైటిల్ అస్సలు సూట్ కాదు. కథ ఎంపిక నుంచి, దాన్ని చెప్పే విధానం వరకు ఎక్కడా దర్శకుడి ఇంటిలిజెన్స్ కనిపించదు. ఇంకా చెప్పాలంటే ఈ కథ కూడా వినకుండా సాయిధరమ్ తేజ్ ఓకే చేశాడేమో అనిపిస్తుంది. అంత రొటీన్ స్టోరీ ఇది.

నటీనటుల విషయానికొస్తే కథ రొటీన్ అయినప్పటికీ సాయిధరమ్ తేజ్ తనవంతు ప్రయత్నం మాత్రం చేశాడు. యాక్టింగ్, డాన్సింగ్ అన్నీ చక్కగా చేశాడు. ఈసారి తేజూ కొత్తగా ఏదైనా చేశాడంటే అది చిరంజీవిని ఇమిటేట్ చేయడమే. ఛమక్ ఛమక్ సాంగ్ లో చిరంజీవిని యధాతథంగా అనుకరించాడు. చాలా సన్నివేశాల్లో చిరంజీవి నటనను మక్కికి మక్కి దించేశాడు. కేవలం తేజూను చిరంజీవిగా చూపించడం కోసమే వినాయక్ ఈ సినిమా తీశాడేమో అని అనిపించకమానదు.

హీరోయిన్ లావణ్య త్రిపాఠి తన కెరీర్‌లో అతి చెత్త పెర్ఫార్మెన్స్ ఇచ్చింది. ఒక్క ఎమోషన్ పండలేదు. చివరికి ఛమక్ ఛమక్ సాంగ్ బోర్ కొట్టడానికి కూడా లావణ్యే కారణం. ఈ సినిమాకు ఆమె పెద్ద మైనస్. తేజూ, లావణ్య కెమిస్ట్రీ కూడా పండలేదు. సినిమాలో కాస్త మెచ్చుకోదగ్గ అంశం ఏదైనా ఉంటే అది కామెడీ మాత్రమే. సప్తగిరి పండించిన 2-3 కామెడీ సీన్లు బాగా పేలాయి. మిగతా నటీనటుల గురించి చెప్పుకోవడానికేం లేదు టెక్నికల్‌గా కూడా సినిమా ఉన్నతంగా లేదు. తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మాత్రమే కాసింత రిలీఫ్ ఇస్తుంది. సి.కల్యాణ్ నిర్మాణ విలువలు ఆశించిన స్థాయిలో లేవు. శివ ఆకుల కథ-స్క్రీన్ ప్లే, వినాయక్ దర్శకత్వం పాతకాలం సినిమాను గుర్తుచేస్తాయి. క్లయిమాక్స్‌కు వచ్చేసరికి ఫక్తు తెలుగు సినిమా టైపులో హీరో కుటుంబాన్ని, ఫ్రెండ్స్, ప్రేయసిని



విలన్ కిడ్నాప్ చేయడం.. వారిని వెతుక్కుంటూ హీరో వచ్చి విలన్‌ను చంపి ప్రతీకారం తీర్చుకోవడం.. ఇలా బాగా విసిగిస్తాడు దర్శకుడు వినాయక్. సప్తగిరి కామెడీతో పాటు కళామందిర్ సాంగ్, ఇంటర్వెల్‌లో వచ్చేఫైట్, తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మాత్రమే ఈ సినిమాలో ప్లస్ పాయింట్స్. మిగతావన్నీ మైనస్‌ల కింద వేసుకోవచ్చు. బాహుబలి, ఫిదా, అర్జున్ రెడ్డి, పెళ్లిచూపులు లాంటి విలక్షణమైన సినిమాలు చూసిన కళ్లతో ఈ పరమ రొటీన్ ఇంటిలిజెంట్‌ను చూడలేం. మొత్తంమీద ఇంటిలిజెంట్ మరో యావరేజ్ సినిమా.

'మణికర్ణిక'పై స్పందించిన కంగనా



క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది మణికర్ణిక. అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో రాణి లక్ష్మీబాయ్ గా కంగనా రనౌత్ నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో అభ్యంతరకర సన్నివేశాలు ఉండే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయంతో రాజస్థాన్‌లోని సర్వ బ్రాహ్మణ మహాసభ ఈ సినిమాని అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. అయితే బికనేర్‌లోని కర్ణిక ఆలయాన్ని దర్శించుకున్న కంగనా రనౌత్, జోథ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ సినిమా చుట్టూ నెలకొంటున్న వివాదంపై స్పష్టత ఇచ్చింది. "మణికర్ణిక సినిమాలో అభ్యంతరకర సన్నివేశాలు ఏ మాత్రం లేవు. కొంతమంది కావాలని ఈ సినిమా చుట్టూ కాంట్రవర్సీస్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడి బ్రిటీష్ ని గడగడలాడించిన వీరవనిత విషయంలో ఇలాంటి కాంట్రవర్సీలు క్రియేట్ చేయడం మూర్ఖత్వం అనిపించుకుంటుంది. మణికర్ణిక దేశం గర్వించదగ్గ సినిమా అవుతుంది' అని చెప్పుకుంది కంగనా రనౌత్. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను కమాల్ జైన్ నిర్మిస్తున్నారు. విజయేంద్ర ప్రసాద్ కథనందించిన 'మణికర్ణిక' కు శంకర్ మహదేవన్ సంగీత దర్శకత్వం వహిస్తున్నాడు.

సినిమాలే నన్ను ఎంపిక చేసుకుంటాయి : షారుక్



సినిమాలే తనని ఎంపికచేసుకుంటాయని అంటున్నారు బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుక్ ఖాన్. ఢిల్లీలో నిర్వహించిన 'ఆటో ఎక్స్‌పో 2018' కార్యక్రమంలో షారుక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన సినిమాల గురించి మాట్లాడుతూ.. 'నేను సినిమాలను వెతుక్కుంటూ వెళ్లను. అవే నన్ను ఎంపిక చేసుకుంటాయి. ప్రతీ నటుడికి సినిమాని ఎంపిక చేసుకునే పద్ధతి ఉంటుంది. 15 ఏళ్లుగా సినిమాలను నిర్మిస్తున్నాను. ఒక్కోసారి సినిమాలు చాలా అద్భుతంగా ఉంటాయి. లేకపోతే చెత్తగా ఉంటాయి. నాకు ఈ విషయంలో ఎలాంటి బాధ లేదు. ఫ్లాప్ సినిమాల గురించి బాధపడితే ఉదయాన్నే నిద్రలేచి సినిమాలు చేస్తూ ఉండలేను. నటనను ఉద్యోగంగా భావించను. ఇతరులు అలా అనుకుంటున్నారని అభిప్రాయపడను.' 'చక్ దే ఇండియా' సమయంలో అందరూ సినిమా ఫ్లాప్ అవుతుంది అనుకున్నారు. అందులో ఆసక్తికరమైన పాటలు లేవని, ఒక్క తెలిసిన హీరోయిన్ కూడా లేదని కామెంట్లు చేశారు. మా నాన్న హాకీ ఆడేవారు. నేను కూడా ఆడతానని చాలా మందికి తెలీదు. ఈ సినిమా కథ నాకు వినిపించినప్పుడు చెత్త సినిమా నిర్మిస్తున్నానని అన్నారు. కానీ సినిమా విడుదలయ్యాక ఎంత పేరు వచ్చిందో చెప్పనక్కర్లేదు.' అని చెప్పుకొచ్చారు షారుక్.

'మెహబూబా' ఫస్ట్ లుక్ టీజర్ విడుదల



మాస్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది 'మెహబూబా' సినిమా. పూరి తనయుడు ఆకాష్, నేహాశెట్టి జంటగా నిర్మాణంలో ఉన్న ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్ రిలీజైంది. ఇండోపాక్ వార్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతూ అందమైన రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా వస్తోంది 'మెహబూబా'. ఆకాష్‌ను పూర్తిస్థాయి కమర్షియల్ హీరోగా పరిచయం చేసే ఉద్దేశంతో హై ఎమోషన్స్‌తో ఉన్న మెహబూబా కథను ఎంపిక చేసుకున్నాడు పూరి జగన్నాథ్. సినిమాలో ఆకాష్, నేహా ఎలా కనిపించబోతున్నారనే విషయాన్ని టీజర్‌లో చూపించాడు. అంతేకాదు.. సినిమా బ్యాక్ డ్రాప్ ఏంటనే విషయంపై కూడా క్లారిటీ ఇచ్చాడు. సందీప్ చౌతా బ్యాక్ గ్రౌండ్ స్కోర్, విష్ణు సినిమాటోగ్రఫీ, విజువల్ ఎఫెక్ట్స్ టీజర్‌లో హైలెట్‌గా నిలిచాయి.

'కిరాక్ పార్టీ' అందరికీ నచ్చుతుందన్న నిఖిల్



కిరాక్ పార్టీ విడుదల తేదీపై ఎన్నో ఊహాగానాలు చెలరేగాయి. దీంతో సినిమా విడుదల తేదీపై హీరో నిఖిల్ స్పందించాడు. సినిమాకు సంబంధించి చాలా వర్క్ పెండింగ్‌లో ఉందని ప్రకటించిన నిఖిల్.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని ట్వీట్ చేశాడు. మంచి ఔట్‌పుట్ కోసం పోస్ట్-ప్రొడక్షన్ వర్క్ లో కొత్త టెక్నిక్స్ ఫాలో అవుతున్నామని, ఫస్ట్ కాపీ రెడీ అయిన తర్వాత నిర్మాత రిలీజ్ డేట్ ప్రకటిస్తారని తెలిపాడు నిఖిల్. మూవీ అప్ డేట్స్ ఇచ్చిన నిఖిల్, విడుదల తేదీపై మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. కాకపోతే కిరాక్ పార్టీ కచ్చితంగా అందరికీ నచ్చుతుందని, టెక్నికల్‌గా కూడా రిచ్‌గా ఉంటుందని నిఖిల్ ట్వీట్‌తో అర్థమౌతోంది. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాతో సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరిన్జా హీరోయిన్లుగా పరిచయమౌతున్నారు. ఎ.కె. ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై రామబ్రహ్మం సుంకర ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ఏపీకి న్యాయం చేయాల్సిందే: అద్వానీ



ఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి న్యాయం చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ సీనియర్ నేత ఎల్కె. అద్వానీ అభిప్రాయ పడినట్లు తెలిసింది. లోక్‌సభలో ఆందోళన కొనసాగిస్తున్న టీడీపీ ఎంపీలతో ఆయన మాట్లాడారు. సుమారు 10 నిమిషాల పాటు టీడీపీ సభ్యులతో ఏపీ సమస్యలపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా విభజన హామీలు, సభలో నిరసనకు కారణాలు తదితర పరిణామాల గురించి వివరించారు. అనంతరం అద్వానీ వారితో మాట్లాడుతూ ఏపీకి కేంద్రం న్యాయం చేయాల్సి ఉందని అభిప్రాయపడినట్లు సమాచారం. ఒకరినొకరు గౌరవించుకోవాలని, సభా మర్యాదలు కాపాడుకోవాలని అన్నట్లు తెలుస్తోంది. ఏపీ వ్యవహారంపై ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీతోనూ మాట్లాడానని ఎంపీలతో చెప్పారు. ఎందుకిలా ప్రవర్తిస్తున్నారో అర్థం కావట్లేదంటూ ఆయన ఎంపీల వద్ద నిరాశ వ్యక్తపరిచినట్లు తెలిసింది.

కీచక టీచర్..



కోల్‌కతా : కోల్‌కతాలోని ఓ ప్రైవేటు ఇంగ్లీషు మీడియం స్కూల్ టీచర్ కీచకుడిగా తయారై రెండో తరగతి విద్యార్థినిని లైంగికంగా వేధించాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిపై లైంగిక దాడితో ఆగ్రహావేశానికి లోనైన ఆమె తల్లిదండ్రులు స్కూల్ వద్ద ఆందోళనకు చేపట్టారు. నిందితుడిని వెంటనే సస్పెండ్ చేయాలని, అతడ్ని కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. ఉపాధ్యాయుడి నిర్వాకం గురించి పాప ఇంట్లో చెప్పడంతో ఈ ఘటన వెలుగు చూసింది. స్కూల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళితే వారు తోసిపుచ్చేందుకు యత్నించారని తల్లిదండ్రులు తెలిపారు. స్కూల్ వద్దకు చేరుకొని పరిస్థితిని అదుపుచేసేందుకు ప్రయత్నించిన పోలీసులు అనంతరం నిందితుడ్ని అరెస్టు చేసి స్టేషన్ కు తరలిస్తుండగా బాలిక తల్లిదండ్రులు అతడిని కొట్టేందుకు ప్రయత్నించినట్లు పోలీసు అధికారి వెల్లడించారు.



సరోగసీతో పిల్లల్ని కంటే ప్రసూతి సెలవులు

కేంద్ర ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు

న్యూఢిల్లీ: సరోగసీ (ఆశ్రిత గర్భం) ద్వారా పిల్లల్ని కనే మహిళా ఉద్యోగులకు కూడా ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల ఉద్యోగుల శిక్షణ విభాగం (డీవోపీటీ)నకు ఆదేశాలు జారీ చేసింది. 2015లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని సూచించింది. ప్రసూతికి ముందు, ఆ తర్వాత ఇచ్చే సెలవులు (180 రోజులు) సరోగసీ ద్వారా పిల్లల్ని కనే ఉద్యోగులకూ వర్తిస్తాయని హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. సరోగసీ ద్వారా కవల పిల్లలకు జన్మనిచ్చిన కేంద్రీయ విద్యాలయానికి చెందిన ఓ ఉపాధ్యాయురాలు తనకు ప్రసూతి సెలవులివ్వడానికి ప్రభుత్వం నిరాకరిం చడంతో హైకోర్టును ఆశ్రయించగా ఈ తీర్పు ఇచ్చింది. సరోగసీ ద్వారా పిల్లల్ని కనేవారు భౌతికంగా తల్లులు కాబోరన్న కారణంతో సెలవులను నిరాకరించడాన్ని హైకోర్టు తప్పు పట్టింది. చట్టపరంగా తల్లులు అవుతున్నందున సెలవులకు అర్హులని స్పష్టం చేసింది.

బీజేపీ అధికార దాహం

- గిరిజనులకు భూ పంపిణీలో లెఫ్ట్ సర్కారే టాప్
- త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ముఖచిత్రం



గిరిజనులకు భూ పంపిణీ ఎఫ్ఆర్ఏ కింద ఆమోదించిన దరఖాస్తులు (శాతంలో)	
త్రిపుర	63
జార్ఖండ్	55
రాజస్థాన్	51
గుజరాత్	45
ఛత్తీస్‌గఢ్	44
మధ్యప్రదేశ్	40
అసోం	38
మహారాష్ట్ర	31

అగర్తాల: ఈశాన్య రాష్ట్రాల్లోనూ కాషాయ పతాకాన్ని ఎగురవేయటానికి బీజేపీ నానా తంటాలు పడుతోంది. గోడమీద పిల్లుల్లా ఉన్న నేతల్ని ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకోవటమే కాకుండా.. అడ్డదారులన్నీ తొక్కి అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీజేపీ అధిష్టానం చూస్తోంది. ఓటరు ఏం అడిగినా.. ఓటు వేయించుకునేదాకా ఇస్తామనేలా బీజేపీ లీడర్లు దిగజారుతున్నారని ప్రతిపక్షపార్టీలు ఆరోపిస్తున్నాయి.

త్రిపురలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజన తెగకు చెందిన ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)తో బీజేపీ పొత్తు కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అడవి పుత్రులను భయపెట్టి అక్కడి సంపదను కొల్లగొట్టేలా కేంద్రం నిర్ణయాలు తీసుకుం టున్న విషయం విదితమే. వారిని అడవులనుంచి తరిమికొట్టి కార్పొరేట్లకు కట్టబెట్టేలా కుటిల రాజకీయా లకు పాల్పడు తున్న ఉదాహరణలు కోకొల్లలుగా ఉన్నాయి. అలాంటి మోడీ సర్కారు గిరిజన హక్కుల కోసం తాము కట్టుబడి ఉన్నామని చెబుతున్నది. ఐపీఎఫ్ టీతో పొత్తు వారిని ఆకర్షించే కుటిల యత్నంలో భాగమేనన్నది బహిరంగ రహస్యమేనని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. గిరిజనుల ప్రయోజనాల విషయం పక్కనపెడితే.. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడుతున్న ఐపీఎఫ్‌టీకి హింసాత్మక చరిత్ర ఉంది. గిరిజనులపైనే దాడులకు తెగబడుతున్నది.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి అత్యంత ముఖ్యమైన చర్యల్లో ఒకటి... (షెడ్యూల్డ్ తెగలు, ఇతర అటవీవాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం 2006-ఎఫ్ఆర్ఏ). ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా సేద్యం చేస్తున్న అటవీ ప్రాంతాల్లోని భూమి వారికే చెందేలా ఈ చట్టం అనుమతిస్తున్నది. ఆది వాసీలు తాము సాగుచేసుకుంటున్న భూమికి సంబంధించి అధికారులకు దరఖాస్తు చేసుకుంటే.. ఆ కుటుంబానికి ఆ భూమి చెందేలా అధికారులు పట్టాలు మంజూరుచేస్తారు. ఈ చట్టం పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాల్సినది.

త్రిపురలో ఈ చట్టం అమలుతీరు ఇలా

ఈ చట్టం అమలుతీరులో ఇతర అన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలతో పోలిస్తే.. త్రిపుర అగ్రస్థానంలో ఉంది. గిరిజనుల దరఖాస్తులను పరిష్కరించి వారికి భూమిని మంజూరు చేసిన రాష్ట్రాల్లో లెఫ్ట్ ప్రభుత్వానిదే తొలి స్థానం. త్రిపుర ప్రభుత్వం, గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ జారీ చేసిన తాజా స్టేటస్ నివేదిక ప్రకారం... ఎఫ్ఆర్ఏ కింద దరఖాస్తు చేసుకున్నవారిలో 63 శాతం మంది గిరిజనులకు భూమి ప్రదానం జరిగింది. గిరిజన జనాభా గణనీయంగా ఉన్న ఇతర ప్రధాన రాష్ట్రాలు, బీజేపీ పాలిత రాష్ట్రాలు భూ పంపిణీలో చాలా వెనుకబడి ఉన్నాయి. అభివృద్ధికి సమూ నాగా మోడీ తరచుగా చెప్పుకునే గుజరాత్‌లో 45 శాతం మంది దరఖాస్తుదారులకు మాత్రమే భూ పంపిణీ జరిగింది. దీర్ఘకాలంగా బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 44శాతం, 40శాతం దరఖాస్తు దారులకు మాత్రమే భూ పంపిణీ జరిగింది. త్రిపురకు పొరుగున ఉన్న అసోంలో 38 శాతం మంది దరఖాస్తు దారులకు పట్టాలు ఇచ్చారు.

భూమి పట్టాలు ఇవ్వడంతోపాటు చట్ట నిబంధనలను అధిగమించి గిరిజన కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తూ త్రిపుర సర్కార్ మరో అడుగు ముందు కేసింది. పట్టాలు పొందినవారు నిరుపేదలు కావడంతో.. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం ఇచ్చిన భూమిని తాకట్టు పెట్టే పరిస్థితులకు వారు నెట్టబడుతున్నారు. దీనిని నిరోధించ డానికి దేశంలో ఒక్క త్రిపుర వామపక్ష సంఘటన మాత్రమే వారికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది.

ఇప్పటివరకూ 93,349 కుటుంబాలకు ఈ ప్యాకేజీని త్రిపుర సర్కార్ అందించింది. ఈ పథకం అమలుకోసం ఆర్థిక సహాయం చేయాల్సిందిగా కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసినప్పటికీ ఎలాంటి సహాయం అందలేదు. తాము గిరిజనుల పక్షాన నిలబడ్డామని బీజేపీ చేసే ప్రకటనలు నీటి మూటలేనన్నది ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో పనితీరుచూస్తే స్పష్టమవుతున్నది. గిరిజనాభివృద్ధికి వారు నిజంగా కట్టుబడి ఉంటే.. గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఎఫ్ఆర్ఏ పట ిష్టంగా అమలు జరిగి ఉండేది. ఈ గణాంకాలను బట్టీ చూస్తే.. త్రిపురలో ప్రజలు వామపక్ష కూటమి పాలనలో అభివృద్ధి దిశలో అడుగులు వేశారు.. వేస్తున్నారు. రానున్న ఎన్నికలలో కూడా ఇది ప్రతి బింబి స్తుందనడంలో ఎలాంటి సందేహంలేదని రాజకీయ పరిశీకులు భావిస్తున్నారు.

ప్రజల్లోకి కేంద్ర పథకాలు



- వాటి ప్రచారంతోనే ఎన్నికల్లో విజయాలు
- బీజేపీపీ సమావేశంలో ఎంపీలకు మోడీ విజ్ఞప్తి
- ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకోవడం ఇదే ప్రథమం : షా

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసు కెళ్లాలని ప్రధాని నరేంద్రమోడీ బీజేపీ ఎంపీలను ఆదేశించారు. ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయానికి దోహద పడాలని విజ్ఞప్తి చేశారు. బడ్జెట్‌లో అద్భుతమైన పథకాలు ప్రకటించామని, వాటికి ప్రజాదరణ లభించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీ గెలిస్తేనే ఎంపీలు విజయం సాధించినట్టని అన్నారు. శుక్రవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఇందులో మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ప్రసంగించారు. సమావేశం వివరాలను ఎంపీలు తర్వాత మీడియాకు వెల్లడించారు. బుధవారం లోక్‌సభలో ప్రధాని ప్రసంగాన్ని కాంగ్రెస్ పార్టీ సభ్యులు అవహేళన చేశారని, ప్రసంగానికి అడుగడుగునా అడ్డుతగిలారని, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అప్రజాస్వామిక రాజకీ యాలకు పాల్పడుతున్నారని అమిత్‌షా నిందిం చారు. కేంద్ర బడ్జెట్ రైతులు, పేదలకు అనుకూలమై నదని మోడీ పేర్కొన్నారని, ప్రత్యేకించి పది కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమా పథకం ప్రకటించడం హర్షణీయమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ విలేకరులకు చెప్పారు. బడ్జెట్‌లో ప్రజానుకూల పథకాలను జనంలోకి తీసుకెళ్లాని మోడీ ఎంపీలను కోరారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు పెద్ద ప్రచారం కల్పించాలన్నారు. బూత్ స్థాయిలో సభలు, సమావేశాలు నిర్వహించాలని మోడీ సూచించా రన్నారు. రానున్న ఎన్నికల్లో విజ యమే లక్ష్యంగా ప్రచారం ఉండాలని ఆదేశించినట్టు కొంతమంది నేతలు వెల్లడించారు. పార్టీ విజయమే ఎంపీల విజయమని అన్నారన్నారు. బడ్జెట్‌పై చర్చ కోసం అనేక ప్రాంతాల్లో మాక్ పార్లమెంటు నిర్వహిం చాలని మోడీ ఆదేశించారని అనంత కుమార్ చెప్పారు. బడ్జెట్‌పై చర్చకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ సమాధానాన్ని మోడీ ప్రశంసిం చారు. రాజ్యసభలో అమిత్‌షా మొదటి ప్రసంగాన్ని ఆయన కొనియాడారు. లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం ఎన్ని ఆటం కాలు కల్పించినా గురువారం త్రిపురలో జరిగిన బీజేపీ ర్యాలీకి ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారని మోడీ చెప్పుకొచ్చారు. రాహుల్‌గాంధీపై అమిత్‌షా నిశిత విమర్శలు గుప్పించినట్టు కుమార్ తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి సమాధానం చెప్పే తీర్మానంపై ప్రధాని ప్రసంగానికి ప్రతిపక్షాలు అడ్డుతగలడం చరిత్రలో ఎన్నడూ లేదని షా పేర్కొన్నారు. మోడీ ప్రసంగమంతసేపూ కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలపడం, అడ్డుకోవడం దారుణ మని వ్యాఖ్యానించారు. రాహుల్ ఆలోచనా విధానమే అప్రజాస్వామికంగా ఉందని ఆరోపిం చారు. పదేళ్లు మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమ యంలో ఇలా ఎప్పుడూ జరగలేదని గుర్తు చేశారు.

రాజస్థాన్ సీఎంకు అసమ్మతి సెగ

పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి
తక్షణం పార్టీ నాయకత్వాన్ని మార్చాలని అమిత్‌షాకు లేఖ



జైపూర్: రాజస్థాన్‌లో వసుంధర రాజే సర్కారుకు అసమ్మతి సెగ తగులుతోంది. సీఎం వసుంధర రాజే పాలనలో ప్రజలు విసుగెత్తి ఉన్నారని, రాష్ట్రంలో నాయకత్వాన్ని వెంటనే మార్చాలంటూ బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షాకు పార్టీ ఓబీసీ విభాగం లేఖ రాయడం సంచలనం రేకెత్తించింది. అమిత్ షాకు లేఖ రాసింది నిజమేనని బీజేపీ కోటా జిల్లా ఓబీసీ విభాగం చీఫ్ అశోక్ చౌదరి స్పష్టం చేశారు. వసుంధర రాజే సర్కారు వ్యవహరిస్తున్న తీరుతో పార్టీ కార్యకర్తలు నిరాశ, నిస్పృహల్లో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై రైతులు, కార్మికులు, వ్యాపారులు, తదితరులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. బీజేపీ రాష్ట్ర చీఫ్ అశోక్ పర్నామీ.. సీఎం రాజేకు బానిసగా మారారని ఆరోపించారు. దీంతో రాష్ట్రంలో పార్టీ బలహీన పడటానికి ఆయనే ప్రధాన కారణమవు తున్నాడని తెలిపారు. రాజే ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమాలు పార్టీని ఓటమి దిశగా తీసుకెళ్లేందుకే దోహదం చేస్తాయని ఎద్దేవా చేశారు. ఈ యేడాదిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీ నాయక త్వాన్ని మార్చి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాల్సిన అవసరముందని బీజేపీ హైకమాండ్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. అశోక్ చౌదరి చేసిన వ్యాఖ్యలను బీజేపీ అధికార ప్రతినిధి సంజరు లాటీ సమర్థించడం గమనార్హం. వసుంధర రాజే సర్కారు పనితీరు బాగా లేదని కార్యకర్తలు నిరాశలో ఉన్న మాట వాస్తవమేనని అంగీకరిం చారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ దారుణ పరాజయాన్ని చవి చూడటానికి గల కారణాలపై పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అన్వేషించాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ఒక అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలకు ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఘోరంగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఇది జరిగిన కొద్దిరోజులకే అమిత్‌షాకు పార్టీ ఓబీసీ విభాగం లేఖ రాసిన నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో భారీ మార్పులు తప్పవన్న ప్రచారం జరుగుతున్నది.

జువనైల్ చట్టాన్ని అమలు చేయండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ : బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన జాతీయ, రాష్ట్ర కమిషన్లలో ఖాళీ పోస్టులను నిబంధనల ప్రకారం వెంటనే భర్తీ చేయాలని, జువనైల్ జస్టిస్ యాక్ట్‌ను అమలు చేయాలని కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాలకు శుక్రవారం సుప్రీంకోర్టు పలు ఆదేశాలను జారీచేసింది. ఈ పోస్టుల భర్తీలో జాప్యం వల్ల పిల్లలపై ప్రభావం పడే అవకాశాలను నివారించాలని జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. జువనైల్ జస్టిస్ (సంరక్షణ, బాలల పరిరక్షణ) చట్టం, 2015ను సమర్థవంతంగా అమలు చేయాలని, ఈ వ్యవహార క్రమాన్ని రిజిస్టర్ చేయాలని అన్ని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను ఆదేశిం చింది. బాలల కోసం కోర్టులో స్నేహ పూర్వక వాతావరణాన్ని కల్పించాలని సూచించింది. బాలల హక్కు పరిరక్షణ జాతీయ, రాష్ట్ర కమిషన్లలో పోస్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేసేలా చూడాలని మహిళ, శిశు సంక్షేమ శాఖను ఆదేశించింది. సరిపడ సిబ్బంది ఉన్నారా లేదా, వారు సమర్థవంతంగా పనిచేస్తున్నారా లేదా అన్నవి చూసుకోవడంతో పాటు పిల్లలపై ప్రతికూల ప్రభావం పడకుండా చూడాలని సూచించింది. జువనైల్ జస్టిస్ చట్టం అమలును కోరుతూ దాఖలైన ఫిర్యాదును విచారించిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది.

సభలకు ఏపీ సెగ..!

- ఆగని ఎంపీల ఆందోళన
- మార్చి 5కి లోక్‌సభ వాయిదా
- ఎంపీలపై వెంకయ్య అసహనం

న్యూఢిల్లీ : ఏపీకి న్యాయం చేయాలని డిమాండు చేస్తూ ఏపీ ఎంపీలు పార్లమెంట్‌లో నాలుగోరోజూ ఆందోళన కొనసాగించారు. ఏపీ ఎంపీల నినాదాలతో ఉభయ సభలు దద్దరిల్లిపోయాయి. విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలంటూ టీడీపీ, వైసీపీ ఎంపీలు స్పీకర్ పోడియం చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నినాదాలు చేశారు. సభ్యులు శాంతించక పోవడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను మార్చి 5కు వాయిదా వేశారు. అంతకుముందు సమావేశాలు ప్రారంభంకాగానే ఏపీకి జరిగిన అన్యాయంపై సభ్యులు ఆందోళనకు దిగడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి సమావేశాలు ప్రారంభ మైనా.. పరిస్థితిలో మార్పు లేకపోవడంతో సభ మార్చి 5కు వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. కాంగ్రెస్, టీడీపీ ఎంపీల ఆందోళనతో మొదట 12 గంటలకు వాయిదా పడిన రాజ్యసభ తిరిగి ప్రారంభం కాగానే మరోసారి సభ్యులు నిరసనకు దిగారు. దీంతో సమావేశాలు మధ్యాహ్నం 2.30 గంటలకు వాయిదా పడ్డాయి. అంతకు ముందు పార్లమెంటు ఆవరణలో టీడీపీ ఎంపీలు నిరసన చేపట్టారు. గాంధీ విగ్రహం వద్ద ఎంపీలు ధర్నాకు దిగారు. వెంకటేశ్వరస్వామి పాదాల సాక్షిగా మోడీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏపీకి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విభజన హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు.

గణాసారిలా..శివప్రసాద్...!

ఈ నిరసన కార్యక్రమంలో వినూత్న వేషధారణలో ఎంపీ శివప్రసాద్ పాల్గొన్నారు. వెంకటేశ్వరస్వామి, విజయ వాడ కనకదుర్గమ్మ తనను ఆవహించారని ఆయన చెప్పారు. వెంకటేశ్వరస్వామి సన్నిధిలో మోడీ హామీలు ఇచ్చి మరిచి పోయారని.. ఇందుకు పార్లమెంట్ సాక్షిగా హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కేంద్రం లెక్కచేయడం లేదని అన్నారు. ఏపీలో కాంగ్రెస్‌కు ఎలాంటి గతిపట్టిందో.. బీజేపీకి కూడా అలాంటి పరిస్థితే వస్తుందని హెచ్చరించారు.

ఏపీ భవన్ వద్ద కాంగ్రెస్...

విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని కోరుతూ ఏపీ కాంగ్రెస్ నేతలు ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద నిరసన చేపట్టారు. ఏపీ భవన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని ఏపీకి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, ఎంపీ కేవీపీ రామచంద్రరావు, సీనియర్ నేతలు జేడీశీలం, సుబ్బరామిరెడ్డి ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెంకయ్య అసహనం...!

ఏపీకి అన్యాయంపై రాజ్యసభలో ఆందోళన చేస్తున్న ఏపీ ఎంపీలపై చైర్మన్ వెంకయ్యనాయుడు అసహనం వ్యక్తం చేశారు. ఆగ్రహంతో సస్పెండ్ చేస్తానని బెదిరిం చారు. కానీ ఎంపీలు వెనక్కి తగ్గకపోవటంతో సభను వాయిదా వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజ్యసభలో శు క్రవారమూ ఏపీ ఎంపీలు వెల్లోకి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్ర రావు, టీడీపీ ఎంపీలు సీఎం రమేష్, టీజీ వెంకటేష్ తదితరులు వెల్లోకి వెళ్లి నినాదాలు చేశారు. నలుగురు సభ్యులు వెల్లోకి రావడంతో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. తనకు జీరో అవర్, క్వశ్చన్ అవర్ సాగడమే ముఖ్యమని చైర్మన్ వెంకయ్య నాయుడు సముదాయించే ప్రయత్నం చేశారు. ఐతే ఆందోళన విరమించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తరహా నిరసనలను ప్రజలు చూడాలని తాను భావించడం లేదన్నారు. ఎంపీల వైపు కెమెరాలు తిప్పవద్దని ఆదేశించారు. ఇది పార్లమెంటు సంప్రదా యాలకు విరుద్ధమని, తన సూచనలు పాటించాలన్నారు. లేదంటే సస్పెండ్ చేయడం లేదా సభ వాయిదా వేయడం తప్ప మరోదారి లేదన్నారు.

వారికి తుపాకీతోనే బుద్ధిచెప్పాలి : యోగి

గోరఖ్‌పూర్ : ఉత్తరప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్ పై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. తుపాకీ భాష అర్థమయ్యేవారికి అదే భాషలో సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఎన్‌కౌం టర్ మరణాలు పెచ్చుపెరుగుతున్న నేపథ్యంలో యోగి వ్యాఖ్యలు ప్రాముఖ్యతను సంచరించు కున్నాయి. ప్రతి ఒక్కరికి భద్రతా హామీ అవసర మని ఆయన అభిప్రాయపడ్డారు. తుపాకీ సంస్కృతికి అలవాటుపడిన వారికి అదే రీతిలో సమాధానమివ్వడమే సరైన విధానమన్నారు. ఈ విషయంలో ఆందోళన అక్కర్లేదని యంత్రాం గానికి సూచించారు. యోగి శుక్రవారం లక్నోలో విలేకరులతో మాట్లాడారు. కాగా, గవర్నర్ రామ్ నాయక్ సంప్రదాయ ప్రసంగం సంద ర్భంగా వివిధ అంశాలపై అసెంబ్లీలో విపక్షాలు రభస సృష్టించడంపై స్పందిస్తూ 'ప్రతిపక్ష సభ్యులు పార్లమెంటు గౌరవమర్యాదలను మర్చి వ్యవహ రించారు. కాగితాలతో బంతులు చేసి విసి రారు... బూరలు వదిలారు. గవర్నర్‌ను దూషిం చారు. సమాజ్‌వాది పార్టీ సభ్యుల ఈ తుచ్ఛమైన వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని అన్నారు.

దళిత బాలిక హత్య

బాలియా (యూపీ) : ఉత్తరప్రదేశ్‌లో మరో ఘోరం చోటు చేసుకుంది. ఘాతగాదాల్లో ప్రత్యర్థులు ఎనిమిదేళ్ల బాలికను హత్య చేశారని పోలీసులు వెల్లడించారు. గురువారం సాయంత్రం గొర్రెలను కాచుకొని తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుందని ఎస్పీ అనిల్ కుమార్ వెల్లడించారు. బాధితురాలి తండ్రి ఇద్దరు బంధువులపై ఫిర్యాదు చేశాడన్నారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపామని, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లాకప్‌లో వ్యక్తి మృతి, స్టేషన్‌పై దాడి

సంబల్‌పూర్ (ఒడిశా) : పోలీసు కస్టడీలో గిరిజన వ్యక్తి అవినాష్ ముండా (22) చనిపోవడంతో, ఆగ్రహజ్వాలలు రగిలి గ్రామస్తులు స్టేషన్‌పై దాడి చేశారు. శుక్రవారం జరిగిన ఈ దాడిలో చాలా మంది పోలీసులకు గాయాలయ్యాయని, అనేక రికార్డులు తగలబెట్టారని వారు వెల్లడించారు. పోలీసుల స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలకు కూడా వారు నిప్పంటించారన్నారు. అవినాష్ లాకప్‌లో ఉరివేసుకుని మరణించాడని, దీంతో అతని కుటుంబ సభ్యులు రోడ్డుపై ధర్నానిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారన్నారు. ఈ ఘటనలో ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశామని అధికారులు వెల్లడించారు.

ఔషధ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్ కుందనపురాలోని ఔషధ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరిగి ఒకరికి గాయాలయ్యాయని శుక్రవారం పోలీసులు వెల్లడించారు. గురువారం జరిగిన ఈ ఘటనలలో అక్కడ పనిచేసే ఉద్యోగికి గాయాలయ్యాయని అగ్నిమాపకదళ ఇన్‌స్పెక్టర్ ఎన్‌కే సింగ్ మోహన్‌లాల్ తెలిపారు. అగ్నిమాపక శకటం అక్కడికి చేరుకొని అగ్నికీలకాలను అదుపులోకి తీసుకొచ్చిందన్నారు. సిలిండర్ లీకేజ్‌తో ఈ ఘటన జరిగిందని, గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు.

కుప్పకూలిన ఎంపీ : ఆసుపత్రికి తరలింపు

న్యూఢిల్లీ : రాజ్యసభ సభ్యుడు ఏవీ స్వామి పార్లమెంటు కాంప్లెక్స్‌లో కుప్ప కూలడంతో ఆయనను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. రాజ్యసభ ప్రశ్నోత్తర సమయంలో చైర్మన్ వెంకయ్యనాయుడు ఈ విషయం వెల్లడించారు. శరీరంలో షుగర్ స్థాయి తగ్గడం లేదా మరే ఇతరకారణమో తెలియదని ఆయన వివరించారు.

ఈశాన్య రైల్వేకు రూ.9,000 కోట్లు

న్యూఢిల్లీ : అత్యాధునిక సాంకేతికతతో రైల్వే సిగ్నల్ వ్యవస్థను మెరుగు పరిచేందుకు ఈశాన్య రైల్వేకు 2018-19 రూ.9,000 కోట్లను కేటా యించారు. దీంతోపాటు మరో రూ. 565 కోట్లను అదనంగా సమకూర్చ నున్నారు. యూరోపియన్ ట్రైన్ కంట్రోల్ వ్యవస్థ- 2తోపాటు ఆధునిక రేడియో వ్యవస్థను కూడా అనుసంధానిస్తారు. పాతకాలపు సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరిం చడానికి రూ. 398 కోట్లను ఉపయోగిస్తారు.

మార్చి 11న గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్ ఉప ఎన్నిక

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్ లోక్‌సభ స్థానాలకు మార్చి 11న ఎన్నికలు జరుపుతామని శుక్రవారం ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్‌ప్రసాద్ మౌర్యలు పార్లమెంటు స్థానాలకు రాజీనామా చేయడంతో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. బీహార్‌లోని అరారియా లోక్‌సభకు కూడా అదేరోజు ఉప ఎన్నిక నిర్వహిస్తా మన్నారు. ఆర్జేడీ ఎంపీ మొహ్మద్ తస్లీముద్దీన్ అకాల మృతితో ఈ ఎన్నిక జరగనుంది. ఫుల్‌పూర్ ఉప ఎన్నికల్లో బీఎస్పీ అధినేత్రి మాయావతి పోటీ చేస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

మరో 150 మంది ఆఫీసు బేరర్లపై వేటు

చెన్నై : ఆర్కేనగర్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో టీటీవీ దినకరన్ అనూహ్య విజయం సాధించడంతో అధికార ఏఐఏడీఎంకే అనేక రోజులుగా ఆఫీసు బేరర్లను బహిష్కరిస్తూనే ఉంది. ఈ క్రమంలో మరో 150 మందిని శుక్రవారం బహిష్కరిస్తూ ప్రకటన వెలువరించింది. మాజీ మంత్రి జి. సెంథమిజాన్, సీనియర్ నాయకుడు ఇళం వజుంతిలు కూడా వేటుకు గురై వారిలో ఉన్నారు. టీటీవీ దినకరన్‌కు వారు మద్దతు ఇచ్చారన్న కారణంతో వారిని తొలగించామని పార్టీ కోఆర్డినేటర్లు పన్నీర్‌సెల్వం, పళనిస్వామి వెల్లడించారు.

పాక్ కాల్పుల్లో ముగ్గురు జవాన్లకు గాయాలు

జమ్ము : భారత్ - పాక్ సరిహద్దులో నియంత్రణ రేఖవద్ద శుక్రవారం పాక్ సైన్యం విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో ముగ్గురు జవాన్లు గాయాలపాలయ్యారని అధికారులు తెలిపారు. పూంచ్ జిల్లాలో ఇంకా కాల్పులు జరుగుతున్నాయని, అధికారులు వెల్లడించారు. కృష్ణఘాటి ప్రాంతంలో రాత్రంతా కాల్పులు జరుపుతునే ఉన్నారన్నారు. గురువారం జరిగిన కాల్పుల్లో పూంచ్‌లోని కేజీ సెక్టార్‌లో 45 ఏళ్ల మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే.

ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టుల మృతి

రాయపూర్ : ఛత్తీస్‌ఘఢ్‌లోని రాజనందగోన్ జిల్లాలో మావోయిస్టు డిప్యూటీ కమాండర్, మరొక మావోయిస్టు మృతి చెందారని పోలీసులు వెల్లడించారు. శు క్రవారం భద్రతాదళాలు గాలింపు చర్యలు చేపట్టగా మావోయిస్టులు కాల్పులు జరిపారని ప్రతిగా పోలీసులు కాల్పులు జరపడంతో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారన్నారు. కాల్పులు పూర్తికాగానే ఆ ప్రాంతాన్ని పరిశీలించిన పోలీసులకు ఇద్దరి మృతదేహాలు కనిపించాయన్నారు. వారిపై రూ. 8.2లక్షల రివార్డు ఉందన్నారు.

పేలుడు కేసులో కీలక సాక్ష్యాధారాలు

చండీఘడ్ : భటిండా మౌర్ మండీ పేలుడు కేసులో కీలక సాక్ష్యాధారాలు లభ్యమయ్యాయని పంజాబ్ పోలీసులు వెల్లడించారు. గతేడాది జరిగిన ఈ పేలుడులో ఏడుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. డేరా సచ్చసౌద చీఫ్ గుర్మీత్ రామ్‌రహీం సింగ్ కుమారుడిని కాంగ్రెస్ నాయకుడు హర్మీందర్ సింగ్ జస్సీ కుమార్తె పెళ్లి చేసుకున్న నేపథ్యంలో ఈ ఘటన జరిగిందని భావిస్తున్నారు. పోలీసు అధికారులు నలుగురిని అరెస్టు చేశారు. వీరంతా కారు మెకానిక్‌లు, పెయింటర్లు వీరు కీలక సాక్ష్యాలను వెల్లడించారన్నారు.

హత్యకేసులో బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే అరెస్టు

ఘజియాబాద్ : సహిబాబాద్ నియోజక వర్గ బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ) ఎమ్మెల్యే అమర్‌పాల్ శర్మను హత్యకేసులో అరెస్టు చేశారు. ఖోడా పోలీసు స్టేషన్ పరిధిలో బీజేపీ వ్యక్తిని కుట్రతో హత్యచేశానే ఆరోపణతో ఆయనను సెప్టెంబరులో జైల్లో పెట్టారు. శర్మపై జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) ఉపయోగించి అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు. అలహాబాద్ హైకోర్టులో ఈ కేసును సవాలు చేస్తామనే ఉద్దేశ్యంతోనే ఎన్ఎస్ఏ ఉపయోగించారని, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు విమర్శించారు.

రెండు చోట్ల నుంచి మేఘాలయ సీఎం పోటీ

షిల్లాంగ్ : మేఘాలయ ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా ఫిబ్రవరి 27న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రెండు చోట్లనుంచి పోటీ చేస్తున్నారు. ఎప్పుడూ పోటీ చేసే అంపటి నుంచే కాకుండా సంగ్‌సాక్ నుంచి కూడా ఆయన పోటీచేసి వరుసగా ఐదోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోదలిచారు. పదేళ్ల నుంచి ఆరాష్ట్ర సీఎంగా ఉన్న సంగ్మా అంపటీలో త్రిముఖ పోటీలో ఉన్నారు. సంగ్‌సాంగ్‌లో మాత్రం ఏడుగురు ఎన్నికల బరిలో ఉన్నారు. రాష్ట్రంలో 374 మంది పోటీ చేస్తుండగా, వారులో 33 మంది మహిళలు ఉన్నారు.

ఆదంపూర్‌లో శీతల గాలులు

చండీఘర్ : పంజాబ్,హర్యానాల్లో శీతలగాలులు ఇంకా కొనసాగుతున్నాయి. ఆదం పూర్‌లో అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు (2.9) డిగ్రీల సెల్సియస్ నమోదైందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. భటిండా 3.5, అమృత్‌సర్ 3.8, పాటియాలలో 5.6 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. హల్వారా, పఠాన్‌కోట్‌ల్లో 5.4,5.1 డిగ్రీల సెల్సియస్ రికార్డయిందన్నారు. హర్యానాలోని హిస్సార్‌లో 3.5 డిగ్రీలు, సిర్సాలో 5.4, అంబా లాలో 8.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని అయిన చండీఘడ్‌లో శీతలగాలులు వీస్తున్నాయన్నారు.



డిగ్రీ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మహంకాళి సుబ్బారావు

విశాలాంధ్ర-ఏఎన్‌యూ : డిగ్రీ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎం.సుబ్బారావు కోరారు. ఈ మేరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో శుక్రవారం వీసీ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో డిగ్రీ విద్యార్థులకు ఏదైనా సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయితే వెంటనే సప్లిమెంటరీ పరీక్షలు రాసే అవకాశం ఉండేదని వివరించారు. ప్రస్తుతం నూతన సంస్కరణల నేపథ్యంలో సప్లిమెంటరీ పరీక్షల విధానాన్ని ఏడాది పూర్తయ్యేవరకు నిర్వహించకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థులకు సెమిస్టర్ విధానంలోనే పాత పద్ధతిలో సప్లిమెంటరీ పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తే విద్యా సంవత్సరం వృథా కాకుండా ఉంటుందన్నారు. సిలబస్‌ను విద్యా సంవత్సర ప్రారంభంలో కాకుండా మధ్యలో మార్చటం వల్ల విద్యార్థులు అసౌకర్యానికి గురై ఉత్తీర్ణతా శాతం పడిపోతుందన్నారు. యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల అఫిలియేషన్‌ను రద్దు చేయాలని కోరారు. సంబంధిత సమస్యలను తక్షణం పరిష్కరించని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ప్రత్యక్ష ఉద్యమాలకు దిగుతుందని వివరించారు. వినతిపత్రం సమర్పించినవారిలో ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎం.కిరణ్‌బాబు, నాయకులు బి.రాకేష్, వి.శివ, జె.ఫణీంద్రసింగ్, వర్సిటీ నాయకులు యం.రాజన్న, బాలు పాల్గొన్నారు.



ఉద్యోగుల దినచర్యలో క్రీడలూ భాగం కావాలి

విశాలాంధ్ర-కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల దినచర్యలో క్రీడలు ఓ భాగం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి దినేష్‌కుమార్ అన్నారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు కొనసాగనున్న 5వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో నిరంతరం ఎక్కువ పని ఒత్తిడితో విధులు నిర్వహించే రెవెన్యూశాఖ ఉద్యోగులకు ప్రత్యేక క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఉద్యోగికి తగినంత విరామ సమయం కూడా అవసరమన్నారు. రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాలు, సీసీఎల్ఏ జట్టుతో కలిపి రెండు వేల మంది ఉద్యోగులు ఈ క్రీడోత్సవాల్లో పాల్గొంటున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎక్కువ సమయం సమీక్షలతో సరిపోతోందని, సమీక్షలను తగ్గించాల్సిన అవసరముందని ప్రభుత్వానికి సూచించారు. తొలుత రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఉద్యోగులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో విజయనగరం జిల్లా ప్రథమ, కర్నూలు జిల్లా ద్వితీయ, తూర్పుగోదావరి జిల్లా తృతీయ స్థానాల్లో నిలిచాయి.

రాష్ట్రానికి కేంద్ర సహాయంపై అధ్యయనం అవసరం



విశాలాంధ్ర- రాజమహేంద్రవరం : ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో పాటుఏ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్ ఆధ్వర్యంలో అధ్యయనం చేయాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు కోరారు. తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న అశాంతికి ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. బడ్జెట్ అనేది దేశ సమగ్రతకు సంబంధించిన అంశమని, బడ్జెట్‌లో లేకుండానే పోలవరానికి, అమరావతికి నిధులిచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవా లన్నారు. బడ్జెట్‌లో అన్యాయం జరిగిందంటూ విభజన చేసిన కాంగ్రెస్‌తో పాటు తెలుగుదేశం పార్టీ నిరసనలు తెలియజేయడం విడ్డూరమన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తనను ఫోన్‌లో మందలించినట్లు వస్తున్న వార్తలు నిరాధారమన్నారు. పార్టీ విధానాలనే తాను మాట్లాడతానని స్పష్టం చేశారు. వారం రోజులపాటు తమ ఫోన్ డేటాను పరిశీలించుకోవచ్చునని పేర్కొన్నారు. తాను జాతీయవాదినని, రాష్ట్రాభివృద్ధి కోసం ఊపిరి ఉన్నంతవరకూ కృషిచేస్తానన్నారు. సమావేశంలో బీజేపీ నగర అధ్యక్షుడు బొమ్ముల దత్తు, ప్రధాన కార్యదర్శి అడబాల రామకృష్ణారావు, యెనుముల రంగబాబు, కొంతం కృష్ణ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర సాధన దిశగా ముందుకెళదాం



విశాలాంధ్ర - కర్నూలు సిటీ : స్వచ్ఛాంధ్ర సాధించే దిశలో ముందుకెళ్దామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. తొలుత పాత బస్టాండ్‌లోని మరుగుదొడ్లను పరి శీలించారు. నగరపాలక సంస్థ పరిధిలోని స్వీపింగ్ మిషన్లు, స్మార్ట్ జేసీబీలు, కంఫాక్టర్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శరవేగంగా మారుతున్న టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ క్షేత్ర స్థాయిలో పరిసరాల పరిశుభ్రతపై నిరంతరం దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీలలో స్వీపింగ్ మిషన్లు, కంఫాక్టర్స్‌ను అందజేశామన్నారు. వేస్ట్ ఎనర్జిటిక్‌ప్లాంట్స్ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి స్వీపింగ్ మిషన్లను నడిపి పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, ఎమ్మెల్యే మణిగాంధీ, మున్సిపల్ కమిషనర్ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

మిర్చి యార్డు కార్యదర్శిగా ఐఏఎస్‌ను నియమించాలి



విశాలాంధ్ర-గుంటూరు (జిల్లాపరిషత్) : గుంటూరు మిర్చియార్డు కార్యదర్శిగా ఐఏఎస్ అధికారిని నియమించాలని యార్డు కమిటీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు కోరారు. శుక్రవారం మిర్చియార్డు పాలకవర్గ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మిర్చి యార్డులో ప్రతి సంవత్సరం రూ.6వేల కోట్లకు పైగా మిర్చి లావాదేవీలు జరుగుతాయన్నారు. యార్డు కార్యకలాపాలు ఇంకా సవ్యంగా జరగడానికి ఐఏఎస్ నియామకం అవసరాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. సీజన్‌లో ఒత్తిడిని అధిగమించుటకు యార్డు బయట పార్కింగ్ చేయుటకు సీటీఆర్ఐ వారిని అనుమతి కోరాలని సమావేశంలో తీర్మానించినట్లు చెప్పారు. ఈ-నామ్ పై అవగాహన కల్పించుటకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. యార్డులో ట్రాఫిక్ నియంత్రణలో అందరూ తమ వంతు కృషిచేయాలని సూచించారు. రెండు రోజుల్లో రైతులకు మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ కొత్తూరి వెంకట్ పాల్గొన్నారు.





రాష్ట్ర ప్రయోజనాల కోసం

జల్లికట్టు ఉద్యమ స్ఫూర్తితో..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర-విశాఖపట్నం రూరల్ : రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలు తమిళనాడు జల్లికట్టు ఉద్యమస్ఫూర్తితో కలిసి ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి 23వ మహాసభల ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం పాడేరులో స్వర్గీయ బడుగు రామరాజ్యం సభా ప్రాంగణంలో భారీ బహిరంగ సభ జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఏజే. స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా రామకృష్ణ మాట్లాడుతూ చట్టసభల సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక హోదా, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్యాకేజీ ఇస్తామన్నప్పటికీ ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ప్రత్యామ్నాయ రాజకీ యాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ చిత్తశుద్ధితో పనిచేస్తుం దన్నారు. కేంద్రంలో మోడీ ప్రధాని అయిన తర్వాత అభివృద్ధి జరగకపోగా మతోన్మాదశక్తులు, అభివృద్ధి నిరోధక శక్తులు పేట్రేగిపోతున్నాయన్నారు. దళితులు, కార్మికులు, కర్షకులు, జర్నలిస్టులతోపాటు మేధావులపైనా దాడులు కొనసాగడంతో భయానక పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇటువంటి దుష్పరిణా మాలకు వ్యతిరేకంగా ప్రజాతంత్ర శక్తులన్నీ ఏకమై సమస్యలపై పోరాటానికి సమాయత్తం కావాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పరిపాలన అధ్వాన్నంగా ఉందన్నారు. 13 జిల్లాల్లోని 64 మండలాల్లో ఒక ఎకరం భూమిని కూడా గిరిజనులకు గానీ, రైతులకు గానీ ఇవ్వని చంద్రబాబు ప్రభుత్వం కోట్లాది రూపాయలు విలువచేసే వేల ఎకరాలను కార్పొరేట్‌శక్తులకు కట్టబెడుతున్నదన్నారు. రాష్ట్రంలో జన్మభూమి కమిటీల పేరుతో అవినీతి తారాస్థాయికి చేరిందన్నారు. రాజకీయాల్లో ప్రజాస్వామ్య విలువలు దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం సీపీఐ నిరంతరం కృషి చేస్తోందన్నారు. వ్యవస్థలో మార్పు వచ్చేవరకూ గిరిజనుల్లో ఆత్మస్థైర్యం నింపుతామన్నారు. బాక్సైట్ తవ్వకాలను తాత్కాలికంగా నిలిపి వేసినప్పటికీ, ఎన్నికల అనంతరం మళ్లీ బాక్సైట్ తవ్వకాలు ప్రారంభమయ్యే అవకాశముం దన్నారు. సమగ్ర విధానంతో గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం పోరాటాలు చేస్తామన్నారు. సభలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.జె. చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చలసాని రాఘవేంద్రరావు, జేవీ. ప్రభాకర్, రావు జగ్గారావు, బి.విమలమ్మ, ఎ.విమల, ఎం.పైడిరాజు, కె.భూషణం, డిసిహెచ్ రాజబాబు, రాజాన దొరబాబు, పి.సత్యనా రాయణ, దేవరకొండ మార్కండేయులు, ఎస్.విష్ణుమూర్తి, రామునాయుడు పాల్గొన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాలెపల్లి వెంకటరమణ స్వాగతం పలకగా, సీపీఐ పాడేరు మండల కార్యదర్శి జల్లి రాజబాబు వందన సమర్పణ చేశారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



విశాలాంధ్ర-భీమవరం: రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఉద్యమాన్ని నిర్మిస్తే తప్ప నిరంకుశ కేంద్ర ప్రభుత్వమెడలు వంచి ప్రత్యేక హోదా సాధించలేమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు అన్నారు. పశ్చిమగోదావరిజిల్లా భీమవరంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ, ప్రజాక్షేత్రంలోనే కేంద్ర ప్రభుత్వంతో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్‌లో రూ. 11 లక్షల కోట్లు రైతులకు ఇస్తామని చెప్పడం పెద్ద అబద్ధమని, రూ. 11లక్షల కోట్లు బ్యాంకుల ద్వారా మాత్రమే రుణాలిచ్చేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఒకవైపు రైతుల, విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్నా పాలకులకు ఏమీ పట్టడంలేదన్నారు. ఈ నెల 10,11,12 తేదీల్లో జరిగే సీపీఎం 25వ రాష్ట్ర మహాసభలు రాష్ట్రంలో జరిగే ప్రజా పోరాటాలకు దిశా నిర్దేశం చేస్తాయని అన్నారు. మహాసభల్లో అధికార టీడీపీ, ప్రతిపక్ష పార్టీల వైఖరిపై చర్చిస్తామన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 10వ తేదీన అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో మహాసభలు ప్రారంభమవుతాయన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో ప్రకాష్ కారత్, బీవీ రాఘవులు తదితర నాయకులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో మంతెన సీతారాం, బి.బలరాం తదితరులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతిలో అందరూ భాగస్వాములవుదాం



విశాలాంధ్ర-గుంటూరు (జిల్లాపరిషత్) : సంపూర్ణ గ్రామీణాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్ బి.రామాంజనేయులు పిలుపు నిచ్చారు. గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న పనులు, చేయవలసిన పనులు, 11 స్టార్ రేటింగ్ తదితర అంశాలపై శుక్రవారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో అధికారులతో సమీక్షలో ఆయన పాల్గొన్నారు. గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం 11 స్టార్ రేటింగ్ అంశాన్ని ప్రవేశపెట్టిం దన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు అందరూ భాగస్వాములు కావాలన్నారు. దేశంలోనే 100 ఉత్తమ పంచాయతీల్లో మన రాష్ట్రం నుంచే 33 పంచాయతీలు ఉన్నాయన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సమృద్ధిగా ఉపయోగించుకోవాలన్నారు. కలెక్టర్ కోన శశిధర్ మాట్లాడుతూ కుటుంబ వికాసం-సమాజ వికాసమే రాష్ట్ర ప్రభుత్వ ఆశయమన్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిని బట్టి గ్రామానికి రేటింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు గ్రామీణ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులు ప్రణాళికా బద్ధంగా పనిచేయాలన్నారు. జాబ్ కార్డుదారులందరూ ఉపాధి హామీ పనులకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. తద్వారా కుటుంబాల ఆదాయం పెరగడమే కాకుండా గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు అందించిన వారవుతారని ఆయన అన్నారు. గ్రామీణాభివృద్ధికి 11 స్టార్ ప్రణాళికలో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్, ప్రతి ఇంటికీ వంట గ్యాస్ కనెక్షన్, కుళాయి ద్వారా సురక్షిత తాగునీటి సరఫరా, శాస్త్రీయ పద్దతిలో ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామీణ రహదారులు, ప్రతి ఇంటికీ ఫైబర్ నెట్ కనెక్షన్, ప్రతి కుటుంబానికి నెలకు రూ.10 వేల అదాయం, సార్వత్రిక విద్య-విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, పోషకాహారం గురించి జిల్లా పంచాయతీ అధికారి అరుణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డ్వామా పీడీ పులి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ సీఈవో వి.నాగార్జునసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ భానువీరప్రసాద్, అధికారులు, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పట్టిన గతే బీజేపీకి..

విశాలాంధ్ర - వి.కోట : రాష్ట్రాభివృద్ధి కోసం అన్ని పార్టీలు పట్టువీడి రాజకీయాలకతీతంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర మంత్రి అమరనాథ్‌రెడ్డి అన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోసం చేస్తే కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే బీజేపీకి తప్పదని కేంద్రానికి హెచ్చరిక చేశారు. చిత్తూరు జిల్లా వి.కోటలో శుక్రవారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా కల్పిస్తామని హామీ ఇచ్చినా, తర్వాత హోదాకు సమానమైన ప్యాకేజీ ఇస్తామని నమ్మబలికారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.16వేల కోట్ల లోటులో ఉన్నట్టు కాగ్ నివేదిక ఇచ్చిన విషయాన్ని గుర్తించాలన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీజేపీ తీరు ఇలానే కొనసాగితే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సులోచనా రంగనాథ్, కిషోర్ గౌడ్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో విశాఖ ఉక్కు

- సొంత గనులు లేక సతమతం
- డిజెన్వెస్టిమెంట్ జాబితాలో విశాఖ స్టీల్‌ప్లాంట్
- స్టీల్‌ప్లాంట్ సీఎండీ పి. మధుసూదన్



విశాలాంధ్ర- విశాఖపట్నం : విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాలను తగ్గించుకొని లాభాల బాటలో పడుతుందని సీఎండీ పి. మధుసూదన్ తెలిపారు. 2017-18 సంవత్సరంలో ఉత్పత్తి, విక్రయాల ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయన్నారు. శుక్రవారం స్థానిక హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో బొగ్గు ధరలు పెరగడంతో పాటు రా మెటీరియల్ రేట్లు పెరగడం వల్ల ఉత్పత్తి ఖర్చు విపరీతంగా పెరిగిందన్నారు. బొగ్గు ధర 190 నుంచి 260 డాలర్లకు పెరగగా, ఐరన్ ఓర్ 300నుంచి 500కు పెరిగిందన్నారు. దీని వల్ల ఉత్పత్తి రేటు 1500కు పెరిగినట్లు తెలిపారు. 2016-17 సంవత్సరంలో నష్టాలను అధిగమించి రూ.400 కోట్లు ఆర్జించినట్లు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ విస్తరణ, ఆధునీకరణ పనులు సకాలంలో పూర్తి చేశామన్నారు.

దీనికి దాదాపు రూ. 16వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ డిజెన్వెస్ట్‌మెంట్ జాబితాలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉందన్నారు. 10శాతం పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ. 489 కోట్లు సమకూరుతాయని చెప్పారు. 6.3 ఎంటీపీఏ యూనిట్లను కొత్తగా నెలకొల్పడం ద్వారా ఉత్పత్తి స్థిరీకరణ, సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఉక్కు ఉత్పత్తి 94శాతం వృద్ధి నమోదు చేసుకుందన్నారు. ఉత్పత్తికి సంబంధించిన కీలక విభాగాల్లో వృద్ధి రేటు గణనీయంగా అభివృద్ధి చెందిందన్నారు. గత రెండేళ్లలో మార్కెటింగ్ రంగంలోకూడా అభివృద్ధి సాధించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పనుల్లో టెండర్లలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. అమరావతి, పోలవరం పనుల్లో విశాఖ స్టీల్ వినియోగిస్తున్నట్లు చెప్పారు. అక్కడ వినియోగిస్తున్న లాంగ్, ఫ్లాట్ స్టీల్ 20శాతం అవసరముంటుందన్నారు. ఇందులో చాలా వరకు విశాఖ స్టీల్‌నే వినియోగిస్తున్నారన్నారు. ప్రతి నెల 3వేల టన్నుల స్టీల్ వినియోగం జరుగుతుందని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో సొంతంగా లాజిస్టిక్స్ ఏర్పాటు చేసి షిప్‌మెంట్ నిర్వహిస్తున్నామన్నారు.

ముంబాయి, కొచ్చి, అహ్మదాబాద్‌లలో కోస్టల్ షిప్పింగ్ ద్వారా లావాదేవీలు చేపడుతున్నామన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో మార్కెటింగ్ బాగా జరుగుతుందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనుల కేటాయింపు రాష్ట్ర పరిధిలోకి రావడంతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. ఇతర రాష్ట్రాల్లో గనుల లీజు కోసం బిడ్డింగ్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన గనుల కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.గతంలో స్టీల్‌ప్లాంట్‌కు ఆరు ఐరన్ ఓర్ గనులు లీజుకు తీసుకున్నట్లు చెప్పారు. వాటి కాలపరిమితి పూర్తయిందని చెప్పారు. మూడు గనులు రెన్యువల్ అవుతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఆయా గనుల్లో రూ. 360 కోట్లు పెట్టుబడులు పెట్టామన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.1000కోట్లు నష్టంతో ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ నేతృత్వంలో సీఎస్ఆర్ నిధులు కూడా యథావిధిగా ఖర్చు చేస్తూ సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఏజెన్సీలో గిరిజన విద్యార్థుల కోసం రూ. 8నుంచి 10కోట్లు ఖర్చు చేసి రెసిడెన్షియల్ కాలేజి ఏర్పాటు చేస్తామన్నారు. గత ఏడాది విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీటి కొరత ఉన్న మాట వాస్తవమేనని, ఈసారి అటువంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఏలూరు కాలువకు మరమ్మతులు చేయడం ద్వారా నీరు వృథా కాకుండా జాగ్రత్త పడ్డామన్నారు. 60 రోజులకు సరిపడా నీరు ఉందన్నారు. జీవీఎంసీ అనుమతితో సీవేజ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీని వల్ల 10ఎంజీడీ నీరు ప్రతిరోజు సమకూరుతుందన్నారు. ఇక్కడ మరో రిజర్వాయర్ నిర్మాణం కూడా చేపడుతున్నట్లు చెప్పారు. పోలవరం నిర్మాణం చేపడితే ఇబ్బందులన్నీ తొలగిపోతాయన్నారు.స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు 50శాతం ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు జరగలేదని, కొన్ని అవస్థలు మాత్రం ఉన్నాయని ఆయన అంగీకరించారు. పరీక్షల నిర్వహణ ఇతర ఏజెన్సీలకు అప్పగించడం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ఇకపై ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) పి. మహాపాత్రో, డైరెక్టర్ కమర్షియల్ ప్రణయ్‌రాయ్ చౌదరి పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో 2వ సెమిస్టర్‌కు

1,280 మంది విద్యార్థులపై అనర్హత వేటు

విశాలాంధ్ర - నూజివీడు టౌన్ : కృష్ణాజిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో హాజరు శాతం తక్కువగా ఉండటంతో 1280 మంది విద్యార్థులను 2వ సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యేందుకు అనర్హులుగా ప్రకటిస్తూ ఆర్జీయూ కేటీ అధికారులు నిర్ణయం తీసు కున్నారు.వివరాల్లోకి వెళితే నూజివీడు ట్రిపుల్ ఐటీలో మొత్తం 1280 మంది విద్యార్థులపై వివిధ కారణాల చేత హాజరు శాతం తగ్గటంతో 2వ సెమిస్టర్ పరీక్షలకు హాజరు కాకుండా అనర్హత వేటు వేశారు. అయితే విద్యార్థులు అందరూ ఒక్కొక్కరూ ఒక్కొక్క సబ్జెక్ట్‌లో మాత్రమే హాజరు శాతం తగ్గటంతో ఆయా సబ్జెక్టులకు సంబంధించి పరీక్ష రాసే అవకాశం లేకుండా పోయింది. విద్యార్థుల్లో కొంత మంది పండుగలకు ఇతర సందర్భాల్లో వెళ్ళి నిర్దేశించిన సమయంలో రాకపోవడం, మరికొందరు ఇటీవల ట్రిపుల్ ఐటీలో తరచూ జరిగిన ఘటనల కారణంగా ఇంటికి వెళ్ళి తిరిగి రాకపోవడం వంటి కారణాలతో హాజరు శాతం తగ్గింది. అయితే ట్రిపుల్ ఐటీ అధికారులు మాత్రం విద్యార్థులందరికీ గ్రూపు మెసేజ్‌ల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించినప్పటికీ తరగతులకు హాజరు కాలేకపో యారని, ఈ కారణంగానే వారు సెమిస్టర్ పరీక్షలకు హాజరు కాలేకపోతున్నారని చెబుతున్నారు.

వైసీపీది డబుల్ గేమ్ : డొక్కా

విశాలాంధ్ర అమరావతి: బడ్జెట్ కేటాయింపులు, విభజన హామీల సాధన కోసం టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో పోరాడుతుంటే వైసీపీ ఎంపీలు వ్యక్తిగత ప్రయోజనాల కోసమే పాకులాడుతున్నారని టీడీపీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవర ప్రసాద్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన రాష్ట్ర టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేసుల మాఫీ కోసం వైసీపీ డబుల్ గేమ్ ఆడుతోందని, ఇప్పటి వరకు కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై వైయస్.జగన్ ఎందుకు ప్రశ్నించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఓ వైపు కేంద్ర బడ్జెట్ బాగుందని వైసీపీ ఎంపీ విజయ్‌సాయిరెడ్డి పొగుడుతున్నారని, జగన్ మాత్రం నోరు మెదపలేదన్నారు. బడ్జెట్‌లో ఏపీకి ఎంతో చేశామని బీజేపీ నేతలు మాట్లాడం విడ్డూరంగా ఉందని, బెంగళూరు మెట్రో రైలు కోసం వేలకోట్లు కేటాయించి ఏపీకి నామ మాత్రపు కేటాయింపులు చేయటం అన్యాయం కాదా అని డొక్కా ప్రశ్నించారు. కర్నాటక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బెంగళూరుకు వేలకోట్లు కేటాయించినట్లుగా అర్థమవుతోందని, రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్‌కు ఖర్చుచేసిన 3500 కోట్లు కేంద్రం ఇంతవరకు చెల్లించలేదని ఇవన్నీ తెలిసి బీజేపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ప్రజలు విజ్ఞులని, అన్ని గమనిస్తున్నారని, ఇదే వైఖరి అవలంభిస్తే బీజేపీకి గడ్డుకాలం ఎదుర్కోకతప్పదని మాణిక్యవరప్రసాద్ హెచ్చరించారు.

కేంద్ర వైఖరికి వ్యతిరేకంగా

సచివాలయ ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర అమరావతి : కేంద్ర ప్రభుత్వం ఏపీ పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా శుక్రవారం సచివాలయ ఉద్యోగులు ధర్నా చేశారు. మూడవ బ్లాక్ ఎదుట సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడుమురళీకృష్ణ నాయకత్వంలో ఉద్యోగులు విభజన హామీలు అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించారు. విభజన హామీల కోసం పార్లమెంటులో ఎంపీలు పోరాడుతున్నారని, హామీలు నెరవేర్చకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని, అన్ని ఉద్యోగ సంఘాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తెస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు ప్రకటించారు.





గుండ్లకమ్మ వాగులో ..

విద్యార్థుల గల్లంతు

ముగ్గురు మృతి - ఒకరు సురక్షితం

విశాలాంధ్ర-వినుకొండ/నూజెండ్ల : గుంటూరు జిల్లా వినుకొండ మండలంలోని గుండ్లకమ్మ వాగులో శుక్రవారం నీట మునిగి ముగ్గురు ఇంటర్ విద్యార్థులు దుర్మరణం చెందగా, మరో విద్యార్థి క్షేమంగా బయటపడ్డాడు. వినుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సయ్యద్ నాగూర్‌వలి (18) (ఏనుగుపాలెం), కొక్కెర నాగేశ్వరావు (17)(కనమర్లపూడి), తమ్మిశెట్టి కోటేశ్వరావు (17)(చాత్రగడ్డపాడు) మృతి చెందారు. స్థానిక సాయి డిగ్రీ కాలేజీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న ముక్కనుళ్ళ అనేషర్‌రెడ్డి(18)(ఉప్పలపాడు) క్షేమంగా బయటపడ్డాడు. ఈ నలుగురు మంచి స్నేహితులు. ఈత కొడుతుండగా నదిలో గోతులు ఉండటంతో మునిగి మృతి చెందారు.కాగా అన్వేష్ రెడ్డి మునిగి బయటకు రాగా ఆ ప్రాంతంలోని నక్కా నాగిరెడ్డి అనే వృద్ధుడు కర్ర అందించ డంతో అన్వేష్‌రెడ్డి బ్రతికి బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది, పోలీస్ అధికారులు, గజ ఈతగాళ్ళతో ముగ్గురి మృతదేహాలను వెలికి తీసారు. కాగా ప్రమాదం నుంచి బయటపడ్డ అనేష్‌రెడ్డి మాత్రం ఆప్రాంతంలో కనబడలేదు. మృతదేహాలవద్ద తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. నీటికోసం ప్రొక్రేన్లతో నదిలో లోతుగా గోతులు తీసిన కారణంగా విద్యార్థులు ఆగోతుల్లో పడి మృతి చెందినట్లు తెలుస్తోంది. వైసీపీ నేత బొల్లా బ్రహ్మనాయుడు ఘటనా స్థలంలో బాధిత కుటుంబాలను ఓదార్చి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

దుబాయ్ నుంచి

విజయవాడకు చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దుబాయ్ పర్యటనను ముగించుకొని శుక్రవారం ఉదయం విజయవాడ చేరుకున్నారు. దుబాయ్ నుంచి నేరుగా హైదరాబాద్ వచ్చిన ఆయన అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి రాగా టీడీపీ నాయకులు ఆయన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఉండవల్లిలోని నివాసానికి చేరుకొని ఢిల్లీలో ఉన్న ఎంపీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లోక్‌సభ, రాజ్యసభలో స్పష్టమైన ప్రకటన వచ్చే వరకూ ఆందోళన కొనసాగించాలని, వెనక్కు ఏమాత్రం తగ్గాల్సిన పనిలేదని దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ సాయంత్రం రాజ్యసభలో చేసిన ప్రకటనలో కొత్తదనం లేకపోవడంతో ఎంపీలు ఫోన్‌లో చంద్రబాబుకు వివరించినట్లు సమాచారం. లోక్‌సభ, రాజ్యసభలు వాయిదా పడడంతో తదుపరి వ్యూహంపై సమావేశం నిర్వహిస్తానని, అందరూ అందుబాటులో ఉండాలని చంద్రబాబు ఎంపీలను కోరారు.

రాష్ట్రం, ఢిల్లీలో..

ఒకే గొంతు వినిపించాలి



- 18న విజయవాడలో ప్రత్యేక హోదా సాధన సమితి సమావేశం
- హామీల అమలుకోసం బీజేపీ నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విశాఖపట్నం : విభజన సమస్యలు పరిష్కారం కావాలంటే రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఢిల్లీలోనూ, రాష్ట్రంలోనూ ఒకే గొంతు వినిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఉదయం విశాఖలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ తప్ప అన్ని పార్టీలూ ఈ నెల 8న జరిగిన బంద్‌లో పాల్గొన్నాయన్నారు. బీజేపీ రాష్ట్ర నేతలు బంద్‌లు, ధర్నాలు కాకపోయినా ప్రధాని, అమిత్‌షాలపై ఒత్తిడి పెంచాలన్నారు. బీజేపీ అధ్యక్షుడిగా కాకపోతే ఎంపీగా అయినా హరిబాబు ఉద్యమంలోకి రావాలన్నారు. అప్పుడే ప్రత్యేకహోదా, విభజన హామీల అమలుకు కేంద్రం నిధులు విడుదల చేస్తుందన్నారు. ఈ నెల 18 న విజయవాడలో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. జనసేన తలపెట్టిన జేఏసీని కలుపుకుని పోరాడతామన్నారు. ప్రత్యేక హోదాకు బదులు ప్యాకేజీ ఇస్తామన్న కేంద్రం మాటలను ఇంతకాలం నమ్మిన రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికి జ్ఞానోదయం అయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్నారు. పార్లమెంటులో ప్రధాని మోదీ చెత్త ప్రసంగం చేశారన్నారు. విభజన గాయాలను రేపడం, కాంగ్రెస్‌ను తిట్టిపోయడానికే పరిమితమయ్యారన్నారు. అరుణ్ జైట్లీ కూడా స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. రాష్ట్రానికి చెందిన అన్ని రాజకీయ పార్టీలు వేర్వేరుగా పోరాడుతున్నాయన్నారు. అలా కాకుండా రాష్ట్రానికి చెందిన 25మంది లోక్‌సభ, 11 మంది రాజ్యసభ సభ్యులు ప్రధానమంత్రి మోదీ ముందు నిరసన తెలపాలి తప్ప గాంధీ బొమ్మ వద్ద ప్లకార్డులు పట్టుకుంటే సమస్యలకు పరిష్కారం దొరకదన్నారు. నాలుగేళ్లుగా జరిగిన అన్యాయానికి రాష్ట్ర ప్రభుత్వం, టీడీపీ వైఫల్యమే కారణమని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. కేంద్ర మంత్రి పదవుల నుండి టీడీపీ తప్పుకుంటే మంచిదేనన్నారు. ఒకరిని మరొకరు విమర్శించకుండా అంతా కలిసి పోరాడితే ఫలితముంటుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పీజే చంద్రశేఖర్, విశాఖ జిల్లా కార్యదర్శి ఎజె స్టాలిన్ పాల్గొన్నారు.



కొఠియాలో

ఒడిశా ఉన్నతాధికారుల పర్యటన

విశాలాంధ్ర - సాలూరు రూరల్: ఏపీ- ఒడిశా ఏవోబీ సరిహద్దు గ్రామమైన కొఠియా గ్రామాల్లో ఒడిశా అధికారులు పర్యటించారు. కొఠియా గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, గిరిజనులను ఒడిశా ప్రభుత్వం వైపు ఆసక్తి కనబరిచేలా చర్యలు చేపడుతున్నారు. జనవరి 9న జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ గంజాయిభద్రలో జన్మభూమి - మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. దీనితో ఉలిక్కిపడ్డ ఒడిశా ప్రభుత్వం కొఠియా గ్రామాలకు ప్రభుత్వ అధికారులను, ప్రజాప్రతినిధులను పంపి, ఒడిశా ప్రభుత్వంపై మక్కువ కనపరిచేలా ప్రజలను చైతన్య పరుస్తున్నారు. కొద్దిరోజుల క్రితం అఖిలపక్షం ఆధ్వర్యంలో ఒడిశా ప్రజాప్రతినిధులు కొఠియా గ్రామాల్లో పర్యటించారు. శుక్రవారం కొరాపుట్, బొలంగీర్, కలహండీ జిల్లాల అభివృద్ధి కమిటీ కమిషనర్ సృత్యాప్రకాష్ ఠాకూర్, ఐజీ సంజయ్‌పాండే, అదనపు కార్యదర్శి అశోక్‌నాయక్, జిల్లా కలెక్టర్ సుదర్శన్ చక్రవర్తి, సబ్ కలక్టర్ కృషిబాత్ రౌత్‌తో పాటు ఎంఎల్‌ఏ ప్రఫూల్ కుమార్ ఫంగీ కొఠియా గ్రామాల్లో పర్యటించి, గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఎగువశెంబి గ్రామంలో ఆధార్ కార్డుల జారీకి చర్యలు తప్ప అభివృద్ధి, ఇతర కార్యక్రమాలు చేయదని, దీనిని కొఠియా గ్రామస్తులు తెలుసుకోవాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

23 రకాల పంటలకు కనీస మద్దతు ధర

నీతి ఆయోగ్ సభ్యులు రమేశ్ చంద్

విశాలాంధ్ర అమరావతి : దేశవ్యాప్తంగా 83శాతం విస్తీర్ణంలో పండే 23 రకాల పంటలకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను ప్రకటించి అమలు చేస్తోందని నీతి ఆయోగ్ సభ్యులు ప్రొఫెసర్ రమేశ్ చంద్ చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అమలు చేస్తున్న జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయ పరిస్థితులను పరిశీలించేందుకు వచ్చిన ఆయన శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయం, టెక్నాలజీ రంగాల్లో దేశంలోని మిగతా రాష్ట్రాలకంటే ముందుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో అనేక ఉత్తమ విధానాలను అమలు చేస్తున్నారని, కనీస మద్దతు ధర అమలుతో రైతులకు ఎంతగానో ప్రయోజనం కలుగుతోందన్నారు. రైతు ఆదాయాన్ని పెంచేందుకు కేంద్రం బడ్జెట్లో అనేక పథకాలను ప్రవేశపెట్టి, పంట పెట్టుబడులకు అనుగుణంగా ధరల స్థిరీకరణకు కూడా అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఫసల్ బీమా యోజన ద్వారా రైతులకు బరోసా కల్పిస్తామని, కేంద్ర ఆహార శుద్ధి సంస్థ వద్ద పెద్ద ఎత్తున నిధులు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకొని పంటలను నిల్వ చేసుకునేందుకు అవసరమైన కోల్డు స్టోరేజీలు, గిడ్డంగులు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రైతులు ముందుకు రావాలని రమేశ్ చంద్ కోరారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున మైక్రో ఇరిగేషన్ చర్యలు తీసుకోవడంతో పాటు రైతులను పంటల మార్పిడి విధానానికి ప్రోత్సహించడం మంచి పరిణామమన్నారు. వ్యవసాయంతోపాటు ఉద్యానవన పంటల ప్రోత్సాహానికి పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటే రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏవిధమైన సూచనలు, సలహాలను అందిస్తారని విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ రైతులు పండించిన పంటలకు తగిన ధరలను కల్పించడంతోపాటు, పంటల బీమా కల్పించి ఆదాయాన్ని పెంపొందించే చర్యలు తీసుకోగలిగితే రైతు ఆత్మహత్యలను నివారించవచ్చున్నారు. ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ, రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను, రాయితీలను ప్రకటించిందన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు టి.విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2016-17 ఏడాదిలో 40,656 మంది రైతులను జీరో బేస్డ్ ప్రకృతి వ్యవసాయ సాగు చేపట్టేందుకు 704 కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేపట్టిన రెండవ ఏడాదిగా ఈ ఏడాది 334 మండలాల్లోని 974 గ్రామాల్లో 401 క్లస్టర్లలో 1,63,100 మంది రైతులను ప్రకృతి వ్యవసాయం లోకి తీసుకు వచ్చామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరిజవహర్ లాల్ పాల్గొన్నారు.

ఆంధ్రులకు సంజాయిషీ ఇవ్వండి : జవహార్



విశాలాంధ్ర -అమరావతి : కేంద్ర ప్రభుత్వ విధానంతో ఏపీలోని ఐదు కోట్ల ప్రజలు ఆవేదనతో ఉన్నారని వారికి సంజాయిషీ ఇవ్వాలని మంత్రి జవహార్ కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర విభజన తర్వాత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అదనపు నిధులు కేటాయించక పోవటం శోచనీయమని ఎక్సైజ్ శాఖ మంత్రి కె.ఎస్.జవహార్ వాపోయారు. దీనిపై అమరావతి సచివాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, రాష్ట్రం ఇచ్చిన నివేదికలకు కేంద్రం ప్రకటించిన నిధులకు ఏమాత్రం పొంతన లేదని, ముఖ్యమంత్రి 29 సార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానిని, మంత్రులను కలిసి నివేదికలు ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇప్పటివరకు కేంద్రం 5 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినా మిత్ర ధర్మంతో ఓపికగా ఉన్నామని, మెట్రోరైలు, విశాఖ రైల్వే జోన్, పెట్రో కారిడార్, అమరావతి నుంచి రాష్ట్ర రహదారులకు కనెక్టివిటీ రోడ్డులు లేకపోవటం బాధాకరమన్నారు. ఎంపీలకు రాష్ట్ర వ్యాప్తంగా సంఘీభావం ప్రకటించటం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు.

మూడోసారి అదే పాట

- ఏపీ విభజన హామీలు అమలు చేస్తాం...
- రెవెన్యూలోటును భర్తీ చేస్తాం.. పోలవరం, రాజధానికి నిధులు ఇచ్చాం
- పొల్లు పోకుండా పాఠం అప్పజెప్పిన కేంద్ర ఆర్థిక మంత్రి

విశాలాంధ్ర-న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి ముచ్చటగా మూడోసారి పార్లమెంటులో పాత పాటే పాడారు. రాజ్యసభలో రాత్రి 7గంటలకు వరకు హైడ్రామా నడిచింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆంధ్రప్రదేశ్‌కు వరాలు ప్రకటిస్తారన్న వార్తలు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా రాజ్యసభలో అందరూ సైలెంట్‌గా ఉండాలని ఆర్థికమంత్రి ఎదో ప్రకటన చేస్తున్నారని చెప్పటంతో అప్పటి వరకు వెల్‌లో ఉన్న ఏపి ఎంపీలు రాజ్యసభ ఛైర్మన్ మాటకు గౌరవం ఇచ్చి వాళ్ళ సీట్లలోకి వెళ్లి కూర్చొన్నారు. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఏపీకి ఇచ్చిన విభజన హామీలను నెరవేర్చుతున్నామని జైట్లీ పేర్కొన్నారు. విభజన సమయంలో అధిక ఆదాయాన్ని తెలంగాణ పొందిందని, ఏపి నష్టపోయిన మాట వాస్తవమేనన్నారు. ఏపిలో రెవిన్యూ లోటును భర్తీ చేస్తామని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు, రాజధానికి నిధులు ఇచ్చామని జైట్లీ చెప్పారు. విభజన సమయంలో ఏపీకి నష్టం జరిగిన విద్యాసంస్థలను తిరిగి ఏర్పాటు చేస్తున్నామన్నారు. విశాఖపట్నం రైల్వేజోన్, స్టీల్ ప్లాంటు, దుగరాజ పట్నం అంశాలకు సంబంధించి ఆయా శాఖలు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు.

2014-15 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు రూ.3979కోట్లు సాయం చేశామని ఆయన చెప్పారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుకు ప్రయత్నం జరుగుతుందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కూడా కేంద్రం నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఇచ్చిన షాక్‌కు టీడీపీ, కాంగ్రెస్, వైకాపా ఎంపీలు కంగుతిన్నారు. ఈ ఎంపీలంతా తేరుకునే లోపే అరుణ్ జైట్లీ రాజ్యసభ నుంచి చల్లగా జారుకున్నారు. ఎంపీలంతా లబోదిబో మంటూ పార్లమెంటు బయట విజయ్‌చౌక్ వద్ద ఉన్న మీడియా పాయింట్‌కు వచ్చి తమ ఆవేదన వెళ్లగక్కారు. కేంద్రానికి తగిన గుణపాఠం చెబుతామని ఏపీ ఎంపీలు హెచ్చరించారు. వైసీపీ మాత్రం కేంద్ర మంత్రి సుజనా చౌదరి రాజీనామా చేసి ఆందోళన చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన మొదటి దఫా సమావేశాలు

- లోక్‌సభ మార్చి 5కి వాయిదా
- టీడీపీ, వైసీపీ సభ్యుల నిరసన



న్యూఢిల్లీ : లోక్‌సభ బడ్జెట్ మొదటిదఫా సమావేశాలు శుక్రవారం ముగిసింది. దాదాపు నెలరోజుల విరామం తరువాత సభ తిరిగి సమావేశమవుతుంది. ఈ నెల 1వ తేదీన ప్రవేశపెట్టిన 2018-19 సంవత్సరానికి ఆర్థిక బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ, రాష్ట్రాన్ని మరింత కేంద్ర సహాయాన్ని అందించాలని డిమాండు చేస్తూ ఏపీకి చెందిన సభ్యుల తీవ్ర నిరసనల మధ్య సభ వాయిదాపడింది. నెల రోజుల విరామం అనంతరం లోక్‌సభ మార్చి 5వ తేదీన తిరిగి సమావేశమవుతుంది. పాలక ఎన్డీయే భాగస్వామి టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యులు నేడు కూడా జీరో అవర్‌లో తమ నిరసనను తెలిపారు. ఉదయం ప్రశ్నోత్తరాల కోసం సభ సమావేశమైనప్పుడు సభ్యుల నుంచి నిరసన వ్యక్తం కావడంతో మొదట వాయిదాపడింది. తిరిగి సమావేశమైన తరువాత కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను వాయిదావేశారు. సభ తిరిగి మార్చి 5న సమావేశమవుతుంది. నేటి వాయిదాతో బడ్జెట్ మొదటి దఫా సమావేశాలు ముగిసినట్లైంది. శుక్రవారం సభ ప్రారంభంకాగానే టీడీపీ, వైఎస్సార్‌సీపీకి చెందిన దాదాపు 15 మంది సభ్యులు ప్లకార్డులను ప్రదర్శించి, నినాదాలు చేశారు. కాంగ్రెస్ సభ్యులు లేచినిలబడి రాఫెల్ యుద్ధవిమానాల ఒప్పందంపై ప్రభుత్వ స్పందన వెల్లడించాలని డిమాండు చేశారు. వారు కూడా ప్లకార్డులను ప్రదర్శించారు. రోజుకొక వేషంలో వచ్చి నిరసన తెలుపుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్న టీడీపీ ఎంపీ ఎన్. శివప్రసాద్ నేడు నలుపు, గోధుమ రంగు వేసిన పొడవాటి వెంట్రుకలతో కూడిన విగ్‌ని ధరించి వచ్చారు. సభ వాయిదాపడిన వెనువెంటనే కొంత మంది టీడీపీ సభ్యులు సభలో కొంతసేపు బీజేపీ సీనియర్ నాయకులు ఎల్‌కే అద్వానీతో చర్చించడం కనిపించింది. బడ్జెట్ మొదటి దఫా సమావేశాలు రాష్ట్రపతి ప్రసంగంతో జనవరి 29న ప్రారంభమయ్యాయి. రెండో దఫా సమావేశాలు మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి.

పథకాల తీరేం బాగలేదు..

కేంద్ర సర్కారుకు బీజేపీ ఎంపీ ఝలక్



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి మోడీ నేతృత్వంలో దేశంలో ప్రవేశపెట్టిన పథకాలు అమలు తీరు సరిగా లేదంటూ సాక్షాత్తూ బీజేపీ ఎంపీ అనూప్ మిశ్రా విమర్శించారంటే కేంద్రం పాలన ఏ విధంగా ఉన్నదో స్పష్టమవుతున్నది. పథకాల అమలు సక్రమంగా జరిగినప్పుడే సామాన్య ప్రజలు లబ్ధి పొందు తారని ఆయన అన్నారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ఎన్నో మంచి పథకాలను తీసుకొ స్తున్నా ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. పథకాల అమలులో ఎనలేని నిర్లక్ష్యం జరుగుతున్నదని ఆరోపించారు. అంతేకాక, ప్రభుత్వం ఏ పథకాన్ని తీసుకొచ్చినా దానికి సంబంధించి ఓ మంత్రి బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఎంపీలాడ్స్(మెంబర్స్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్) నిధులు మూడేండ్లుగా అందుబాటులో లేవని, దీనికి బాధ్యత వహించేదెవరో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. తన సొంత జిల్లా(మొరీనా)లో 703 గ్రామ పంచాయతీలు ఉండగా.. మరుగుదొడ్లు పూర్తిగా కలిగి ఉన్నవి 133 మాత్రమేనన్నారు. పథకాల అమలుపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అనూప్ తెలిపారు. అనూప్‌కుమార్ మధ్యప్రదేశ్‌లోని మొరీనా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

కర్ణాటకలో పట్టుబడ్డ ఉగ్రవాదికి ఏడేళ్ల శిక్ష

బెంగళూరు : లష్కరే తోయిబా (ఎల్ఈటీ) కోసం ఆర్థిక లావాదేవీలు జరిపిన ఓ వ్యక్తి కర్ణాటకలో పట్టుబడ్డారు. అతడికి స్థానిక కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షను ఖరారు చేసింది. కర్ణాటక నుంచి ఉగ్ర కార్యాకలాపాలను కొనసాగిస్తున్న బిలాల్ అహ్మద్ కుటా అలియాస్ ఇమ్రాన్ జలాల్‌కు కోర్టు రూ.50వేల జరిమానా విధించినట్టు అధికారులు శుక్రవారం చెప్పారు. ఈ కేసును విచారించిన ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు జడ్జి జస్టిస్ శివకుమార్ అమరాన్నవర్ గురువారం తీర్పును వెలువరించారు. ఈ కేసు 2007 నాటికి సంబంధించినది. నాడు బెంగళూ రులో బస్సు దిగుతూ ఓ ఉగ్రవాది కర్ణాటక పోలీసులకు చిక్కాడు. అతడి వద్ద నుంచి ఏకే సిరీస్ రైఫిల్, 200 బులెట్లు, ఐదు చేతిగ్రనేడ్లు, శాటిలైట్ ఫోన్ లభ్యమయ్యాయి. ఇది 2007, జనవరిలో జరిగింది. కేంద్రప్రభుత్వంపై యుద్ధం ప్రకటించేందుకు అతడు మారణాయుధులతో వచ్చినట్టు ఆరోపణలున్నాయి. 2001 నుంచి ఉగ్రకార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు నిందితుడిపై 2009లో పీఎంఎల్ఏ చట్టం కింద క్రిమినల్ కేసు నమోదైందని అధికారులు తెలిపారు. ఈడీ అధికారులు అతడి వద్ద నుంచి రూ.34,830 నగదును స్వాధీనం చేసుకు న్నట్టు వెల్లడించారు. ఇది పీఎంఎల్ఏ కింద దేశంలో నమోదైన నాల్గో కేసు అని అన్నారు.

జూడాలకు రూ.32కోట్ల బకాయి

- రెండేళ్ల నుంచి నిలిచిన ఉపకార వేతనం
- రివ్యూలో జాప్యం
- 13వరకూ ప్రభుత్వానికి డెడ్‌లైన్
- 14 నుంచి సమ్మె కొనసాగింపునకు జూడాల సిద్ధం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ జూనియర్ డాక్టర్ల(జూడా) ఉపకార వేతనం చెల్లింపుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.రెండేళ్ల నుంచి దాదాపు జూడాలకు రావాల్సిన రూ.32కోట్ల(15శాతం పెంపుదల) ఉపకార వేతనం నిలిచిపోయింది.ఇంత పెద్ద మొత్తంలో బకాయి పెండింగ్ పడటంతో జూడాలకు నష్టం వాటిల్లుతోంది. అటు సమస్యల పరిష్కారంలోనూ ప్రభుత్వం మౌనంగా వుంటోంది. 2016, 2017 విద్యా సంవత్సరాల నుంచి జూడాల ఉపకార వేతనాన్ని పెంచలేదు.జూనియర్ వైద్యులకు ప్రభుత్వానికి ఉన్న ఒప్పందం ఆధారంగా 2016 నుంచి ఉపకార వేతనాలు ప్రస్తుత ఆర్థిక కొలమానానికి అనుగుణంగా పెంచాలి. ప్రతి రెండేళ్లకోసారి ఉపకార వేతనం 15శాతం చొప్పున(హైక్) పెంచే దిశగా 2009లో ప్రభుత్వమూ, జూడాల మధ్య ఓ ఒప్పందం కుదిరింది. రెండేళ్ల నుంచి పెండింగ్‌లో వున్న రూ.32కోట్ల ఉపకార వేతనాల్ని విడుదల చేయాలంటూ జూడాల సమ్మె నోటీసులో మొదటి డిమాండుగా పొందుపర్చారు. 2015లో ఉపకార వేతనంపై సమీక్షించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎంబీబీఎస్ ఫస్టు ఇయర్ విద్యార్థులకు రూ.23,805 చొప్పున ఉపకార వేతనం ఇస్తోంది. సీనియర్ రెసిడెంట్లకు ఉపకార వేతనాల పెంపుపై స్పష్టత లేదు.

వైద్య డిగ్రీల రిజిస్ట్రేషన్లలో జాప్యం : ఎంబీబీఎస్, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదిపాటు పనిచేయాలనే నిబంధన వుంది.మిగిలిన రాష్ట్రాల్లో ఈ నిబంధన లేదని జూడాలు పేర్కొంటున్నారు.పీజీ పూర్తయిన అభ్యర్థులు సీనియర్ రెసిడెంట్‌గా ఏడాదిపాటు పనిచేస్తేనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత వస్తుందని ఏంసీఐ కొత్త నిబంధన విధించింది.దీంతో ప్రభుత్వ నిబంధనల ఆధారంగా పీజీ పూర్తయిన విద్యార్థులు ఏడాదిపాటు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసినప్పటికీ..డిగ్రీల రిజిస్ట్రేషన్లు చేయట్లేదు.ఎంబీబీఎస్ అభ్యర్థులకూ ఇదే పరిస్థితి నెలకొంది.విజయవాడ ఏపీ మెడికల్ కౌన్సిల్ (ఏపీఎంసీ) కార్యాలయం అధికారులు వివిధ కారణాలతో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేస్తున్నారని అభ్యర్థులు వాపోతున్నారు.2010 బ్యాచ్ నుంచి 2012వరకూ దాదాపు 5వేల మంది ఎంబీబీఎస్ డిగ్రీలు నమోదవ్వలేదు.రిజిస్ట్రేషన్లు లేని డిగ్రీలతో వారంతా అసౌకర్యానికి గురవుతున్నారు. తెలంగాణా రాష్ట్రంలో ఎలాంటి నిబంధనలు లేకుండా రిజిస్ట్రేషన్లు యథాతథంగా నిర్వహిస్తున్నారు.డిగ్రీలు పూర్తిచేసిన వైద్యవిద్యార్థులకు వెంటనే ఉపాధి లభిస్తోంది. ఇదే పద్ధతిని ఆంధ్రాలోనూ అమలు చేయాలనే డిమాండును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఏపీ జూడా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బీ.రవి పేర్కొన్నారు.ప్రభుత్వం దృష్టికి తాము నాలుగు డిమాండ్లను తీసుకెళ్లామని వివరించారు.ఇందులో రెండో డిమాండుపైనే సగం వరకూ ప్రభుత్వం స్పందించిందన్నారు. 13వ తేదీలోగా తమ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండు చేశారు.లేకుంటే 14 నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించారు.

2016 నుంచి నిలిచిన ఉపకార వేతనాల పెంపుదల : ఏపీ జూనియర్ వైద్యుల ఉపకార వేతనాన్ని 2016 నుంచి పెంచలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 11 జనవరి 2009న హౌస్ సర్జన్లు, పీజీ డిగ్రీ, డిప్లొమో వైద్య విద్యార్థులకు ఉపకార ఉపకార వేతనాన్ని పెంపుదల చేశారు. అనంతరం 1జనవరి 2010, జనవరి 2012, జనవరి 2014లో పెంపుదల చేశారు. జనవరి 1 2016 నుంచి 2018 వరకూ ఉపకార చేతనాలపై పెంచలేదు. 1 జనవరి 2014 నుంచి 1జనవరి 2016 వరకూ ఉపకార వేతనాల్ని ప్రభుత్వం సమీక్షించి పెంపుదల చేయాల్సిన అవసరముంది.

విజయవాడ
శనివారం 10
ఫిబ్రవరి 2018

విశాలాంధ్ర

క్రీడలు



కన్నుల పండువగా వింటర్ ఒలింపిక్స్

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా) :

ఎముకలు కొరికే చలిలో దక్షిణకొరియాలోని ప్యాంగ్ చాంగ్‌లో శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభమయ్యాయి. ప్యాంగ్‌చాంగ్ ఒలింపిక్ స్టేడియంలో కళాకారులు ప్రత్యేక ప్రదర్శనలు, బాణసంచా వెలుగుల మధ్య వింటర్ ఒలింపిక్స్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్ జే యిన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొత్తం 92 దేశాల నుంచి జట్లు ఈ ఒలింపిక్స్‌లో పోటీపడుతున్నాయి. ప్రతి దేశానికి చెందిన జట్టు ఆటగాళ్లు వేడుకల్లో పాల్గొన్నారు. తమ జాతీయ పతాకాన్ని చేత పట్టుకుని రెట్టించిన ఉత్సాహంతో క్రీడాకారులు స్టేడియంలో సందడి చేశారు. స్కీయింగ్, స్కేటింగ్, లుజ్, ఐస్ హాకీ సహా 15 క్రీడల్లో 102 ఈవెంట్లలో నిర్వాహకులు పోటీలు నిర్వహించనున్నారు. భారత్ నుంచి ఇద్దరు క్రీడాకారులు శివ్‌కేశవన్, జగదీశ్ మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నెల 25 వరకు వింటర్ ఒలింపిక్స్ జరగనున్నాయి.





ఐసీసీలోకి ఇంద్రనూయి

ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా నియామకం

దుబాయ్:

ప్రపంచంలో అత్యంత శక్తిమంత మహిళల్లో ఒకరిగా పేరొందిన ఇంద్రనూయి ఇప్పటికే పెప్సికో సంస్థకు చైర్మన్, సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. త్వరలో అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ)లో మరో కీలక పదవి చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఐసీసీ బోర్డులో తొలి స్వతంత్ర మహిళా డైరెక్టర్‌గా ఆమెను నియమిస్తున్నట్లు ఐసీసీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆమె వచ్చే జూన్‌లో బాధ్యతలు స్వీకరిస్తారు. నియామకానికి సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం లభించినట్లు మండలి వెల్లడించింది. పరిపాలనను మెరుగుపర్చే లక్ష్యంతో బోర్డులోకి కొత్తగా ఒక ఇండిపెండెంట్ డైరెక్టర్‌ను తీసుకోవాలని అది కూడా మహిళ అయి ఉండాలని 2017 జూన్‌లో నిర్వహించిన ఐసీసీ మండలి సమావేశంలో పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఫార్చ్యూన్ మ్యాగజైన్ ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన వందమంది మహిళా వ్యాపారవేత్తల జాబితాలో చోటు సంపాదించారు. ఈ సందర్భంగా ఐసీసీ చైర్మన్ శశాంక్ మనోహర్ మాట్లాడుతూ.. ఇంద్ర ఐసీసీలోకి వస్తున్నందుకు సంతోషంగా ఉంది. పరిపాలనలో మహిళా డైరెక్టర్‌ను భాగస్వామ్యం చేయబోతున్నాం. ఇదొక కీలక నిర్ణయం. ప్రపంచ వ్యాపార రంగంలో ఆమెకున్న అపార అనుభవం తమకు ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.



ప్రతీ వికెట్ కీలకమే : జులన్

కింబర్లే:

తాను తీసిన 200 వికెట్లలో ప్రతి వికెట్టూ ప్రత్యేకమైనదే అని అంటోంది భారత మహిళా క్రికెటర్ జులన్ గోస్వామి. తాజాగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో ఓ వికెట్ పడగొట్టడంతో జులన్ వన్డే క్రికెట్లో 200 వికెట్లు పడగొట్టిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జులన్ మాట్లాడుతూ..'ఇప్పటి వరకు నేను తీసిన ప్రతి వికెట్ నాకు గుర్తుంది. నా తొలి వికెట్ 2002లో ఇంగ్లాండ్‌పై సాధించా. చెన్నైలో జరిగిన మ్యాచ్‌లో కారోలిన్ అట్కిన్స్ గాల్లోకి లేపిన బంతిని మిథాలీరాజ్ క్యాచ్ పట్టింది. ఇప్పటి వరకు నేను సాధించిన ప్రతి వికెట్టూ నాకెంతో ప్రత్యేకమైనది' అని జులన్ తెలిపింది. 'నేను 200 వికెట్ల మైలు రాయిని అందుకున్న మ్యాచ్‌లో విజయం సాధించడం కూడా చాలా సంతోషంగా ఉంది. నా కుటుంబసభ్యులకు, సహచర ఆటగాళ్లకు, కోచ్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. మధ్య మధ్యలో గాయాల బారిన పడతాం. ఆటలో ఇవన్నీ మామూలే. సిరీస్‌ల మధ్య రెండు మూడు నెలల విరామం ఉండటంతో గాయాల నుంచి కోలుకుని తిరిగి ఫామ్‌ను అందుకోవడం సులువుగా ఉంటుంది' అని జులన్ వివరించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్-దక్షిణాఫ్రికా మధ్య చివరి వన్డే శనివారం జరగనుంది. ఇప్పటికే 2-0తో భారత్ సిరీస్‌ను గెలుచుకున్న సంగతి తెలిసిందే.



నేడే పింక్ వన్డే

- ఈ ఫార్మాట్‌లో ఓటమెరుగని ప్రొటీస్
- ఆ జెర్సీలతో ఆడిన మ్యాచ్‌లు 5
- 3-0 లీడ్‌లో టీమిండియా



జొహాన్నెస్‌బర్గ్ :

ఆరు వన్డేల సిరీస్‌లో వెనుకబడిన దక్షిణాఫ్రికా శనివారం భారత్‌తో నాలుగోవన్డే ఆడబోతోంది. ఈ మ్యాచ్ ప్రొటీస్‌కు మరింత ప్రత్యేకం. వాండరర్స్‌లో జరిగే ఈ వన్డేలో దక్షిణాఫ్రికా ఆటగాళ్లు పింక్ కలర్ జెర్సీలతో బరిలోకి దిగనున్నారు. ఏటా బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన నిమిత్తం దక్షిణాఫ్రికా ఈ విధంగా వన్డేలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ రకమైన దుస్తుల్లో జరిగిన ఐదు వన్డేల్లో దక్షిణాఫ్రికా అప్రతిహత జైత్రయాత్ర సృష్టించింది. డిసెంబరు 2013లో టీమిండియాతో జరిగిన మ్యాచ్‌లో 141 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన నిమిత్తం ఈ వన్డేకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరుకావచ్చునని దక్షిణాఫ్రికా భావిస్తోంది. అలాగే ప్రొటీస్‌కు మద్దతు తెలిపే వారు కూడా ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ పింక్ వన్డేపై దక్షిణాఫ్రికాలోని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఈ పింక్ వన్డే ప్రభావం ఎలా ఉందంటే... దక్షిణాఫ్రికా లోగో కూడా పింక్ కలర్‌లో మారిపోయింది. గాయం నుంచి కోలుకున్న ఏబీ డివిలియర్స్ నేటి జట్టులో చేరనున్నాడు. ఇది తమకు కలిసి వస్తుందని దక్షిణాఫ్రికా భావిస్తోంది. పింక్ వన్డేలో ఏబీకి అద్భుతమైన రికార్డు ఉంది. దానిని కొనసాగిస్తాడని పలువురు ఆశిస్తున్నారు. పింక్ వన్డేల్లో భాగంగా టీమిండియాతో ఆడిన మ్యాచ్‌లో ఏబీ 47 బంతుల్లో 77 పరుగులు సాధించాడు. పేస్, బౌన్స్‌కు అనుకూలించే వాండరర్స్ పిచ్‌పై 2013లో దక్షిణాఫ్రికా ఏకంగా 358/4 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌ను భారత్ 141 పరుగుల తేడాతో కోల్పోయింది. ప్రస్తుతం ఆరువన్డేల సిరీస్‌లో భాగంగా 3-0 లీడ్‌తో ఉన్న భారత్‌పై ఈ వన్డేలో ఎలాగైనా గెలవాలని దక్షిణాఫ్రికా పట్టుదలగా ఉంది. టీమిండియా పరంగా నాలుగో వన్డేలో గెలిస్తే చరిత్ర సృష్టించినట్టే. ర్యాకింగ్స్‌లో ప్రథమ స్థానం మరింత బలపడుతుంది. ప్రొటీస్‌పై రెండు సెంచరీలు బాదిన కెప్టెన్ విరాట్ కోహ్లి భయంకరమైన ఫామ్‌లో ఉన్నాడు. మరో విజయంపై, సిరీస్‌పై కన్నేశాడు.

ముంబై ఇండియన్స్ స్పాన్సర్‌గా శామ్‌సంగ్

న్యూఢిల్లీ :

ఐపీఎల్‌లో మూడుసార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ ఆటగాళ్లు ఈ ఏడాది కొత్త జెర్సీల్లో సందడి చేయనున్నారు. ఇక నుంచి వారి జెర్సీలపై వీడియోకాన్ డీ2హెచ్ బదులు శామ్‌సంగ్ అని కనిపించనుంది. తాజాగా ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ శామ్‌సంగ్.. ముంబై ఇండియన్స్ ఫ్రాంఛైజీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఏడాది ఐపీఎల్‌లో ఆటగాళ్లు ధరించే జెర్సీ హక్కులను శామ్‌సంగ్ సొంతం చేసుకుంది. ఇందుకోసం శామ్‌సంగ్ రూ.25 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. తాజా ఒప్పందంతో ఐదేళ్ల నుంచి ముంబై ఇండియన్స్ ఆటగాళ్ల జెర్సీలకు ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తోన్న వీడియోకాన్ డీ2హెచ్‌కు తెరపడినట్లే. ఐపీఎల్ ప్రారంభ సీజన్‌లో ముంబై ఇండియన్స్ ఆటగాళ్ల జెర్సీలకు అసలు స్పాన్సరే లేరు. 2009లో 'ఐడియా' మొదటిసారి ముంబై ఇండియన్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం ఆ స్థానంలో 'వీడియోకాన్' వచ్చింది. 2011, 2012 సీజన్లలో హీరో హోండా ఆ హక్కులను కైవసం చేసుకుంది. 2013 నుంచి 2017 వరకు వీడియోకాన్ డీ2హెచ్ ముంబై ఇండియన్స్ ఆటగాళ్లు ధరించే జెర్సీలకు సంబంధించిన హక్కులను సొంతం చేసుకుంది. తాజాగా ఆ హక్కులను శామ్‌సంగ్ దక్కించుకుంది.

చాంపియన్ ఆకస్మిక మృతి



మెల్‌బోర్న్:

న్యూఢిల్లీలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్ (2010), జావెలిన్ త్రోయర్ జర్రోడ్ బన్నిస్టర్ (33) ఆకస్మికంగా మృతిచెందాడు. ఈ విషయాన్ని ఆస్ట్రేలియా అథ్లెటిక్స్ అధికారులు శుక్రవారం వెల్లడించారు. ప్రస్తుతం యూరప్‌లోని నెదర్లాండ్స్‌లో తన ప్రేయసితో కలిసి ఉంటున్న జర్రోడ్ అకాల మరణం చెందాడని తమకు సమాచారం అందినట్లు ఆసీస్ అథ్లెటిక్స్ అసోసియేషన్ వివరించింది. 2008లో బ్రిస్బేన్‌లో జరిగిన అథ్లెటిక్స్‌లో భాగంగా 89.02 మీటర్లు జావెలిన్ విసిరి రికార్డు సృష్టించాడు జర్రోడ్. 2010లో న్యూఢిల్లీలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో జావెలిన్ త్రో విభాగంలో స్వర్ణాన్ని కొల్లగొట్టాడు. 18 నెలల్లో మూడుసార్లు డోపింగ్ టెస్టులకు హాజరుకాలేదన్న కారణంగా 2013లో 20 నెలలపాటు నిషేధం విధించారు. నిషేధం అనంతరం పలు అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొని పతకాలు సాధించాడు ఈ ఆసీస్ అథ్లెట్. 'జర్రోడ్ మృతిపై సంతాపం తెలియజేస్తున్నా. టాలెంటెడ్ ప్లేయర్‌ను కోల్పోయాం' అంటూ వరల్డ్, ఒలింపిక్ హర్డిల్స్ చాంపియన్ సాలీ పియర్‌సన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. కెరీర్‌పై దృష్టిపెట్టిన ఈ జావెలిన్ త్రోయర్ శిక్షణ కోసం యూరప్ వెళ్లాడు. ప్రేయసితో కలిసి నెదర్లాండ్స్‌లో ఉంటున్న జర్రోడ్ ఈ క్రమంలో అకస్మాత్తుగా మృతిచెందాడు.

క్రీడాహబ్‌గా సిద్దిపేట

- స్టేడియంకు అంతర్జాతీయ గుర్తింపు
- 15 రోజుల్లో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు
- క్రీడాకారులకు పూర్తి సహకారం
- హరీశ్‌రావు హామీ



విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్ :


సిద్దిపేట స్టేడియంలో టీ20లీగ్ మ్యాచ్‌లు జరగడం హర్షణీయమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం జరిగిన టీ20 క్రికెట్ మ్యాచ్‌ను ఆయన టాస్ వేసి ప్రారంభించారు. సిద్దిపేట స్టేడియంకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ప్రత్యేకంగా ఇక్కడ లీగ్ మ్యాచ్‌లు జరగడానికి కృషి చేసిన హెచ్‌సీఏకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్టేడియం అభివృద్ధికి క్రీడాకారుల ఉత్సాహమే కారణమని చెప్పారు. త్వరలో సిద్దిపేటను క్రీడాహబ్‌గా మారుస్తామన్నారు. డే అండ్ నైట్ మ్యాచ్‌లు జరిగేందుకు వీలుగా 15రోజుల్లోగా ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు అన్ని విధాలా అండగా ఉండి, అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. క్రికెట్‌తో పాటు అథ్లెటిక్ లాంటి వాటిలో కూడా ముందు ఉండాలని క్రీడాకారులకు సూచించారు. రాష్ట్ర ,జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ కూడా క్రీడారంగాన్ని బలోపేతం చేయడానికి మైదానాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేలా ప్రభుత్వ పాఠశాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు అవుతోందని, ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపర్చుకొని పేదలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎంపీ కొత్త ప్రభాకరరెడ్డి, హెచ్‌సీఏ అధ్యక్షుడు జి.వివేక్, సిద్దిపేట చైర్మన్ రాజనర్స్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'బాబూ.. సెల్ఫీలు సరే..! ఆట ఏది..?'

పాండ్యకు అభిమానుల చురక

జొహాన్నెస్‌బర్గ్:

దక్షిణాఫ్రికా పర్యటనలో సహచర ఆటగాళ్లతో సెల్ఫీలు దిగడం మాని ఆటపై దృష్టి పెట్టి పరుగులు సాధించాలని భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు నెటిజన్లు చురకలు అంటించారు. వన్డే సిరీస్ కోసం ప్రస్తుతం కోహ్లిసేన దక్షిణాఫ్రికాలో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా హార్దిక్ పాండ్య సహచర ఆటగాళ్లతో కలిసి దిగిన సెల్ఫీని ట్విటర్ ద్వారా అభిమానులతో పంచుకున్నాడు. నాలుగో వన్డే కోసం జొహాన్నెస్‌బర్గ్ వెళ్లే సమయంలో ఎయిర్‌పోర్టులో దిగిన ఫొటోను పంచుకున్న పాండ్య 'కేప్‌టౌన్‌లో విజయం సాధించాం. మరోసారి జొహాన్నెస్‌బర్గ్‌కు' అని పేర్కొన్నాడు. ఈ ఫొటోలో పాండ్యతో పాటు ధోనీ, బుమ్రా తదితరులు ఉన్నారు. ఈ ఫొటోను చూసిన అభిమానులు పాండ్యకు చురకలు అంటించడం మొదలుపెట్టారు. ఎందుకంటే ప్రస్తుత వన్డే సిరీస్‌లో పాండ్య ఆశించిన ప్రదర్శన చేయలేపోతున్నాడు. దీంతో నెటిజన్లు 'బాబూ.. సెల్ఫీలు మాని.. ముందు ఆటపై దృష్టిపెట్టు. పరుగులు సాధించు.. వికెట్లు తీయి.. నువ్వు అక్కడికి ఎందుకు వెళ్లావు.. సెల్ఫీలు దిగడానికా.. మ్యాచ్‌లు ఆడటానికా' అంటూ చురకలు అంటించారు. ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య నాలుగో వన్డే శనివారం జొహాన్నెస్‌బర్గ్‌లో జరగనుంది.



మేరీమాత ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :

దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన విజయవాడ గుణదల మేరీమాత ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. బిషప్ గ్రాసీ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కథోలిక పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు దివ్యపూజను సమర్పించారు. దేవుని రక్షణ ప్రణాళికను కొనసాగించేందుకు మేరీమాత ప్రభువును ఈ లోకానికి రక్షకుడిగా పంపిందని ప్రసంగించారు. మత సామరస్యానికి ప్రతీకగా గుణదల మేరీమాత ఉత్సవాల్ని నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా వేలాది మంది క్రైస్తవ ఆరాధకులు తరలివచ్చి మేరీమాత ఆశీస్సులు పొందుతున్నారని వివరించారు. వేదికపై సిల్వర్ జుబిలేరియన్ గురువులను సన్మానించారు. తొలిరోజు వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిమంది తరలివచ్చి మేరిమాతను దర్శించుకున్నారు. దివ్యపూజలో సిల్వర్ జుబిలేరియన్ గురువులు ఫాదర్ గొరుముచ్చు జ్ఞానేసు, ఫాదర్లు నక్కా దేవిడ్ రాజు, ఇంజెపాల్, ఎం.గాబ్రియేలు,



పల్లె జోజిబాబు, అంతయ్య, బిషప్ రాజారావు పుణ్యక్షేత్రం రెక్టర్ విలియం జయరాజు, ఎన్‌సీసీ డైరెక్టరు పి.థామస్, ఎడ్యుకేషన్ డెస్క్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ కె.నరసింహరాయలు, డయాసిస్‌కు చెందిన 80 మంది కథోలిక క్రైస్తవులకు దివ్యప్రసాదాన్ని అందజేశారు. తొలి రోజు సాయంత్రం నుంచి గుణదల మేరిమాత ఆలయం పరిసర ప్రాంతాలు రద్దీగా మారాయి. మూడు రోజులపాటు కొనసాగే ఉత్సవాలు 11వ తేదీతో ముగియనున్నాయి. పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.